# తానా పత్రిక


**Telugu Association of North America**

❖ Volume - 30 ❖ Issue - 9 ❖ August 2023




# We congratulate

# TANA

**on it's**

**Successful completion of**

# 23rd National Conference

A real estate investment firm that prides itself on expanding your investment portfolio while standing firm on our commitment to grow with you.



ilan™

***Chowdary 'Charlie' Yalamanchili, President***

www.ilaninvestments.com • charlie.yalamanchili@ilaninvestments.com

(281) 444-1585 Phone • (832) 415-0333 Fax

4420 Cypress Creek Parkway • Houston, TX 77068

EQUAL HOUSING OPPORTUNITY

# TELUGU ASSOCIATION OF NORTH AMERICA

A 501(c)(3) Certified Nonprofit Organization - Tax ID - 36-3060732

26233 Taft RD, Novi, MI 48374

# ఉత్తర అమెరికా తెలుగు సంఘము

Volume-30 Issue-9

August 2023


*Our Mission*

**"To identify and address social, cultural and educational needs of North American Telugu Community in particular and Telugu people in general"**


*Editor*

**Sai Brahmanandam Gorti**

gorthib@gmail.com

*Associate Editor*

**Naveen Vasireddy** (India)

kathanaveen@gmail.com

*President*
**Niranjan Srungavarapu**
(248) 342-6872; president@tana.org

*Executive Vice President*
**Naren Kodali**
703-371-5029; evp@tana.org

*Immediate Past President*
**Anjaiah Chowdary Lavu**
(770) 235-2709; lachowdary@yahoo.com

*Secretary*
**Ashok Babu Kolla**
(270) 293-0003; secretary@tana.org

*Treasurer*
**Venkata (Raja) Kasukurthi**
(201) 270-8648; treasurer@tana.org

*Joint Secretary*
**Sirisha Tunuguntla**
(904) 294-5655; jointsecretary@tana.org

*Joint Treasurer*
**Sunil Pantra**
(248) 469-2349; jointtreasurer@tana.org

*Community Services Coordinator*
**Lokesh Naidu Konidala**
(972) 853-7462; lokeshnaidu2000@gmail.com

*Cultural Services Coordinator*
**Vamsi Vasireddy**
(860) 805-5406

*Women Services Coordinator*
**Uma Katiki**

*International Coordinator*
**Venkata Hiteshwar Vadlamudi**
hiteshvadlamudi@gmail.com

*Sports Coordinator*
**Shashank Yarlagadda**
6013450543; yshashi8@gmail.com

*Councilor-at-large*
**Rajanikanth Kakarla**
(510) 509-8748

*Chairman, Board of Directors*
**Dr. Nagendra Srinivas Kodali**


*Chairman, Foundation*
**Sasikanth Vallepalli**

*Regional Coordinators*

**Rajesh Yarlagadda**
Appalachian
**Satyavardhan Surapaneni**
Capital
**Paramesh Devineni**
DFW
**Bhaskar Malineni**
Mid-Atlantic
**Sriharsha Garikapati**
Midwest
**Krishnaprasad Sompalli**
New England
**Ramakrishna Vasireddy**
New Jersey
**Krishna Deepika Sammeta**
New York
**Vishnu VJampala**
North
**Sriman N Yarlagadda**
North Central
**Srinivas Abburi**
North West
**Venkat Adusumilli**
Northern California
**Sivalingaprasad Chava**
Ohio Valley
**Sekhar Kolla**
Rocky Mountains
**Imesh Chandra Gupta**
South Central
**Madhukara B Yarlagadda**
South East
**Leelakrishna Sumanth Pusuluri**
South West
**Suresh Mallina**
Southern California



The opinions expressed in TANA Patrika belong to the individual authors and do not necessarily reflect those of TANA or the Editorial Board.




కవర్ ఫోటో
వేణు చల్లా



అంగరంగ వైభవంగా
తానా 23వ మహాసభలు
12

తానా వలంటీర్లు,
డోనర్లకు సత్కారం
20





డాలస్‌లో
డా॥ గంగాధర శాస్త్రి
గీతాగాన ప్రవచనం
30



న్యూయార్క్ తానా పాఠశాల
వార్షికోత్సవం
26

వంశీ ఏవో కొన్ని
గుర్తుకొస్తున్నాయి
లేడీస్ టైలర్-3
34



## ఇంకా...

Editorial ... 05
TANA President's Message ... 06
TANA Foundation Donation Form ... 10
తానా బోర్డ్ నూతన కార్యవర్గం ... 22
తానా ఫౌండేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటు ... 23
దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ ... 25
ఒహాయో వ్యాలీ క్రికెట్ టోర్నమెంట్ ... 29
నివాళి - తెలుగు కథకు బంగారు మురుగు
- జంపాల చౌదరి ... 44
కథ - బంగారు మురుగు
- శ్రీరమణ ... 48
నివాళి - రమ్మీ-పక్కన్నేను
- సాయిబ్రహ్మానందం గొర్తి ... 59
చట్టాల అవగాహనకు చదవాల్సిన పుస్తకం ... 64
తెలుగు అందానికి క్రేజ్
- శ్రీ అట్లూరి & జలపతి ... 66



# సంపాదకీయం

తానాపత్రిక పాఠకులకీ, సభ్యులకీ, అందరికీ శుభాకాంక్షలు!

జులై నెలలో 23వ తానా మహాసభలు ఫిలడెల్ఫియాలో ఘనంగా జరిగాయి. ఆ సభల విశేషాలన్నీ చిత్రాలతో సహా ఈ సంచికలో ప్రచురించాము. ఈ సభల్లో సాహిత్య సమావేశాలు ఘనంగా జరిగాయి. తెలుగు రాష్ట్రాల నుండి పలు ప్రముఖ రచయితలు విచ్చేసి, వారి ఉపన్యాసాలతో సాహిత్యసభకి నిండుదనం చేకూర్చారు.

ఆసక్తికరమైన ప్రసంగాలూ, చర్చలూ ఈ సమావేశాలకి నిండుదనం తీసుకొచ్చాయి.

క్రితం నెలలో ప్రముఖ రచయిత శ్రీ రమణ సాహిత్య లోకాన్ని వదిలేసి వెళ్లిపోవడం సాహిత్యప్రియులకి బాధాకరమైన విషయం.

రాసే వాక్యంలో సొగసూ, మాటల్లో పదునూ ఈయన రచనల ప్రత్యేకత. తాను రాసిన కథ పేరునే ఇంటి పేరుగా మార్చి మిధునం శ్రీరమణ అని పాఠకులు పిలుచుకున్నారంటేనే అర్థమవుతుంది తెలుగు సాహిత్యంలో ఆయన రచనల గొప్పదనం.

పాత్రికేయుడిగా, నవలాకారుడిగా, కథకుడిగా శ్రీ రమణ స్థానం ప్రత్యేకమైనది. ముఖ్యంగా ఆయన చేసిన వ్యంగ్య రచనలకి కాల పరిమితి లేదు. ఎప్పుడు చదివినా పాఠకుల పెదవులపై చిరునవ్వులు చిందుతూనే వుంటాయి.

ఈ సంచికలో ఆయన నివాళి వ్యాసాలు పొందుపరిచాము.

తానా సమావేశ విశేషాలే కాకుండా, ఇందులో కథలూ, వ్యాసాలూ, సినిమా కబుర్లూ ఉన్నాయి.

వచ్చే నెల నుండి ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్‌గారి నవల సీరియల్‌గా ప్రచురిస్తాము.

అభినందనలతో...

సాయి బ్రహ్మానందం



## President's Message

**NIRANJAN SRUNGAVARAPU**
***President - 2023-25***

తానా కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ నమస్కారములు...

అమెరికాలో అతి పెద్ద తెలుగు సంఘంగా, ప్రపంచంలోని తెలుగు సంఘాలకు మాతృకలాంటి సంస్థగా పేరు పొందిన ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) అధ్యక్ష పదవిని చేపట్టే అవకాశాన్ని నాకు అందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు.

దశాబ్దాల చరిత్ర ఉన్న తానా పేరు ప్రతిష్టలను మరింత పెంచేలా కమ్యూనిటీకి సేవలందించడానికి వీలుగా నా కొత్త టీమ్‌తో కలిసి తగిన ప్రణాళికలను రూపొందించుకుని, అందరి సహకారంతో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తానని చెబుతున్నాను. అలాగే తానాలో చేరిన ప్రతి ఒక్క సభ్యునికి ప్రయోజనం కలిగేలా కొన్ని సంస్థలతో మాట్లాడుకున్నాము. త్వరలోనే దీనికి సంబంధించిన వివరాలను తెలియజేస్తాము.

రానున్న రెండేళ్లలో ఎన్నో వినూత్న కార్యక్రమాలకు అందరి సహకారంతో శ్రీకారం చుట్టబోతున్నాము. తానా చేసే కార్యక్రమాలు ప్రపంచ నలుమూలలా ఉండే తెలుగు ప్రజలందరికి చేరేలా, తానా సభ్యుల సంఖ్య మరింత పెరిగేలా, తానా సంస్థ బలోపేతానికి, తానా కీర్తిప్రతిష్టలు దశదిశలా విస్తరించేందుకు నాతోపాటు నా టీమ్ సభ్యులు కూడా కృషి చేస్తారని ఈ సందర్భంగా హామి ఇస్తున్నాను. అంతేకాకుండా సభ్యులకు ఏ ఆపద వచ్చినా, ఏ కష్టం వచ్చినా ఆదుకునేందుకు నాతోపాటు కార్యవర్గ సభ్యులందరూ అందుబాటులో ఉంటారు.

అమెరికాలో మన తరువాతి తరం కూడా తానాలో, తానా కార్యక్రమాల్లో మరింత భాగస్వాములయ్యేలా చర్యలు చేపడుతాము. విద్యార్థుల కోసం, యువత కోసం, మహిళల కోసం ప్రత్యేకంగా

కార్యక్రమాలను చేపడతాము. మన సంస్కృతీ, మన భాషా వైభవాన్ని తెలియజేసే కార్యక్రమాలతో పాటు కొత్తవారి కళాప్రతిభను వెలికితీయడానికి వారికి అవసరమైన వేదికను ఏర్పాటుచేసి వారి కళానైపుణ్యాన్ని అందరికీ తెలియజేసేలా కార్యక్రమాలను నిర్వహిస్తాము. బిజినెస్ రంగంలో వారికి మెళకువలను తెలియజేసి వారిని ఎంటర్‌ప్రెన్యూరర్‌లుగా తీర్చిదిద్దే కార్యక్రమాలు వంటివి ఏర్పాటుచేశాము.

అమెరికాలో ఉద్యోగం చేస్తున్న ఎంతోమందికి వారి ఉద్యోగంలో ఉన్నతస్థానానికి చేరుకునే లక్ష్యసాధనకు అవసరమైన గైడెన్స్‌ను, ట్యాక్స్ , వీసా వంటి విషయాల్లో వారికి అవసరమైన సూచనలు అందించే విధంగా కార్యక్రమాలను నిర్వహిస్తాము.

ఇండియా నుంచి వచ్చిన తల్లితండ్రుల కోసం, ఇక్కడ ఉన్న వృద్ధుల కోసం పలు కార్యక్రమాలను చేపట్టనున్నాము. ఆధ్యాత్మిక, ఇతర రకాల పుస్తకాలతో ఓ లైబ్రరీని అవసరమైన అన్నీచోట్ల ఏర్పాటు చేయించడం, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణలో వారు పాలుపంచుకునేలా చేయడం, వారికి అవససరమైన వైద్య సౌకర్యాలను కల్పించడం వంటివి చేయనున్నాము.

తానా టీమ్ స్క్వేర్‌ను మరింత విస్తరించి ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంతోపాటు, కష్టాలలో ఉన్న వారికి కూడా ఆసరాను అందించే విధంగా బలోపేతం చేయనున్నాము. తానా ఫౌండేషన్ ద్వారా తెలుగు రాష్ట్రాల్లో మరిన్ని సేవా కార్యక్రమాలను ఏర్పాటుచేయనున్నాము. ఆరోగ్య శిబిరాలు, అనాథ సేవాకార్యక్రమాలు, వారధి, గ్రంధాలయాల అభివృద్ధి, ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ తరగతుల ఏర్పాటు, రైతు కోసం వంటి ప్రస్తుతం ఉన్న కార్యక్రమాలతో పాటు మరిన్ని సేవా కార్యక్రమాలు తానా ఫౌండేషన్ ద్వారా విస్తృతంగా అందించనున్నాము.

తానా కేర్స్ ద్వారా, తానా క్యూరీ, తానా బ్యాక్‌ప్యాక్ కార్యక్రమాలు మరింతగా చేయనున్నాము. బోన్‌మారో డ్రైవ్స్, బ్లడ్ డ్రైవ్స్, ఫుడ్ అండ్ టాయ్ డ్రైవ్స్, విల్ సెమినార్లు, ట్రైనింగ్ వర్క్‌షాప్స్,

టాక్స్ సెమినార్లు, కాలేజీ ప్లానింగ్ సెమినార్లు, ఫైనాన్సియల్ ప్లానింగ్ సెమినార్లు, వెబినార్లు, సిపిఆర్ ట్రైనింగ్ కార్యక్రమాలను కొనసాగిస్తూనే మరిన్ని సేవా కార్యక్రమాలు అందించటానికి కృషిచేస్తామని చెప్పారు. సమ్మర్ క్యాంప్‌లు, బాలోత్సవాలతోపాటు తెలుగు సాహిత్య కార్యక్రమాలను ప్రపంచ నలుమూలలా తీసుకువెళ్లటం, ప్రపంచ సాహిత్యవేదిక, ప్రపంచ సాంస్కృతిక మహోత్సవ కార్యక్రమం వంటివి చేపట్టటానికి కృషిచేస్తాము. ప్రాచీన కళలకు, తెలుగుభాషకు సేవలు చేస్తున్న మహామహులను గౌరవిస్తూ వారిని తగురీతిలో ప్రోత్సహిస్తూ, గౌరవ సత్కారాలు అందజేస్తాము. నేటి తరాల పిల్లలకు తెలుగుభాషను మరింత చేరువ చేసేలా, వారికి భాషా సౌందర్యం అవగతమయ్యేలా పాఠశాల ద్వారా నేర్పించనున్నాము. యూత్ ఫెస్టివల్స్, సెమినార్స్‌ను విస్తృత స్థాయిలో నిర్వహించాలని సంకల్పించాము.

తానా ఎగ్జిక్యూటివ్ కమిటీ, బోర్డ్, ఫౌండేషన్ సూచనలు, సలహాలను గౌరవిస్తూ, అందరినీ సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాలను నిర్వహిస్తాము. తానా, అమెరికాలోని అన్ని తెలుగు సంఘాలతోపాటు ఇతర దేశాల్లో ఉన్న తెలుగు సంఘాలను కలుపుకుంటూ ప్రపంచంలోని తెలుగువారికి ప్రయోజనం కలిగేలా కార్యక్రమాల రూపకల్పన చేసి నిర్వహించనున్నాము.

సమాజ శ్రేయస్సే కుటుంబ శ్రేయస్సుగా భావించే కార్యవర్గ సభ్యులు ఉన్న ఈ టీమ్‌తో ఈ రెండేళ్లలో మీరంతా మెచ్చేలా కార్యక్రమాలు, సేవలు ఉంటాయని హామి ఇస్తూ...

సదా మీ సేవలో...

మీ
నిరంజన్ శృంగవరపు


ఉత్తర అమెరికా తెలుగు సంఘము

# Telugu Association of North America

A 501(c)(3) Certified Nonprofit Organization - Tax ID: 36-3060732

Our Youth are Our Heritage
Est. 1977
www.tana.org

# TANA Member Benefits








## Car Rentals

**Enterprise and National Car Rental**
Account # OSMBAQT| Discount upto 10% |Prioirty car rental

**Budget Car Rental:** CDP# V124932 | Discount upto 30% | Unlimited mileage | Free Add on Driver

**Avis Car Rental:** CDP# T326011 | Discount upto 30% | Unlimited mileage | Free Add on Driver

**Dollar Car Rental:** CDP# 3075644 | Discount 7% off Base rates | Free Additional Driver | Unlimited Mileage

**Thrifty Car Rental:** CDP# 3075647 | Discount 7% off Base rates | Free Additional Driver | Unlimited Mileage

## Hotel and Hospitality

**Hyatt Group:** Corporate Code 225686 | 15% Discount on all participating Hyatt Group Hotels
Enter you're the corporate code under Special Rates- Corporate or Group code.

**IHG Group:** Corporate Code 787101128 | 7% Discount on all participating IHG Hotels

**Choice Group:** Corporate Code 00746710 5% Discount on all participating Choice Hotels Group

## Residential Services

**Sherwin Williams:**
Corporate Account# 7901-4243-4
Upto 60% off

**Mattress Firm:**Corporate Account#13081634
Upto 65% off
Please reach out to Ashok Kolla to place order

## Automobile

**Discount Tires:** Corporate Account 63928
10% Discount on All tires
Price match guaranteed.

**Mavis Tires:** Corporate Account 12956
15% Discount on Tires, Brakes & Other Services | Price match guaranteed.

**Jiffy Lube:** Corporate Account 13081634
15% off oil changes

**Valvoline:** Corporate Account P4083246
15% off oil changes, and car services | Tax Exempt

**Take 5:** Corporate Account 172285
25% off on all services | Extra 5% off before 9 AM and afer 5PM
Additional 5% off Ancillary items

**NAPA Autoparts:** Corporate Account 18776
Upto 30% off car parts and accessories
Tax Exempt



**Niranjan Srungavarapu**
TANA, President



**Ashok Babu Kolla**
TANA, Secretary

We believe members are heart for our organization and we will continuously strive to provide more benefits for our members. Should you have any questions regarding this benefits,
**Please feel free to call Ashok Kolla @ 1-270-293-0003**

# TANA FOUNDATION

*Division of Telugu Association of North America (TANA)*
*A not-for profit organization, Tax ID 36-3060732*

***To Donate or pledge please visit www.tana.org/donate or www.tanafoundation.org/donation or mail this form***

***We make a living by what we get; we make a life by what we give.***

## TANA FOUNDATION DONATION FORM

Name (First, Last): ______________________________________________

Address: ______________________________________________

Email Address: __________________________ Phone: ____________________

I would like to sponsor the following:

- Orphanages: US$__________
- Vaaradhi US$__________
- Scholarships ($250 each): US$__________
- Eye Camp ($600) (Requires filling the sponsorship form on the web): US$__________
- Cancer Camp ($1500 each): US$__________
- Cleft Lip Surgeries ($250 each): US$__________
- Libraries ($500 each): US$__________
- Other (Specify) ____________________ US$__________

Frequency (Check one) : ☐ One time ☐ Monthly ☐ Yearly

Check Number: ____________________ (Payable to TANA Foundation)

Credit Card Number: ______________________________________________

Billing Address: ______________________________________________

CV Code: ______________

*Please mail the completed form to:*

**TANA Foundation**
**Treasurer**
26233 Taft Road,
Novi, MI 48374.

***For any questions or comments, please send an email to jaytalluri@gmail.com***

WWW.TECHINSURANCEINC.COM

# YOUR EMPLOYEES HEALTH OUR PROMISE



HEALTH INSURANCE FOR IT COMPANIES

BUSINESS INSURANCE

VISITORS INSURANCE



**MURALI TALLURI**
FOUNDER
+1 (512) 917 - 8686
murali@techinsuranceinc.com

TECH INSURANCE AGENCY
EMPLOYEE BENEFITS & BUSINESS INSURANCE

(512) 917-8686
Fax:1-512-829-3488

Contact us:3000 Polar Ln, Unit#802
Cedar Park ,TX,78613




# అంగరంగ వైభవంగా 23వ తానా మహాసభలు

ఉత్తర అమెరికాలోని, ఫిలడెల్ఫియా నగరం పెన్సిల్వేనియా కన్వెన్షన్ సెంటర్‌లో జులై 7,8,9వ తేదీలలో తానా 23వ మహాసభలు అంగరంగ వైభవంగా జరిగాయి. మూడ్రోజులపాటు ఆటపాటలు, ప్రముఖుల ప్రసంగాలతో ఈ వేడుకలు అందరినీ అలరించాయి. భారతదేశ 13వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుగారు ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయనతోపాటు సుప్రీంకోర్టు 48వ ప్రధాన న్యాయమూర్తి నూతనపాటి వెంకట రమణగారు, 'నటసింహం' నందమూరి బాలకృష్ణ







తదితరులు ఈ కార్యక్రమాలకు హాజరయ్యారు.

దశాబ్ద కాలంగా ఉత్తర అమెరికాలో ఎటువంటి తెలుగు సంస్థలకు హాజరుకానటువంటి రీతిలో మొదటిరోజు బాంక్వెట్ కార్యక్రమానికి సుమారు ఎనిమిది వేల మందితో మహాసభల కిక్ ఆఫ్ మొదలైంది. మరుసటి రెండు రోజులు ఇరవైవేల పైచిలుకు ప్రవాస తెలుగువారితో మహాసభల ప్రాంగణం అంతటా సందడి వాతావరణం నెలకొంది.

తొలిరోజు సంధ్యవేళ మొదలైన బాంక్వెట్ డిన్నర్ వేదికపై 23వ మహాసభల సావనీర్‌ను విడుదల చేయడం జరిగింది. ఈ క్రమంలోనే వెంకయ్య నాయుడుగారికి తానా అధ్యక్షులు అంజయ్య చౌదరి లావు, కాన్ఫరెన్స్ కోఆర్డినేటర్ రవి పొట్లూరి, చైర్మన్ శ్రీనివాస్ లావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రవి మందలపు, ఓవర్సీస్ డైరెక్టర్ వంశీ కోట తదితరులు చిరుసత్కారం చేశారు. అనంతరం ఆయన చేతుల మీదుగా పలువురికి తానా ఎక్సలెన్స్ అవార్డులు అందజేశారు. ఆ తర్వాత 'నటసింహం' నందమూరి బాలకృష్ణను కూడా తానా ప్రతినిధులు సత్కరించారు. ఆయన చేతుల మీదుగా పలువురికి తానా మెరిటోరియస్ అవార్డులను అందజేశారు. అదే వరుసలో తానా ప్రెసిడెన్షియల్ స్పెషల్ అవార్డులు, రికగ్నిషన్ అవార్డులు కూడా అందజేశారు.





ఇదే వేదికపై ప్రముఖ నిర్మాత దిల్ రాజు, తెలంగాణ కేబినెట్ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, కాంగ్రెస్ నేత సీతక్క, హీరోయిన్ శ్రీలీల, కథానాయకుడు నిఖిల్ తదితరులను కూడా సత్కరించారు. ఈ క్రమంలోనే బాంక్వెట్, అవార్డ్ కమిటీ, ఆర్గనైజేషన్ల రికగ్నిషన్ కార్యక్రమం కూడా చక్కగా జరిగింది. ఆ తర్వాత కవీస్ స్కూల్ ఆఫ్ డ్యాన్స్ విద్యార్థులు టాలీవుడ్ పాటలకు డ్యాన్స్ చేసి ప్రేక్షకులను అలరించారు. ఆ తరువాత కాప్రికో బ్యాండ్ లైవ్ మ్యూజిక్ అందరినీ ఆకట్టుకుంది. చివర్లో ప్రముఖ నేపథ్య గాయని చిత్ర, సింహా, కౌసల్య తదితరులు





తమ పాటలతో ప్రేక్షకులను అలరించారు.

ఇక రెండోరోజు ఉదయాన్నే కన్వెన్షన్ సెంటర్ లో ఏర్పాటుచేసిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో తానా నాయకులంతా పూజలు చేశారు. అనంతరం తానా అధ్యక్షులు అంజయ్య చౌదరి లావు, కాన్ఫరెన్స్ కోఆర్డినేటర్ రవి పొట్లూరి, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ చైర్మన్ బండ్ల హనుమయ్య ప్రసంగాలతో వేడుకలు మొదలయ్యాయి. తానా మహాసభల కోసం ప్రముఖ గీత రచయిత జొన్నవిత్తుల రామలింగ శాస్త్రి రచించిన 'తెలుగు వైభవం' పాటకు స్థానిక నృత్య పాఠశాలలకు



చెందిన విద్యార్థులంతా కలిసి అద్భుతమైన నాట్యం చేశారు. అనంతరం జొన్నవిత్తులను తానా నేతలు సత్కరించారు. అక్కడి నుంచి ఒకదాని తర్వాత మరొకటిగా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. ఆ తర్వాత ప్రముఖ నటులు రాజేంద్ర ప్రసాద్, కాగ్నిజెంట్ సీఈవో రవి కుమార్ ఎస్, ఆస్కార్ పురస్కార గ్రహీత చంద్రబోస్, మాజీ ఎంపీ టీజీ వెంకటేష్, ప్రైమ్ హాస్పిటల్స్ వ్యవస్థాకులు డాక్టర్ ప్రేమ్‌సాగర్ రెడ్డి, తెలంగాణ అమెరికన్ అసోసియేషన్ (టాటా) వ్యస్థాపకులు పైళ్ల మల్లారెడ్డి తదితరులకు తానా నాయకులు సన్మానం చేశారు. రంగ రంగ వైభవంగా ఫ్యాషన్ షో కూడా ప్రేక్షకులను అలరించింది. అనంతరం ఆధ్యాత్మిక జీవితం గురించి, మనం చేసే పొరపాట్ల గురించి సద్గురు జగ్గీ వాసుదేవ్ అద్భుతంగా వివరించారు. ఇదే క్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడును తానా నేతలు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన తెలుగు భాష గొప్పతనాన్ని వివరిస్తూ ప్రసంగించారు.

❈

రెండవ రోజు శనివారం ఉదయం సుమారు పదిగంటలకు తారకరాముని ప్రాంగణాన్ని యువరత్న శ్రీ నందమూరి బాలకృష్ణ, మాజీ ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు, మాజీ సుప్రీమ్ కోర్ట్ చీఫ్ జస్టిస్ శ్రీ నూతలపాటి వెంకటరమణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మురళీమోహన్ గారు, తానా అధ్యక్షులు లావు అంజయ్య చౌదరిగారు తదితరులు పాల్గొన్నారు. బృందావనంలో శ్రీ కృష్ణుడి ప్రతిమ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ శ్రీకృష్ణుని ప్రతిమ చుట్టూ తిరిగేలా ఏర్పాటుచేయడంతో అభిమానులకు కనువిందు చేసింది. అలాగే అన్నగారి అపురూప చిత్రాలు అభిమానులని మంత్రం ముగ్ధుల్ని చేసాయి.

చివరన తెలుగు సినీ రాక్‌స్టార్ సంగీతదర్శకులు దేవిశ్రీప్రసాద్ లైవ్ మ్యూజికల్ కాన్సర్ట్ జరిగింది.

మూడో రోజు వేడుకలు కూడా ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక సాంస్కృతిక పాఠశాలలకు చెందిన విద్యార్థులు తమ ఆటపాటలు, కళా నైపుణ్యాలతో అందరినీ ఆకట్టుకున్నారు. ఈ క్రమంలోనే ధీంతానా బృందాన్ని తానా నేతలు సత్కరించారు. అనంతరం వేదమంత్రాల నడుమ సుప్రీంకోర్టు మాజీ సీజే ఎన్వీ రమణకు ఘనసత్కారం చేశారు. ఆయన ప్రసంగంలో తానా సేవలను చాలా









మెచ్చుకున్నారు. అనంతరం సీనియర్ నటులు మాగంటి మురళీమోహన్ తెలుగు సంస్కృతీ సంప్రదాయాలకు చేసిన సేవలను గుర్తిస్తూ తానా-ఎన్టీఆర్ అవార్డుతో ఆయన్ను గౌరవించారు. 'నటసింహం' నందమూరి బాలకృష్ణ ఈ అవార్డును అందజేశారు. భారత్ బయోటెక్ వ్యవస్థాపకులు కృష్ణ ఎల్లగారిని కూడా తానా లైఫ్‌టైమ్ అఛీవ్‌మెంట్ అవార్డుతో గౌరవించింది. అనంతరం రేవంత్ రెడ్డిసహా పలువురు రాజకీయ నాయకులను కూడా తానా నేతలు ఈ వేదికపై సత్కరించారు. ఆ తర్వాత తానా అధ్యక్షులు అంజయ్య చౌదరి లావు ప్రసంగించారు. అనంతరం బాలకృష్ణ దంపతులను తానా నేతలు సత్కరించారు.

ఈ సందర్భంగా తానా సేవలను బాలకృష్ణ కొనియాడారు.

*

తానా మహాసభల ముగింపు వేడుకల్లో సినీ నటుడు నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ, తన తండ్రిది విశిష్ట వ్యక్తిత్వం అని, నటనకు ఆయన నిర్వచనమన్నారు. పేదల ఆకలి తెలిసిన నాయకుడు అని పేర్కొన్నారు. బసవతారకం ఆసుపత్రికి ప్రవాసులు చూపిస్తున్న ఆదరణకు ధన్యవాదాలు తెలిపారు.

ఈ సందర్భంగా తానా నాయకులు ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టుకు తానా కార్యవర్గం తరపున కోటి రూపాయిల విరాళం అందిస్తూ, చెక్కును బహుకరించారు. డా॥ మూల్పూరి వెంకటరావు, నిమ్మలపూడి జనార్దన్, విద్యాధర్ గారపాటి,, శివ కనకమేడల, నాగ పంచుమర్తి, శ్రీనివాస్ మండిపూడి, మేకా సతీష్‌లు శ్రీ నందమూరి బాలకృష్ణను ప్రత్యేక జ్ఞాపికతో సత్కరించారు. న్యూజెర్సీ అసెంబ్లీలో శ్రీ బాలకృష్ణ సేవలను










గుర్తిసన్తా చేసిన తీర్మానాన్ని చదివి వినిపించి ఆయనకు అధ్యక్షుడు శ్రీ లావు అంజయ్య చౌదరి గారు, కన్వీనర్ పొట్లూరి రవి తదితరులు అంద జేశారు. శ్రీ బాలకృష్ణ తానాకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు అని మీడియా కోఆర్డినేటర్ విశ్వనాధ్ కోగంటి తెలిపారు.

తానా బోర్డు అఫ్ డైరెక్టర్ జనార్దన్ నిమ్మలపూడి విరాళాలు అందించిన దాతలందరికి ప్రత్యేక ధన్యవాదములు తెలి పారు. గత ఏడాది కూడా తానా బసవ తారకం ప్రాజెక్ట్ కోసం కోటి రూపాయలు విరాళం అందించిన విషయం మీ అందరికి తెలిసిందే. శ్రీ నందమూరి బాలకృష్ణ ప్రత్యేకంగా సుమారు ఐదు గంటలకి పైగా నిలబడి



అభిమానులందరికి ఫోటోలు ఇచ్చి అభిమానులని ఆనందింప చేసారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన ప్రతి కార్యకర్తకు, అభిమాను లకి కమిటీ చైర్ సతీష్ వేమా, కార్యక్రమాన్ని పర్యవేక్షించిన తానా బోర్డు అఫ్ డైరెక్టర్ జనార్దన్




నిమ్మలపూడి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. అనంతరం సంగీత రారాజు మ్యూజిక్ మేస్ట్రో ఇళయ రాజా మ్యూజికల్ నైట్ కార్యక్రమం తెలుగు సంగీత ప్రేమికులను మంత్రముగ్ధులను చేసింది.

ఇతర గదుల్లో ధీంతానా పాటల, నృత్య పోటీలు, అగ్రికల్చరల్ ఫోరమ్, జొన్నవిత్తుల ఆధ్వర్యంలో భుజనశతకం, ఎన్నారై మీట్స్, ఐటీ సర్వ్ అలయన్స్ మీట్ అండ్ గ్రీట్, వివిధ అంశాలపై చర్చలు, మాట్రిమొనీ, పాఠశాల కాంపిటీషన్, సాహిత్య సదస్సులు, సీనియర్ సిటిజన్ ఫోరమ్, రీల్స్ అండ్ షార్ట్ ఫిలిం పోటీలు, టీటీడీ శ్రీనివాస కల్యాణం, ఉమెన్స్ ఫోరమ్, యూత్ యాక్టివిటీస్ తదితర కార్య క్రమాలు కూడా ఉత్సాహంగా జరిగాయి.

తానాసభల చివరిరోజునే అధ్యక్షులు అంజయ్య చౌదరి పదవీ కాలం కూడా ముగిసింది. ఈ క్రమంలో నూతన తానా అధ్యక్షులు నిరంజన్ శృంగవరపు ఈ వేదికపైనే ప్రమాణం చేశారు. ఆయన 2023-2025 వరకు ఈ బాధ్యతలు నిర్వహిస్తారు.

ఈ సందర్భంగా మహాసభలను విజయవంతం చేసిన ఆయా కమిటి సభ్యులందరినీ వేదిక పైకి ఆహ్వానించి మహాసభల ఎగ్జిక్యూటివ్ లీడర్‌షిప్ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ, ఏమైనా అసౌకర్యాలు జరిగి ఉంటే, తమని మన్నించాలి అని, అక్కడకు విచ్చేసిన ప్రవాస తెలుగువారిని మహాసభల సమ న్వయకర్త రవి పొట్లూరి కోరారు. ❁



# తానా డోనర్లు, వలంటీర్లకు సత్కారం



ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ఫిలడెల్ఫియాలోని పెన్సిల్వేనియా కన్వెన్షన్ సెంటర్‌లో జూలై 7 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించిన తానా 23వ మహాసభలు విజయవంతం అయ్యాయి. అంగరంగ వైభవంగా జరిగిన ఈ మహాసభలు విజయవంతంగా జరగానికి కృషి చేసిన వలంటీర్లను, డోనర్లను మహాసభల నిర్వాహకులు ఫిలడెల్ఫియాలో జరిగిన ఓ కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. జూలై 30న ఫిలడెల్ఫియాలోని వార్మింస్టర్‌లో లంచ్ ఆన్ మీటింగ్ పేరుతో జరిగిన ఈ సమావేశంలో తానా నాయకులంతా పాల్గొన్నారు.

తానా పూర్వపు అధ్యక్షుడు అంజయ్య చౌదరి లావు మాట్లాడుతూ, మునుపెన్నడూ జరగని రీతిలో తానా మహాసభలు రికార్డు సృష్టించేలా జరిగాయని, అందరి సహకారంతోనే ఈ మహాసభలు విజయవంత మయ్యాయని చెప్పారు. ఇందుకు కృషి చేసిన వలంటీర్లకు, ధన సహాయం చేసిన డోనర్లకు, స్పాన్సర్లకు ఆయన ధన్యవాదాలు చెప్పారు.

కాన్ఫరెన్స్ కన్వీనర్ రవి పొట్లూరి మాట్లాడుతూ, ఈ మహాసభల విజయవంతంగా జరగడం కోసం ఏర్పాటైన కమిటీల సభ్యులు పూర్తి సమయాన్ని కాన్ఫరెన్స్ నిర్వహణ కోసం వెచ్చించారని, వారికి, వారి కుటుంబసభ్యులకు ధన్యవాదాలు చెప్పారు.

కాన్ఫరెన్స్ చైర్మన్ శ్రీనివాస్ లావు మాట్లాడుతూ కమిటీలన్ని తమకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా చేయడం వల్లనే ఈ మహాసభలు ఇంత దిగ్విజయాన్ని సాధించాయని చెప్పారు.

కాన్ఫరెన్స్ సెక్రటరీ సతీష్ తుమ్మల మాట్లాడుతూ, కమిటీ సభ్యుల మధ్య పరస్పర సహకారం, కార్యక్రమాలపై మంచి అవగాహనను ఏర్పరుచుకుని ప్లానింగ్‌గా కార్యక్రమాలు జరిగేలా చూశారన్నారు.

మిడ్ అట్లాంటిక్ రీజినల్ రిప్రజెంటేటివ్ సునీల్ కోగంటి మాట్లాడుతూ, మిడ్ అట్లాంటిక్‌లో ఉన్న తానా నాయకులతోపాటు, ఇతర చోట్ల ఉన్న తానా సభ్యులంతా వలంటీర్‌గా ఈ మహాసభల విజయానికి సహకారాన్ని అందించి విజయవంతం చేశారన్నారు.



ఈ మహాసభల విజయానికి పాటుపడిన 60 కమిటీలను ఈ కార్యక్రమంలో ఘనంగా సత్కరించి, మెమెంటోలను బహుకరించారు. ఎన్టీఆర్ శత జయంతి కార్యక్రమంలో భాగంగా చిత్రీకరించిన వీడియోను ఈ కార్యక్రమంలో ప్రదర్శించారు.

మహాసభలకు డోనర్లుగా వ్యవహరించిన వారిని, స్పాన్సర్లుగా ఉన్నవారిని కూడా ఈ కార్యక్రమంలో భాగంగా వేదికపైకి ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. మెమెంటోలను అందజేశారు. తానా పూర్వపు కార్యవర్గ సభ్యులను, ప్రస్తుత కార్యవర్గ సభ్యులను కూడా అభినందించి సత్కరించారు.

ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ నరేన్ కొడాలి, ట్రెజరర్ రాజా కసుకుర్తి, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ లక్ష్మి దేవినేని, జనార్ధన్ నిమ్మలపూడి, జాయింట్ ట్రెజరర్ సునీల్ పాంత్ర, ఫౌండేషన్ ట్రస్టీలు విద్యాధర్ గారపాటి, శ్రీనివాస్ ఓరుగంటి, సతీష్ మేక, న్యూజెర్సీ రీజనల్ కో ఆర్డినేటర్ రామకృష్ణ వాసిరెడ్డి, తానా 23వ మహా సభల కమిటీలలో సేవలందించిన చైర్మన్లు, సభ్యులు పాల్గొన్నారు.

కాగా ఈ మహాసభలకు దాదాపు 18,000 మందికి పైగా తెలుగువారు హాజరై విజయవంతం చేసిన సంగతి తెలిసిందే.



# తానా బోర్డ్ ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన డా. నాగేంద్ర శ్రీనివాస్ కొడాలి


ప్రతిష్ఠాకరమైన తానా బోర్డు ఛైర్మన్‌గా డా. నాగేంద్ర శ్రీనివాస్ కొడాలి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారితో పాటు కార్యదర్శిగా శ్రీమతి లక్ష్మి దేవినేని కోశాధికారిగా శ్రీ జనార్దన్ (జానీ ) నిమ్మలపూడి కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

డాక్టర్ నాగేంద్ర శ్రీనివాస్ కొడాలి ప్రపంచ ప్రతిష్ఠాకరమైన టెక్సాస్ చిల్డ్రన్స్ హాస్పటిల్‌లో పీడియాట్రిక్ కార్డియో వాస్క్యులర్ అనేస్తేషలోజిలో సేవలందిస్తున్నారు అలాగే బేలోర్ కాలేజీ అఫ్ మెడిసిన్‌లో వైద్యవిద్య బోధిస్తున్నారు. గతంలో తానా బోర్డు కార్యదర్శిగా మరియు తానా-బసవతారకం ప్రాజెక్ట్‌కి ముందు ఉండి మార్గదర్శకాలతో పాటు కోటి రూపాయిల నిధిని సమకూర్చి బసవతారకం ఇండో అమెరికన్ కాన్సర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కి వైద్య పరికరాల కొనుగోలుకు తానా ఫౌండేషన్ తరుపున అందించటంలో ముఖ్య భూమిక పోషించారు. అలాగే సనాతన హిందూ ధార్మిక కార్యక్రమాలు అయిన వేద పాఠశాలలు, గోశాలలు, గురుకులాల, దేవాలయాల అభివృద్ధికి ఆర్థిక వనరులు సమకూర్చటంతో పాటు విశేష సేవలందిస్తున్నారు.

బోర్డు కార్యదర్శిగా ఎన్నికైన శ్రీమతి లక్ష్మి దేవినేని గతంలో తానా బోర్డు కోశాధికారిగా, న్యూజెర్సీ రీజినల్ కోఆర్డినేటర్‌గా, విమెన్ సర్వీసెస్ కో ఆర్డినేటర్ గానే కాకుండా ఇటీవలే జరిగిన 23 వ తానా మహాసభలలో పలు కమిటీలలో సేవలందించారు.

బోర్డు కోశాధికారిగా ఎన్నికైన జనార్దన్ నిమ్మలపూడి గతంలో 21వ తానా మహాసభల కార్యదర్శిగా, కాపిటల్ రీజియన్ కోఆర్డినేటర్‌గానే కాకుండా కాన్సర్ అవగాహన మరియు నిధుల సమీకరణం కోసం ప్రపంచంలో ఎత్తైన కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించారు. అలాగే 23వ తానా మహాసభలలో ఎన్‌టిఆర్ మెమోరియల్ ట్రస్ట్‌కి కోటి రూపాయల నిధిని సమకూర్చడంలో ప్రత్యేక పాత్ర పోషించారు.

తానా బోర్డు చైర్మన్‌గా ఎన్నికైన డా. నాగేంద్ర శ్రీనివాస్ కొడాలి తానా ఎగ్జిక్యూటివ్ కమిటీ మరియు తానా ఫౌండేషన్‌ని సమన్వయ పరుచుకుంటూ, సరైన దిశలో మార్గనిర్దేశం చేస్తూ తానా సేవలను, ప్రతిష్ఠని సమర్థవంతంగా మరింత ముందుకు తీసుకు వెళ్తాము అని అలాగే బోర్డు అఫ్ డైరెక్టర్స్ తమ మీద పెట్టిన నమ్మకాన్ని వమ్ము చెయ్యకుండా తానాని తెలుగువారికి మరింత చేరువ చేయటానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు. ❃



డా. నాగేంద్ర శ్రీనివాస్ కొడాలి



లక్ష్మి దేవినేని



జనార్ధన్ (జానీ) నిమ్మలపూడి

# తానా ఫౌండేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటు

ఉత్తర అమెరికా తెలుగు సంఘంలో ముఖ్య విభాగమైన ఫౌండేషన్‌కు కొత్త కార్యవర్గం ఎన్నికైంది. ఫౌండేషన్ చైర్మన్‌గా శశికాంత్ వల్లేపల్లి, సెక్రటరీగా విద్యాధర్ గారపాటి, ట్రెజరర్‌గా వినయ్ మద్దినేని, జాయింట్ ట్రెజరర్‌గా కిరణ్ గోగినేని ఎన్నికయ్యారు.

శశికాంత్ వల్లేపల్లి తానాలో మొదటినుంచి మంచి దాతగా పేరు తెచ్చుకున్నారు. ఎంతోమందికి తానా ద్వారా సహాయాన్ని అందించారు. ఎన్నో ప్రాజెక్టులకు ఆయన ఫండింగ్ కూడా చేస్తున్నారు. అంకితమైన సేవాభావం, అందరితో కలిసిపోయే స్వభావం ఉన్న శశికాంత్ వల్లేపల్లి 'కాంత్ ఫౌండేషన్' ద్వారా కూడా ఎన్నో సేవా కార్యక్రమాలను చేస్తున్నారు. కోవిడ్ మహమ్మారి సమయంలో తెలుగు రాష్ట్రాల్లో ఆయన చేసిన సహాయం మరచిపోలేనిది. తానా ఫౌండేషన్ చేయూత కార్యక్రమానికి కోఆర్డినేటర్‌గా వేలాదిమంది విద్యార్థుల చదువుకు ఆయన సహాయాన్ని అందించారు. తానా ఫౌండేషన్ ట్రజరర్‌గా కార్యదర్శిగా కూడా శశికాంత్ వల్లేపల్లి పనిచేశారు.

విద్యా గారపాటి తానాలో కమ్యూనిటీకి సహాయం అందించేవారిలో ముందుండే మనిషి. కమ్యూనిటీకి ఏదైనా సేవ చేయాలన్న సంకల్పంతో తానాలో చేరారు. తానాలో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ అటు అమెరికాలోనూ, ఇటు తెలుగు రాష్ట్రాల్లోనివారికి సేవలందిస్తున్నారు. తన సొంత నిధుల నుంచి దాదాపు 75,000,00 డాలర్లను ఆయన ఇంతవరకు సేవా కార్యక్రమాలకు ఖర్చుపెట్టారు. అమెరికాలో తానా కాని, నాటా కాని, నాట్స్ లేదా టిటిఎలాంటి జాతీయ తెలుగు సంఘాలు నిర్వహించే మహాసభలకు వచ్చేవారి దాహాన్ని తీర్చేందుకు లక్షల రూపాయల విలువ చేసే మంచి నీటి బాటిళ్లను అందజేస్తున్నారు. ఇటీవల ఫిలడెల్ఫియాలో జరిగిన తానా మహాసభల్లో 70,000 వాటర్ బాటిళ్లను అందజేశారు. తెలుగు రాష్ట్రాల్లో గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్‌తో కలిసి తానా ద్వారా క్యాన్సర్ నిర్ధారణ శిబిరాలను నిర్వహించి ఎంతోమంది చికిత్సకు సహాయాన్ని అందించారు. గతంలో తానా పబ్లిసిటీ కమిటీకి ఛైర్మన్‌గా మరియు న్యూజెర్సీ రీజియన్‌కు రీజనల్ కోఆర్డినేటర్‌గా పనిచేశారు.

వినయ్ మద్దినేని తానా ఎగ్జిక్యూటివ్ కమిటీలోనూ, ఇతర కమిటీల్లోనూ పనిచేసి అందరి చేత ప్రశంసలు అందుకున్న మనిషి. ప్రస్తుతం ఫౌండేషన్ ట్రస్టీగా ఉన్నారు. మెట్రో అట్లాంటా ప్రాంతంలో చురుకైన కమ్యూనిటీ నాయకుడు, తెలుగు అసోసియేషన్ ఆఫ్ మెట్రో అట్లాంటా (తామా)కి అధ్యక్షుడిగా, బోర్డు చైర్‌గా కూడా పనిచేశారు. ప్రస్తుతం తానా ఫౌండేషన్‌కి ట్రెజరర్‌గా ఆయన ఎన్నికయ్యారు.

కిరణ్ గోగినేని కూడా తానాలో వివిధ పదవులను చేపట్టారు. అట్లాంటాకు చెందిన ఆయన 2019-2021 మధ్య తానా ప్రాంతీయ ప్రతినిధి గా సేవలందించారు. మెట్రో అట్లాంటా తెలుగు సంఘం (తామా), ఇండియన్ ఫ్రెండ్స్ ఆఫ్ అట్లాంటా తదితర సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. తానా ఫౌండేషన్ సభ్యునిగా ఉన్న ప్రస్తుతం ఫౌండేషన్ జాయింట్ ట్రెజరర్‌గా ఎన్నికయ్యారు. ❀



Sasikanth Vallepalli | Vidya Garapati | Vinay Maddineni | Kiran Gogineni

www.digitaltimes.co

# What's Next For You?



**Leverage Our Digital Marketing Expertise for Your Business Evolution With The times**

- Content Marketing
- Position 0 & Next Gen SEO
- Lead Gen to Door Knocks
- E-commerce Multiplication

Google Partner
facebook for business
Microsoft Gold Partner
DIGITAL TIMES

Encinitas, USA; Hyderabad & Bangalore, India | hello@digitaltimes.co
**+91 98480 16666 +1 424-253-0800**

## తానా ఫౌండేషన్ ఆదరణ

# తానా-సామినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు బ్యాటరి ట్రై సైకిళ్ల పంపిణీ



తానా ఫౌండేషన్, మాటూరు పేట సామినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు బ్యాటరి ట్రై సైకిళ్లు పంపిణీ చేసారు. రాధమ్మ సామినేని జ్ఞాపకార్ధం దాతలు సుధీర్ కొప్పారం, రాజారాం పిప్పలి, పవిత్ర కోట, జయప్రకాష్ బొగ్గుల, లక్ష్మణ్ పర్వతనేని, మధిర మాజీ ఎంఎల్ఎ కట్టా వెంకట నర్సయ కుమారుడు రవి కట్టా ఆర్ధిక వితరణతో వీటిని అందచేసారు.


(జ్యోతిష్యరత్న)
శ్రీధర్ గురూజీ గారు

సెల్ : (+91)83281 86500
(+91)76618 40946

JMR
జ్యోతిష్యాలయం
(Astrologer)





విద్య, ఉద్యోగం, ప్రేమ, పెళ్ళి, వ్యాపారం, వ్యవసాయం, రియల్ ఎస్టేట్, రాజకీయం, కోర్టు సమస్యలు, ఒత్తిడి, ఆరోగ్య సమస్యలు, సంతానం లేకపోవడం, మనశ్శాంతి, లక్ష్మి శాంతి, విడాకులు, శత్రుభయం, భార్య భర్తల మధ్య గొడవలు రావడం, నమ్మిన వ్యక్తులు దూరం కావడం లేదా మోసం చేయడం.

ఎటువంటి సమస్యలకైన 100 % పరిష్కారం చేయబడును.

# న్యూయార్క్ 'తానా పాఠశాల' వార్షికోత్సవం-2023

న్యూయార్క్ నగరంలో జూన్ 18వ తేదీన తానా ఆధ్వర్యంలో నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవం ఘనంగా జరిగింది.

దాదాపు 100 మంది పాల్గొన్న ఈ వార్షికోత్సవ కార్యక్రమం ఆద్యంతం ఉల్లాసంగా సాగింది. ఈ కార్యక్రమంలో తానా సంస్థ న్యూయార్క్ RVP దిలీప్‌కుమార్ ముసునూరు, పాఠశాల నిర్వాహకురాలు, ఉపాధ్యాయిని కృష్ణవేణి కొండమడుగుల, హేమలత బొర్రా నిర్వహించగా మయూరి బొమ్మిశెట్టి, మాధవి చీదర, లలిత ఎల్లూరు సహకరించారు. ఈ వార్షికోత్సవ కార్యక్రమానికి తానా సంస్థ అధ్యక్షులు అంజయ్య చౌదరి లావు పిల్లలకు, ఉపాధ్యాయులకు అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేసారు.

ఈ కార్యక్రమానికి విచ్చేసిన తానా మాజీ అధ్యక్షులు జయశేఖర్ తాళ్లూరి పిల్లలకు, తల్లిదండ్రులకు నిర్వాహకులకు అభినందనలు తెలియజేసి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుభాషాభివృద్ధికై పాఠశాల ఉపాధ్యాయులు చేస్తున్న నిస్వార్థ సేవను అభినందించారు. ముఖ్యంగా పాఠశాలలో పిల్లలను చేర్పించి తెలుగుబాషను భావి తరాలకు అందించడానికి ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియచేసారు. పాఠశాలలో ఉత్తీర్ణత పొందిన బాలలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో తానా పాఠశాల జాతీయ అధ్యక్షులు నాగరాజు నలజుల, ఉపాధ్యక్షులు ఫణి కంతేటి, తానా కల్చరల్ కో ఆర్డినేటర్ శిరీష తూనుగుంట్ల, దీపికా సమ్మెట, తానా సంస్థ ట్రస్టీ మెంబరు సుమంత్ రాంశెట్టి, పాఠశాల కో చెయిర్ హరిశంకర్ పాల్గొని పిల్లలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న టి.ఎల్.సి.ఏ ట్రస్టీ అధ్యక్షులు తెలుగు భాషా ప్రేమికులు అంకినీడు ప్రసాద్, గుజవర్తి కృష్ణారెడ్డి, తానా వ్యవస్థాపక సభ్యులు తిపిర్నేని తిరుమలరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలను విజయవంతంగా నిర్వహిస్తున్న తానా సంస్థ నాయకత్వాన్ని అభినం








CONGRATULATIONS







దిస్తూ పిల్లలకు తెలుగుభాషను నేర్పించడంలో తానా సంస్థ చేస్తున్న కృషిని కొనియాడారు. అలాగే పాఠశాల ఉపాధ్యాయులు పిల్లలకు ఎంతో కష్టపడి తెలుగు నేర్పిస్తూ తెలుగుబాషను ప్రవాసాంధ్రులకి చేరువ చేయడం తెలుగువారందరూ గర్వపడే విషయ మన్నారు. ముఖ్యంగా పాఠశాలకు అండదండలు అందిస్తున్న తల్లిదండ్రులను అభినందించారు. వారు పాఠశాలలో ఉత్తీర్ణత పొందిన బాలలకు బహు మతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

ఈ వార్షికోత్సవ కార్యక్రమంలో ఉపాధ్యా యులు నిర్వహించిన వివిధ పోటీలలో పాల్గొన్న పిల్లలు పలు బహుమతులను గెలుచుకున్నారు. తెలుగు పద్యాలు, శ్లోకాలు చదివి ఆహూతులని అల రించారు. వందేమాతర గీతం, జనగణమన గీతం ఆలపించి ఉత్తేజపరిచారు. ఈ సందర్భంగా 'ఫాదర్స్ డే' కేక్ కట్ చేసి నాన్నలందరికి శుభాకాంక్షలు తెలియ జేసారు.

కార్యక్రమ విజయవంతానికి సహకరించిన నారాయణ రెడ్డి బొందలపాటి, సునీల్ చల్లగుల్ల, రాజేష్ మద్దిపట్ల, సాయి మిన్నెకంటి, తనూజ రసపుత్ర గార్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు.



# తానా ఒహియో వ్యాలి 2023 క్రికెట్ టోర్నమెంట్




తానా ఒహియో వ్యాలి రీజనల్ రిప్రజెంటేటివ్ శివ చావ ఆధ్వర్యంలో ఆదివారం ఆగస్ట్ 5న జరిగినవి. ఈ టోర్నమెంట్‌లో 29 పురుషుల, 5 మహిళల, 6 పిల్లల జట్లు తలపడినవి. సాయంత్రం జరిగిన బహుమతి ప్రదాన కార్యక్రమంలో విజేతలైన వారికి 2000 డాలర్ల ప్రైజ్ మనీ రవి సామినేని, శివ చావా అందచేసారు.

ఈ కార్యక్రమాన్ని ఆద్యంతం శివ చావా, వేణు చావా, సిద్దార్ధ రేవూరు, రాము రేవూరు, వంశీ మద్దుల, సుమన్ తలశిల, హరి వుండవల్లి, విశ్వ కమతం తదితరులు పర్యవేక్షించారు.






# డాలస్‌లో బ్రహ్మశ్రీ డా. గంగాధర శాస్త్రి 'గీతా గాన ప్రవచనం'



ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా), కార్యసిద్ధి హనుమాన్ ఆలయం ఆధ్వర్యంలో 'బ్రహ్మశ్రీ డా॥ గంగాధరశాస్త్రి 'గీతాగాన ప్రవచనం' కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ప్రవాస భారతీయులు, పిల్లలు అధిక సంఖ్యలో ఈ సమావేశంలో ఉత్సాహంగా పాల్గొని సభను జయప్రదం చేశారు. కార్యసిద్ధి హనుమాన్ ఆలయంలో భగవద్గీత శ్లోకాలను నేర్చుకుంటున్న పిల్లలు కొన్ని శ్లోకాలను ఆలపించి, అందరిని ఆకట్టుకున్నారు. పిల్లలకు చక్కగా భగవద్గీత నేర్పించడానికి ప్రోత్సహిస్తున్న తలిదండ్రులను, నేర్పిస్తున్న గురువులను గంగాధరశాస్త్రి వారి దీవెనలతో అభినందించారు.

తానా కార్యదర్శి కొల్లా అశోక్‌బాబు కార్యక్రమాన్ని ప్రారంభించి అందరికీ 'గీతాగాన ప్రవచనం' కార్యక్రమానికి స్వాగతం పలికి, డా. గంగాధర శాస్త్రి ముఖ్య అతిథిగా రావడం మన అదృష్టం అని, తానా తరపున వారికి ఆత్మీయ స్వాగతం పలికారు. రాబోయే కాలంలో తానా అధ్యక్షులు నిరంజన్ శృంగవరపు, డాలస్ ప్రాంతీయ ప్రతినిధి పరమేష్ దేవినేని మరియు తానా కార్యవర్గ బృందం సారధ్యంలో మరిన్ని మంచి మంచి కార్యక్రమలను మీముందుకు తీసుకు వస్తున్నాం అని, తానా డాలస్‌లో నిర్వహించే కార్యక్రమాలలో అందరు పాల్గొనవలసిందిగా కోరారు. తదుపరి తానా మాజీ అధ్యక్షుడు డా. తోటకూర ప్రసాద్‌ను ఆహ్వానించి గంగాధరశాస్త్రిని సభకు పరిచయం చేయవలసిందిగా కోరారు.

డా. తోటకూర ప్రసాద్, వేంకట గంగాధర్‌శాస్త్రి గారిని పరిచయం చేస్తూ, గంగాధర్‌శాస్త్రిగారు గాయకుడు, స్వరకర్తగా మంచి కీర్తిని సంపాదించినా, సమాజానికి మేలు చేయాలనే సదుద్దేశంతో భగవద్గీత ఫౌండేషన్‌ను స్థాపించి, ఆ సంస్థ ద్వారా భావి తరాలకు నిబద్ధతతో వారు అందిస్తున్న సంపద ఎంతో ఉత్తమమైనదని, అన్నింటి కంటే తనకు మంచి మిత్రులు అని చెప్పి వారిని అందరి కరతాళ ధ్వనుల మధ్య సాదరంగా వేదిక పైకి ఆహ్వానించారు. హనుమాన్ ఆలయం ఛైర్మన్ డా. వెలగపూడి ప్రకాశ రావు మాట్లాడుతూ భగవద్గీత స్వధర్మం వదలకుండా హిందువులు ఐకమత్యంగా సమాజంలో జరుగుతున్న అధర్మాన్ని అరికట్టడానికి పాటుపడాలని కోరారు.

డా. వేంకట గంగాధరశాస్త్రి మాట్లాడుతూ పరమాత్మ మనిషి అనే ప్రోడక్టును సృష్టించి దానిని ఎలా సద్వినియోగం చేయాలో అని మనకు ఇచ్చి పంపించిన ప్రోడక్టు మాన్యువల్ పేరే 'భగవద్గీత' అని అందరికీ సులువుగా అర్థం అయ్యేలా సరళమైన బాషలో వివరించారు. వేదవ్యాసుల వారు రచించిన మహాభారతంలో కొన్ని పర్వాలు సారాంశం ఆధారంగా

భగవద్గీతను శ్రీ కృష్ణ పరమాత్మ, అర్జునునకు ఉప దేశించిన సారాంశమే భగవద్గీత అని,

*గీతా సుగీతా కర్తవ్యా కిమన్యైః శాస్త్ర విస్తరైః*
*యాస్వయం పద్మ నాభస్య ముఖ పద్మ విని స్సృతా!!*

అనే శ్లోకంను రాగయుక్తంగా ఆలపించి దాని అర్థాన్ని వివరించారు. శబ్దాన్ని అక్షరబద్ధం చేసే శక్తి మన తెలుగుభాషకు మాత్రమే వుంది అని, మన మాతృ భాషను కాపాడుకోనే బాధ్యత మన అందిరిది అని గుర్తు చేశారు. హిందువు అంటే సర్వజన బంధువు అని చెప్పారు. భగవద్గీత అన్ని గ్రంథాల సారాంశం, బాల్యం నుంచే పిల్లలకు భగవద్గీత నేర్పాలి అని, రిటైర్మెంట్ తర్వాత నేర్చుకొనే గ్రంథం కాదు అని గుర్తుచేశారు. అన్ని మత గ్రంథాలకంటే భగవద్గీత పురాతనమైన గ్రంథం అని గుర్తుచేసి, ప్రవాస భారతీయులు, అమెరికా మరియు పలు దేశాల ప్రముఖులు, తత్వవేత్తలు కూడ భగవద్గీత ప్రాముఖ్యతను కొనియాడారు అని చెప్పారు. హిందుత్వం 5000 సంవత్సరాల క్రితం రాసిన గ్రంథం, జీవితం అంటే సుఖంగా బ్రతకడం కాదు, ధర్మంగా బ్రతకడం అదే భగవద్గీత సారాంశం అన్నారు. పిల్లలు భగవద్గీతను చదవడం, అర్థం చేసుకోవడం, ఆచరించడం, ప్రచారం చేయడం వంటి లక్షణాలను ఆచరించాలని కోరారు. సమాజ శ్రేయస్సు కోసం మంచిపని చేయడమే మనిషి ధర్మం, దాని ఫలితం అందించడం పరమాత్మ పరమావధి అని అన్నారు. భగవద్గీతలో చర్చించని అంశం లేదు, ప్రతి ప్రశ్నకు సమాధానం దొరుకుతుంది చెప్పారు. అలాగే అనేక భగవద్గీత శ్లోకాలను రాగయుక్తంగా పాడి వినడానికి వచ్చిన శ్రోతలు అందరికీ శ్రవణానందంతోపాటు మనోవుల్లాసం కలిగేలా చేశారు.

తానా ప్రస్తుత కార్యదర్శి అశోక్‌బాబు కొల్లా, డా. తోటకూర ప్రసాద్, సతీష్ వేమూరి, శ్రీకాంత్ పోలవరపు, లోకేష్ నాయుడు, నాగరాజు నలజుల, చిన సత్యం వీర్నపు, లెనిన్ వీర మరియు తానా కార్యవర్గ బృంద సభ్యులు, డా. ప్రకాశరావు వెలగపూడి, హనుమాన్ ఆలయం కార్యవర్గ బృందం సభ్యులు








ముఖ్య అతిథి డా. గంగాధరశాస్త్రిగారిని పుష్పగుచ్ఛం, శాలువా, జ్ఞాపిక మరియు 'గీతాగాన విభూషణ' బిరుదుతో ఘనంగా సత్కరించారు.

లోకేష్‌నాయుడు, శ్రీకాంత్ పోలవరపు, సుబ్రమణ్యం జొన్నలగడ్డ, వెంకట్ ములుకుట్ల, డా. వెలగపూడి ప్రకాశరావు, డా. ప్రసాద్ తోటకూర, రావు కలవుల, డా. ఆళ్ల శ్రీనివాస రెడ్డి, నరేంద్ర బి., గంగాధరశాస్త్రిగారి తనయుడు విశ్వతేజ, కళ్యాణి తాడిమేటి, వీర లెనిన్, లెనిన్ వేముల, నాగరాజు నలజుల, చినసత్యం వీర్నపు, సత్యన్ కళ్యాణ్‌దుర్గ్, దిలీప్ మొదలైన పలువురు పురప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బ్రహ్మశ్రీ డా. గంగాధరశాస్త్రి 'గీతాగాన ప్రవచనం' కార్యక్రమం దాతలకు, వేదికను ఇచ్చిన కార్యసిద్ధి హనుమాన్ టెంపుల్ అధినేత డా. ప్రకాశ రావు వెలగపూడి, వివిధ ప్రసార మాధ్యమాలకు, కమిటీ సభ్యులకు, స్వచ్ఛంద కార్యకర్తలకు, అన్ని సహాయ సహకారాలు అందించిన తానా ప్రాంతీయ ప్రతినిధి పరమేష్ దేవినేనికి అశోక్‌బాబు కొల్లా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# TANA SAT SUMMER 2023

## 10 VIRTUAL SESSIONS

### (7:00 PM - 9:00 PM EST)



**Haasith Garapati**
Rising Boston University Sophomore

JUL 2023 - 31st

AUG 2023 - 3rd, 7th, 10th, 14th, 17th, 21st, 24th, 28th and 31st

**ELIGIBILITY:** Raising 10th, 11th & 12th Grades

## Registration Fee $75

https://events.tana.org/event/tana-sat-summer-2023

Fundraiser for Cancer and CPR camps

REGISTER HERE

**Niranjan Srungavarapu** - TANA PRESIDENT

## FOR MORE DETAILS

Satish Meka - (425) 770-6179
Cancer Camps Co-ordinator

Sudheer Narepalepu - (908) 279-9997
Cancer Camps Co-ordinator

**Vidyadhar Garapati, TANA Foundation Trustee - (732) 997-9193**

# ఇంకో.....కొన్ని గుర్తొస్తున్నాయి





వంశీ

## లేడీస్ టైలర్ 3

ఆ తెల్లవారుఝామున అప్పనపల్లి రేవులో అక్కిరాజు గారు ఏర్పాటుచేసిన ఫంటూ దానిక్కట్టిన లాంచీలూ రెడీగా ఉన్నాయి.

డ్యాన్సర్లూ, ఆర్టిస్టులూ వచ్చేసేక కదిలిన లాంచీలు వైనతేయ గోదావరి పాయమీద ముందు కెళ్తుంటే చూస్తున్న హరి, "నువ్వన్నది నిజమేనయ్యా... గోదాట్లో ఆ పాపికొండల వైపెళ్తుంటే కనిపించే అందాలు ఇక్కడ మచ్చుకైనా లేవు," అన్నాడు.

అలా బెండమూర్లంక దాటేక కుడిపక్క ఒడ్డుకి లాగించమని చెప్పి మరి పని మొదలెట్టాం.

పెరిగిన వేసవికాలం ఎండ మండిపోతుంది. గాలి లేదు. చెమట్లు తెగపట్టేస్తున్నాయి. పనిలేనివాళ్లు గోదాట్లోకి దిగి, "నీళ్లు కూడా వేడిగానే ఉన్నాయి," అంటా అరుస్తున్నారు.

నా దగ్గరకొచ్చిన పద్మ, "ఆ వై.విజయక్క నీళ్లంటే నాకు భయం ఇంత లోతులోకి నేను దిగను అంటుంది సార్," అంది.

దాంతో తను నీళ్లలో మునిగే షాట్స్‌కి బదులు వేరేగా తీసుకుంటా పోవాల్సొచ్చింది.

మధ్యాహ్నం లంచ్ తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ అరగంటైనా నిద్రపోయే అలవాటున్న ఆ సత్యంగారు సన్నటి ఆ తుమ్మచెట్టు నీడలో కళ్లమీద కర్చీఫ్ వేసుకు పడుకున్నాడు.

దూరంగా ఏ నీడాలేని ఒక తుమ్మచెట్టు కింద వాళ్లమ్మతోపాటు మాడిపోతున్న దీపనే చూస్తున్న నాకు ఆ దీపకి సంబంధించినవే గుర్తుకొస్తున్నాయి. వాహినీ స్టూడియో సెకండ్ ఫ్లోర్ దగ్గర గార్డెన్‌లో పల్చగా ఎండ. స్టార్స్ వాడే ఆ అల్యూమినియం ఛెయిర్లో కూర్చుని ఆ దీప ఉంటే పెద్దగొడుగు పట్టుకు నిలబడున్నాడో అసిస్టెంటు. ఇంకో అమ్మాయి మేకప్‌బాక్సు పట్టుకు నిలబడుంది. వీళ్లు సరే, కూర్చున్న సుకుమారమైన ఆ దీపకి రెండు పక్కలా ఇద్దరు బాడీగార్డులు నమ్రతగా నిలబడి ఉన్నారు.

అలాంటి దీప ఇప్పుడిలా లావయిపోయి ఆ ఎండిపోయిన తుమ్మచెట్టు కింద కూర్చుని మండే ఈ ఎండల్లో కాలిపోవడం చూస్తుంటే మనసంతా అదో లాగైపోతుంది.

కెమెరా క్రేన్‌మీదుంది. గోదావరి అంచున ఆ పాయమీదున్న తుమ్మచెట్టుకి ఎడంపక్కనో చిన్న తెరచాప పడవ, కుడిపక్కన నీళ్లల్లో ఆడోళ్లు, అప్పుడే వచ్చినా సుందరం గ్రూపు, ఆ చెట్టుకింద రిహార్సల్స్ చేసేక షాటు మొదలైంది.

తర్వాత అదే యాంగిల్లో రెండు మూడు షాట్లు తీసేం.

కృష్ణుడి వేషంలో ఉన్న సుందరానికి ఆ ప్రతి డ్రస్సు కుడితొడ దగ్గర కన్నం పెట్టిద్దామని ఐడియా రావడంతో అది సీతారావుడికి చెప్పేటప్పటికి ఆ పన్లో బడ్డారాళ్లు.

ఇలా స్పీడుగానే తీసుకుంటూ వెళ్తావుంటే బ్యాక్‌గ్రౌండ్లో తెరచాప పడవలు పెట్టాల్సొచ్చినప్పుడు అక్కిరాజుకి చెపితే, పెద్దపెద్ద కేకలేస్తా రంగంలోకి దిగిపోయి ఇంతా అంతాగానంత హడావుడి చేస్తా మాకా మనిషి చేసిన సాయం ఎప్పటికీ మర్చిపోలేనిది.

అలా సూర్యాస్తమయం అయ్యేదాకా పనిచేసి తిరుగుముఖం పట్టేం.

గోదావరి మధ్యలో ప్రయాణం చేస్తున్న మాకు తాగే నీళ్లయిపోయినియ్యి. చుట్టూ ఆ ఉప్పునీళ్లు. జనం దాహం దాహం అంటా అరుస్తుంటే ఒక చిన్న క్యాన్‌తో నవ్వుతా వచ్చిన నీలవేణి వేషం వేస్తున్న సంధ్య వాళ్ల నాన్న రంగారావు ఆ క్యాన్‌లో నీళ్లు గ్లాసులో పోసి అందరికీ ఇస్తుంటే, 'ఆహా ఓహో లెమన్ జ్యూస్,' అంటూ తెగ తాగెయ్యడం మొదలెట్టేరు.

ప్రొడక్షనోళ్ల దగ్గర తీసుకున్న నిమ్మకాయలు మొత్తం పిండేసి తీసిన రసాన్నీ ఉప్పునీళ్లనీ కలిపేసి ఇచ్చేస్తున్నాడా రంగారావుగారు.

గటాగటా బాగానే తాగేసిన మా జనాలకి ఇప్పుడు పట్టుకుంది అసలైన దాహం.

ఇదిలాగుండగా మద్రాసునించొచ్చిన ఆ గ్రూపు డ్యాన్సర్ల మధ్యలోంచి పెద్దపెద్ద కేకలు.

ఉలిక్కిపడతా ఆపక్కకి చూస్తే... అవి మామూలు కేకలు కాదు పొలికేకలు. లావుపాటి ఆ అరవ డ్యాన్సరు చాలా పెద్దగా అరుస్తుంది అరవంలో.

ఏంటాని చూస్తే దెయ్యం పట్టిందంటా మనిషికి.

ఎలాగా అనుకుంటుండగా మరో ఇద్దరు ఆడోళ్లదీ అదే పరిస్థితి. పరుగెట్టుకుంటా నా దగ్గర కొచ్చిన పద్మ, "మీరు ఎక్కించిన ఆ తుమ్మచెట్టు మీద దెయ్యం ఉందంట," అంది.


ఇంక గొడవ మామూలుగా లేదు. ఈ గందరగోళంలో దాహం సంగతి మర్చిపోయేరంతా.

అరుపులు, ఏడుపులు, కేకలు. గోదారి మధ్య చీకటి పడిపోయింది. వెళ్తానే వున్న లాంచీలు ఎప్పటికో అప్పనపల్లి రేవులోకొచ్చినియ్యి.

*

"కొత్త పోలీసోడ్ని రూల్సెరగను," అన్న మేనరిజంతో భరణి రాసిన ఆ పోలీస్ కానిస్టేబుల్ వేషానికి, "నూతన్‌ప్రసాద్ బాగుంటాడు డేట్లు నేను ట్రై చేస్తాను," అన్నారు సత్యంగారు.

దాంతో కాస్ట్యూమర్ రవిని పిల్చి ఆ నూతన్ ప్రసాద్‌గారి కొలతలు తీసుకుని పోలీస్ డ్రెస్‌లు కుట్టెయ్యమన్నాను.



ఈ పక్కనించి మేం రాజోలు వచ్చేసి షూటింగ్ మొదలెట్టేసేం. నూతనప్రసాద్ డేట్లు చూసే ఆయనకి ఫోన్లు చేస్తున్నారా సత్యంగారు.

ఓపక్కనించి సీన్లయిపోతున్నాయి. ఆ నూతన్ ప్రసాద్ సంగతేంటి అంటే ఆ పనిమీదే ఉన్నానంటున్న సత్యంగారు ఆవేళ రాత్రి నా దగ్గరకొచ్చి, "అతను చాలా బిజీగా ఉన్నాడు. నైట్ కాల్షీట్లు కూడా ఇచ్చాడంట," అన్నారు.

అర్థమైన నాకు ఆర్టిస్టులందరికీ మంచి పంచ్ ఉన్న వాయిస్‌తో డైలాగులు చెపుతున్న ఆ తనికెళ్ల భరణికి కబురుచేసి, "స్టేజ్ మీద కుమ్మేశారనుకోండి సినిమాల్లో ఏవన్నా చేసేరా వేషాలూ?" అన్నాను.

లేదన్నట్టు గుర్తు... అతన్నీ పోలీసోడి వేషం వెయ్యమంటే, 'సరే,' అన్నాడు.

పొద్దుట ఆ నూతన్‌ప్రసాద్‌గారి కొలతలకి కుట్టిన బట్టలు ఆ సన్నటి భరణి వేసుకుంటే లూజుగా వున్నాయి. 'పర్లేదు ఈ కామెడీ సినిమాలో ఇది కూడా కామెడీ క్యారెక్టరే గదా,' అనేసుకున్నాకా ఇప్పుడు షూట్ చేసే సీను బయటికి తియ్యమన్నాను.

పెళ్లిచూపులకి ఆ ఇంటికొచ్చినా కొత్త పోలీసోడ్ని చూసిన ఆ ఇంట్లో ఆడోళ్లంతా విడివిడిగా నవ్వుతుంటే పెళ్లికూతురెవరో అర్థంగాక తెగ కన్ఫ్యూజైపోతున్న ఆ పోలీసుకి, నీలవేణి పెళ్లికూతురని వాళ్ల నాన్న చెప్పడంతో ఆ అమ్మాయిని తప్ప ఆ ఇంట్లో వాళ్లందర్నీ బయటికి పంపేసి ఎఫ్.ఐ.ఆర్. అంటా రకరకాల భేతాళ ప్రశ్నలెయ్యడం మొదలెట్టాడు.

అన్నింటికీ కొంచెం అటుఇటుగా సమాధానాలు చెప్పేస్తుందా నీలవేణి.


"ఎప్పుడన్నా పోలీస్‌స్టేషనుకెళ్లావా నీలవేణీ?"

"వెళ్లాను."

గొల్లుమన్న పోలీసోడు, "ఈ సంబంధం క్యాన్సిల్," అంటా ఏడుస్తా వెళ్లిపోయేడాళ్లింట్లోంచి.

ఆ నూతన్‌ప్రసాద్‌గారెలా చేసేవారో తెలీదుగానీ ఈ కొత్తార్టిస్టు తనికెళ్ల భరణి తక్కువేం చెయ్యలేదు. షూట్ చేసిన సీను గుర్తు చేసుకుంటే బాగానే నవ్వొస్తుంది.

సుజాతా... మై మర్ జాతా, తుమారా చుట్టూ గిర్ జాతా... అది నా తలరాతా... మై బడా, తుమారీ తొడా మై బచ్చా, బట్టల సత్తిగాడు లుచ్చా... ఇలా చెప్పే ఆ సన్నాసి హిందీ డైలాగులు సీనయ్యాక, ఆరో ఎక్కం చెప్పమంటే ఆ సుజాత జాకెట్టు కొలతలు చెప్పేడు. ఆవేళ్టి ఆఖరి సీను ఆ సుజాతని కళ్లు మూసుకోమని చెప్పి పెద్ద సౌండొచ్చేలాగ ముద్దెట్టడం. బుగ్గలమీద ఆడి ఉమ్ము తడికి కోపమొచ్చేసి తెగ రెచ్చిపోయిన సుజాత, 'నీ పని వెంకటరత్నంతో చెపుతానుండు,' అంటా బయల్దేరుతుంటే, 'పొరపాటిదీ తడబాటిదీ...' అంటా పాట లంకించుకున్నాడు.




మర్నాడు పొద్దుట అదే పాట తాలూకు కంటిన్యూషన్ తియ్యడానికి ఆ గోదావరి ఒడ్డునున్న మఠం రేవులోకెళ్లేం. ఏ పక్కకెళ్లి చూసినా పొడుగాటి వెదురు గెడలకి పాకుతున్న తమలపాకు తోటలు. పచ్చటి నేల మీద దేకుతున్న చల్లటి నీడలు. గోదాట్లోంచి వీస్తున్న చల్లా చల్లటి గాలులు. కొంచెమాపక్కకెళ్తే ముదురు పచ్చటి కందతోటలు...




కలతిరుగుతున్న నేనూ హరీ, "పాట మొత్తం ఇక్కడ తీసేద్దాం," అనేసు కున్నాకా మరి మొదలెట్టేం.

మధ్యాహ్నానికి రేవులో వరుసగా ఉన్న తెరచాప పడవల్తో ఒడ్డున రాటలు పాతి వలలు ఆరేసేడా ఆర్ట్ డైరెక్టర్ యాదు. అది చూసిన నాకు థర్డ్ బీజీఎమ్ అక్కడ తీద్దామనిపించింది.

*

పొరుగూర్నుంచొచ్చిన ఒక సిద్ధాంతి గారు నాగమణి ఇంటి మీంచెళతా, "వచ్చే ఆదివారం చాలా గొప్ప ముహూర్తం ఉంది. అసలిలాంటి ముహూర్తం ఏభయ్యేళ్లకోసారి మాత్రమే వస్తుంది," అన్నారు.

ఆయన మాటలకి చాలా కలలు గనేసిన నాగ మణి ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ ముహూర్తానికే ఆ సుందరాన్ని పెళ్లిచేసుకు తీరాలనుకుంది.

ఈ సిద్ధాంతి ముహూర్తం గురించి ఊరు ఊరంతా పాకిపోడంతో ఆపక్క దయా, ఈపక్క నీల వేణీ కూడా ఈ ముహూర్తానికే సుందరాన్ని పెళ్లి చేసేసు కోవాలని నిర్ణయించేసుకున్నారు. ఎవరికాళ్లు ఆ సుందరాన్ని కలిసి ఆ గొప్ప ముహూర్తం గురించి మా గొప్పగా చెపుతా మన పెళ్లి ఆ టైముకే అంటుంటే తల తిరిగిపోయినా సుందరం పరుగెట్టుకుంటా సుజాత దగ్గరకెళ్లేడు.

ఎందుకొచ్చేవంది.

విషయం చెప్పి, "మనం ఈ ముహూర్తానికే పెళ్లి చేసేసుకుందాం," అన్నాడు.

కొట్టిపారేసినా సుజాత, "ఇలాంటి మూఢ నమ్మకాలు నాకు లేవు," అనేసింది.

దాంతో మొదలైందా సుందరంలో అసలవస్థ.

ఇదిలాగుండగా గోదాట్లోంచి నీళ్లు మోసుకొస్తున్న వెంకటరత్నం చెల్లెలు పిచ్చిసుందరి కళ్లు తిరిగి పడిపో యింది.

అది చూసి పరుగెట్టుకుంటూ వచ్చిన జట్కా శీను ఆ పిల్లని తన జట్కాబండిలో పడుకోబెట్టి దయ హాస్పటల్‌కి తీసుకెళ్లేడు.

పరీక్ష చేసిన దయ, "కడుపు," అని చెప్పింది.

విన్న శీను, "ఈ పని చేసింది ఆ సుందరంగాడే," అంటా అరుస్తుంటే, "సుందరానికేంటి సంబంధం," అంది దయ.

"ఏంటా... సుందరం నిన్ను ప్రేమించేడా?" అన్నాడు.

"ఔను,"" అంది.

"అలాగే నీలవేణీ, నాగమణిని కూడా ప్రేమిం చేడు. ఇప్పుడా సుజాత టీచరుమీదుంది ఆడి కన్ను," అనేటప్పటికి మాటపడిపోయిందా దయకి.

చీకట్లో సుందరిని ఎక్కించిన ఆ జట్కాబండి, వెంకటరత్నం వాళ్లింటికి బయల్దేరింది.

మొత్తం కథంతా విన్న ఆ వెంకటరత్నం, "ఇన్నాళ్లూ నాకెందుకు చెప్పలేదురా?" అన్నాడు.

దానికేదో చెప్పబోతున్న ఆ సీనుగాడ్నే తన్నుతన్ని దుడ్డుకర్ర అందుకున్న వెంకటరత్నం బయల్దేరాడా కటిక చీకట్లో.

అయిదారు రోజుల్నుంచి ఈ కథకి సంబం ధించిన సీన్లన్నీ తీసుకుంటా వస్తున్న మాకెవరికీ నిద్రలు లేవు.

ఆ సాయంత్రం షూట్ అయ్యేక బయల్దేరుతుంటే నా దగ్గరకొచ్చిన అక్కిరాజు, "రేపట్నుంచీ సినిమా క్లైమాక్సంటగదా?" అన్నారు.

"ఔను," అన్నాను.

"దానికి మేం చెయ్యాల్సిన పన్లేంటో ముందే చెప్పెయ్యండి."

నవ్వేసిన నేను, "మీరు నా పక్కన ఉండండి అది చాలు నాకు," అన్నాను.

"భళేవోరే," అనేసి నవ్వేస్తా నా జబ్బమీద తన చెయ్యేసేడారాజుగారు.

*


ఆ రాత్రి సుందరం కోసం ఆ వీధిలో బయల్దేరిన వెంకటరత్నం పరుగులాంటి నడకతో కలతిరిగే షాట్. నేను చెప్పింది విన్న హరి, "మొత్తం లైటింగ్ చెయ్యడానికి రెండు గంటలు పడ్తుంది," అన్నాడు.

'రెండు గంటలా... అంతసేపూ ఏం చెయ్యాలి?' అనుకుంటా నడుస్తూ వస్తున్న నాకు దూరంగా ఆ వీధిలో ఉన్న వరలక్ష్మిగారిల్లు కనిపించింది.

పందిరి పట్టెమంచమ్మీద పడుకున్న ఆ వరలక్ష్మిగారు నన్ను చూసి బయటికొచ్చి, "బయట నిలబడ్డారేంటీ లోపలికి రండి," అంది.

నెమ్మదిగా నడుచుకుంటా వెళ్లేనా లోపలికి.

"ఇలా పరుపుమీద కూర్చోండి," అంటా లోపలికెళ్లింది.




కూర్చున్న నేను ఆ గదంతా చూస్తే... మసకమసక చీకటి మల్లెపూల వాసనల్లో ఆ వరలక్ష్మి శరీరం వాసన కలగలిసిన వాసన.

భయపెట్టే నిశ్శబ్దం.

మంచినీళ్ల మరచెంబు పట్టుకుని లోపలికొచ్చిన వరలక్ష్మిగారు తలుపేస్తుంటే పెరిగిపోయిన ఆవిడ తలలో మల్లెపూల వాసన, ఆమె రాసుకున్న నూర్జహాన్ సెంటు వాసన, దగ్గరకొస్తున్న ఆమె వాసన...

ఆ సువాసనలనన్నిట్నీ హాయిగా ఎగబీలుస్తా కళ్లు మూసుకున్న నా దగ్గరకొచ్చినా వరం, "మరక్కడ షూటింగ్ జరుగుతుంటే ఇలాగొచ్చేశారేంటండీ మీరూ?" అంది.

"ఆ వీధంతా లైటింగ్ చెయ్యడానికి రెండు గంటలు పడ్తుందన్నాడు మా హరిగారు. అప్పటిదాకా నాకేం పనిలేదు," అన్నాను.

"అయితే... పనంతా హరిగారిదేనన్నమాట. ఏవన్నా తిన్నారా సందకాడ?"

"ఇలా ఫుల్ నైట్స్ పనున్నప్పుడు తక్కువ తింటాం."

"యాదుగారికోసం ఏవన్నా వండుదాం అనుకున్నాను. ఆయన తింటారో లేదో అనేసి ఊరుకున్నాను."

"ఆయన తినకపోయినా మేమున్నాంగదా? మా అందరికంటే ఆ శ్రీపద్మా, సత్యంగారున్నారు."

"ఔనౌను మీ అందరికోసం కోడ్ని కోద్దారనుకుంటున్నాను. షూటింగయిపోవచ్చిందంటగదా ఎప్పుడెళ్లిపోతన్నారు మద్రాసు?"

"ఇప్పుడు మొదలైన క్లైమాక్స్‌తో అంతా అయిపోయినట్టే."

"హరిగారు కూడా మీతోపాటొచ్చేస్తారా?"

"ఇక్కడుండి ఏంచేస్తాడు మరి?"అంటా బయల్దేరేను.

వరుసగా రాత్రీ పగలూ ఈ క్లైమాక్స్ పనే. ఎవరికీ నిద్రలుండటంలేదు.

*

ఆవేళ పగటిపూట నిలబెట్టిన పట్టిమంచం వెనకాల పడుకున్న రాజేంద్రప్రసాద్ షాట్ తీస్తుంటే అక్కడున్న భరణి, "ఇద్దర్ని పడుకోబెట్టి యాక్షన్స్ సింక్ చేస్తే ఈ మంచం వెనక పడుకున్న మనిషేంటీ ఇంత పొడుగున్నాడు? అన్న ఫీలింగ్ కలుగుద్ది చూసేవాళ్లకి," అన్నాడు.

బాగుందనిపించిన నేను, "మీకెలా తెల్సు?" అన్నాను.

"స్టేజిమీద చేస్తుంటాంగదా?" అతని ఐడియాని ఫాలో అవుతా షాట్ పెడ్తుంటే... "అన్నయ్యగారూ!" అన్న మాట వినిపించింది.

తల తిప్పిచూస్తే ఆ వీధిలో వుండే కళావంతుల అమ్మాయిలు ముగ్గురు గిన్నెలో ఏదో పిండివంట పట్టుకు నిలబడ్డారు. "ఈ సున్నుండలు తీసుకోండి అన్నయ్యగారూ," అందాళ్ల మధ్యలో అమ్మాయి.

'ఎంత సంస్కారులు వీళ్లు,' అనుకుంటా ఒకటందుకున్న నేను, యాదూకి కూడా ఇస్తావుంటే, "వెళ్లిపోతారంట గదా! రేపట్నుంచి మాకు చాలా బెంగగా వుంటది," అందో అమ్మాయి.

నవ్వుతా ఒక ఉండ అందుకున్న హరి, "మరి వెళ్లాలి గదా అమ్మాయీ?" అన్నాడు.

"మీరెళ్తారు సరే ఇంకీ సత్తెమామ్మ గుడివీధిలో సందడే ఉండదు మాకు," అందింకో అమ్మాయి.

ఒక వుండ తీసుకున్న తమ్ముడు సత్యం, "మీ వీధిలో ఒక పెద్ద మండువా లోగిలి చూడండైతే... అంతా అందులో దిగిపోతాం," అన్నాడు.

"అలాగే అన్నయ్యగారూ."

"ఇవ్వేళ సాయంత్రం బయల్దేరిపోతున్నాం," అంటా ఆ వరలక్ష్మిగారికి చెప్పడానికెళ్తే... మళ్లీ ఎప్పుడొస్తారంటా ఒకటే ఏడుపా యజ్ఞగంటి వరలక్ష్మిగారు.

అనుబంధాలంటే... అసలు మానవ సంబంధాలంటే ఇయ్యేనా? ఇలాంటి బంధాలతోనేనా ఠాగూర్ లాంటి గొప్పోళ్లు రవీంద్రగీతలు రాసింది?

"ఆ సత్తెమామ్మ గుడివీధిలో నవ్వుతా నడుస్తా కనిపించినోళ్లందరికీ చెపుతుంటే మాకింత అన్యాయం చేస్తారా? అంటా వచ్చిందా ముసలావిడి. ఆవిడ గురించి మొదట్లో చెప్పాల్సింది ఈ చివర్లో చెప్తున్నాను. ఒకనాడు పౌరాణిక నాటకాల్లో కథానాయికంట ఆవిడ. కూచిపూడి, భరతనాట్యం సరే సంగీతమెంత తెల్సో కవిత్వమంతే బాగా తెల్సు. తెలుగు పంచకావ్యాలూ, సంస్కృత పంచకావ్యాలూ చదివేసిన మనిషి.

*

చాన్నాళ్ల తర్వాత మద్రాసులో దిగి మా ఇంటకెళ్లిన నేను ఏ చప్పుడూ చెయ్యని ఆ లేత నీలంరంగు ఫోనువైపు చూస్తా, 'ఇప్పుడో ఇంకాస్సేపట్లోనో మోగాలే ఇదీ అనుకుంటుండగా మోగింది. ఆత్రంగా వెళ్లి లిఫ్ట్ చేస్తే, "హలో వంశీ," అన్న మగ గొంతు.

"అవునండీ ఎవరూ?"

"నేను ప్రభాకరరెడ్డిని. ఒకసారి మా ఇంటికొస్తావా కొంచెం మాటాడే పనుందీ."

"అలాగే సార్," అంటా ఎప్పుడు రావాలో టైము కనుక్కుని డిస్కనెక్ట్ చేసేను.

*

మళ్లీ మద్రాసులో ఆ తమిళంవాళ్ల సందడి. రెయిన్‌బో హోటల్లో టీ తాగే జనం, పోరూరు సోమ సుందరం స్ట్రీట్ ముందు రంగురంగుల ఆనాటి హీరోయిన్ రాజశ్రీగారి మూడు మేడలు, కార్లో షూటింగ్‌కు బయల్దేరుతున్న కృష్ణగారి కారు. వస్తాపోతా వున్న జనం. గంగా హోటల్లోంచి వినిపిస్తున్న ఇళయరాజా కొత్త పాట. ఏంటో... నిన్నటిదాకా చప్పుడులేని ఆ కోనసీమ. ఇవాల్టినించీ అల్లరిచేసే ఈ చెన్నపట్నం. ఎక్కడికక్కడ సర్దుకుపోవడం ఇదేకదా జీవితం?

"నువ్వో సినిమా చెయ్యాలయ్యా వంశీ," అంటా ప్లెజంట్‌గా నవ్వుతున్న యాక్టరూ, రైటరూ, నిర్మాతా అయిన ఆ ప్రభాకర్‌రెడ్డిగారి ముందు కూర్చున్నాను. "మా జయప్రదా ఫిలింస్ బ్యానర్‌కి కాదులే. తెల్సున్న బయటివాళ్లకి. నిన్ను అడగమంటా నా దగ్గరకి కొస్తున్నారాళ్లు."

ఆయన చెప్పేది వింటా, "కథ మీదేనా సార్?" అన్నాను.

నవ్వేసినాయన, "కాదు. అసలేదీ నాది కాదు.. అయితే మ్యూజిక్ డైరెక్టర్ నువ్వు చేస్తున్న ఇళయరాజా కాదు," అన్నారు.

"మరెవరు రెడ్డిగారూ?"

"ఎస్పీ బాలసుబ్రమణ్యం."

"ఇదేంటీ?"

"వివరాలు మనం మళ్లీ కల్సినపుడు చెపుతాను." అనాయన అన్నాక ఇంకాసిని మాటలు మాట్లాడి లేచిన నేను, గౌడియా మఠం రోడ్లో వున్న ఎడిటింగ్ జరుగుతున్న ఆ మద్రాస్ ల్యాబ్‌కి బయల్దేరేను.

ఇరవై ఎనిమిదిరోజులపాటు తీసింది మొత్తం ఎడిట్ చెయ్యడానికి చాలా తక్కువ టైము పట్టింది కానీ, లెంగ్త్ కూడా తక్కువొచ్చింది.

"ఇదేంటీ?" అనుకుంటే ఒకటే స్పీడు సినిమా. ఎక్కడా ఆగడంలేదు.

నా దగ్గరకొచ్చినా ఎడిటింగ్ అసిస్టెంట్ మెహబూబ్ ఖాన్ "చాలా సైలెంట్ షాట్స్ రెండు మూడు కేన్స్ అయ్యేలాగున్నాయి," అన్నాడు.

"సాంగ్ నెంబర్ ఒన్ అని ఆ కేన్ మీద రాయి చెపుతాను," అంటా ఆ మధ్యాహ్నం ఇళయరాజాగారి థియేటర్‌కెళితే మలయాళం డైరెక్టర్ ఫాజిల్ సినిమా కంపోజింగ్ జరుగుతుంది.

లంచ్ బ్రేకప్పుడు "ఆల్రెడీ కంపోజ్ చేసిన పల్లవి ఉంది. దానికి చరణం చెయ్యాలి," అంటా ఇళయ రాజాగారికి చెప్పి బయుటకొచ్చేసేక, ఇన్‌ఛార్జ్ కళ్యాణాన్ని కల్సి పాట రికార్డింగ్‌కి టైమడిగితే ఎప్పుడూ చెప్పేదే, "చాలా బిజీ ఈ రెండు నెలలు," అన్నాడు.

"అదికాదులే చూడు సామీ," అంటా గొడవ చేస్తుంటే పరుగెట్టుకుంటా వచ్చిన సుబ్బయ్యగాడు "అయ్యా... పిలుస్తున్నారు," అన్నాడు అరవంలో.

వెళ్లిన నాతో, "ఆ పల్లవి వినిపించు," అంటే నా మినీ టేప్‌రికార్డర్ ఆన్ చేశాను. అరనిమిషం కంటే తక్కువ టైము కళ్లు మూసుకున్నాయన ఆ చరణం చేసేశాక అసిస్టెంటు సుందర్రాజన్‌తో దాన్ని నేను తెచ్చిన కొత్త టేపులోకి ట్రాన్స్ఫర్ చేసుకుని మళ్లీ కళ్యాణం దగ్గరకొచ్చి కాసేపు సతాయించడం అయ్యేక సరే రేపొస్తానంటా బయల్దేరాను.

ఎడిటింగ్ రూమ్‌కొచ్చిన నేను ఆవేళంతా కూర్చుని ఆ మూడు కేన్స్‌లో షాట్స్‌నీ ఒక రఫ్ ఆర్డరేసేను.

ఆ రష్‌ని వీడియో తీయించాక, క్యాసెట్ పట్టు కుని ప్రొడక్షన్ ఆఫీసుకెళ్లేను.వచ్చిన సీతారామశాస్త్రి నాకోసం ఎదురుచూస్తున్నారు. ఇళయరాజాగారు చరణం కంపోజ్ చేసిన ఆ ట్యూన్ క్యాసెట్ ఆయన కిచ్చి వినమంటే రెండు మూడుసార్లు విన్న శాస్త్రి, "సందర్భం ఏంటి, ఎలాంటి సాహిత్యం రాయాలి ఈ ట్యూన్‌కి?" అన్నారు.

అప్పటికే సిట్టింగ్ రూమ్‌లో రెడీగా ఉన్న ఆ వీడియో క్యాసెట్ ప్లే చేయడం మొదలెట్టాను.

వస్తున్న ఆ షాట్లన్నీ చూస్తున్న శాస్త్రి, "ఏంటి దంతా?" అన్నారు.

"ఇంతసేపూ మీరు చూసిన షాట్స్‌లో మీకేం అనిపించింది?" అన్నాను.

"చూసిన అన్ని షాట్స్‌లోనూ హీరో అయిన ఆ టైలర్‌గాడు కనిపించినా ఆడాళ్లని చూసి వాళ్లలో ఏదో వెతుక్కుంటున్నాడు," అన్నారు.

"ఆల్రెడీ మూడు పాటలు రాసిన మీకు ఈ సినిమా కథ తెల్సు. భరణిగారు డైలాగ్ వెర్షన్ కూడా వినిపించాడు గదా? ఇంతసేపూ మీరు చూసినవి ఈ సినిమాలో వచ్చే ఫస్ట్ సాంగ్‌కి సంబంధించిన షాట్స్ ఇవన్నీ," అన్నాను.

"ఈ ఫీల్డ్‌కి కొత్తగా వచ్చాన్నేను. కాస్త వివరంగా చెప్పండి," అన్నారు శాస్త్రి.

నవ్వేసిన నేను, "ఎప్పట్నించో ఉన్న పాత సినిమా కవులకి కూడా ఇది కొత్త ఎక్స్‌పీరియన్సే శాస్త్రిగారు," అన్నాను.

కళ్లు మూసుకు వింటున్న శాస్త్రి, "బాగా వివరంగా చెప్పండి," అన్నారు.

"చెప్పడానికింకేం లేదు. మీరు చూసిన షాట్స్‌లో ఆ టైలర్ సుందరం వెతుకుతున్న కథ వుంది. ట్యూన్ ఆల్రెడీ వినేసేరు. కథలో అంశాన్ని విన్న ట్యూన్లో

ఇమడ్చాలి మీరు,'' అంటా చెప్పిందే మళ్లీ మళ్లీ చెపుతున్నాను.

అప్పుడే గదిలోకొచ్చిన సత్యంగారు, ''ఆయన కర్థం అయ్యిందయ్యా. ఎందుకు చెప్పిందే మళ్లీ మళ్లీ చెపుతున్నావు?'' అన్నారు.

''నేను సొంతం చేసుకోడానికి,'' అంటా ఆ చెప్పిందే మళ్లీ చెప్తున్నాను.

ఎక్కడ ఎక్కడ ఎక్కడ ఎక్కడ ఎక్కడ దాక్కున్నావే లక్కును తెచ్చే చుక్క... ఎక్కువ చిక్కులు పెట్టక చిక్కవె చప్పున చక్కగ టక్కున టక్కరిపిట్ట నిన్నూ పట్టేదెట్టానా నా అవస్థలూ పడతా ఆ సాయంకాలానికి ఒక పల్లవి రాస్తే నాకు కావాల్సిన మార్పులు చెపుతా, ''తెల్సుగదా రేపొద్దున ఇళయరాజాగారి అసిస్టెంట్‌తో ట్యూన్ చెకింగ్ ఉంటది,'' అంటున్నాను.

ముందు కొంచెం చిరాకుపడ్డా, కాస్త గాడిలో పడ్డాకా ఇలా పాట రాయడం కూడా ఎంజాయ్ చేస్తున్న శాస్త్రి చరణం రాయడానికి షాట్లు చూపించమంటన్నారు.

''ఫస్ట్ చరణానివి మట్టుకే చూపిస్తాను. రెండో చరణంలోకి హీరోయిన్లొచ్చేస్తారు గాబట్టి లిరిక్ మారిపోతుంది మరి,'' అన్నాను.

''సరే సరే,'' అంటా టీవీ స్క్రీన్ చూస్తున్న సీతా రామశాస్త్రిగారికి ప్లే అవుతున్న ఆ క్యాసెట్లో రకరకాల షాట్లు కనిపిస్తున్నాయి.

ఒకటికి పదిసార్లు వాటినే చూపిస్తా, ''మీరు సాహిత్యం అనుకోండి. ముందు షాటు వెనక్కి, వెనక షాటు ముందుకీ షిఫ్ట్ చేసుకుంటాను,'' అన్నాను.

కిందామీదా పడతా రకరకాల లైన్స్ రాసి చూపి స్తున్నాడాయన.

వాటిల్లో ఆ సందర్భానికి అతకనివి ట్యూన్‌కి మ్యాచ్ కానివీ చెపుతుంటే నవ్వుతానే వినుక్కుంటా ముందు కెళ్తున్నారాయన. ఆకారం చూస్తే సరిపోదంటా ఒకటే గురుతూ తెలిసేదెట్టా ఈ మందలో ఏ సుందరో లాగాలి కూపీ... గుట్టుమట్టు చేసి పుట్టుమచ్చను చూసి టక్కున పట్టెయ్యాలి నక్కను తొక్కెయ్యాలి పొరపడి పరులకి దొరకక... ట్యూన్ అనుకుంటా ఆయన రాసిం దాన్ని చదువుకుంటుంటే నావైపు తిరిగిన శాస్త్రిగారు, ''ఏదో ట్యూన్‌కీ మీ షాట్స్‌కీ మాటలు పేరుస్తున్నాను గానీ, పొయెట్రీ ఏమాత్రం రావటంలేదు,'' అంటుంటే అతన్లో కవిని తొంగి చూస్తున్నాను. అలా చూస్తానే, ''ప్రతి సినిమా పాటలోనూ కవిత్వం ఉండదు కదండీ. అందుకే రేపొద్దుట ఏ సినిమా కవిదన్నా పుస్తకం వేస్తే అతను రాసినవన్నీ వెయ్యకూడదు మరి,'' అన్నాను.

నవ్విన శాస్త్రి, ''తర్వాత చరణం షాట్లు?'' అనడంతో అవి ప్లే అవ్వడం మొదలెట్టాయి.

వాటినే చాలాసార్లు చూసి ఆయన లైన్స్ రాసుకుంటాపోతుంటే ఇందాకన్నట్టు వెనక షాట్లు ముందుకీ ముందు షాట్లు చివరికీ జరపాలనుకుంటా నోట్సు రాసుకుంటున్నాను.

శ్రీదేవి వాణి పశుపతిరాణి ఎదురై నిలిచే సమయములోనా ఎలాగని గుర్తించనూ శ్రీదేవిని ఆ దేవిని ఎలాగని గుర్తించనూ నా దేవి ఏదో గుర్తులు గుట్టుగ దాచి అల్లరిపెట్టే వేళ ఎవ్వని నవ్వులు నమ్మను



గుండెను ఎవ్వరికివ్వను హరి హరి ఇక మన పని సరి... అలాగ నానా అవస్థ పడతా రెండో చరణం పూర్తిచేసేక మర్నాడు మధ్యాహ్నం ఇళయరాజాగారికంటే పెద్దోడైన ఆ అసిస్టెంటు సుందర్రాజన్ దగ్గర ట్యూన్‌కి సాహిత్యం తో లైన్స్ మ్యాచ్ అయ్యాయో లేదో చెకింగ్‌కి వెళ్లాం.

ట్యూన్‌లో ఒక గురువు తేడా వచ్చినా, లఘువు అడ్డొచ్చినా ముడియాదు ముడియాదు (కుదరదు కుదరదు) అంటా చాలా గొడవచేసే ఆ సుందరాజన్‌కి ముడియాదు స్వామి... అని పేరు పెట్టేడీ సీతారామశాస్త్రిగారు. తిరగ్గా తిరగ్గా మొత్తానికి ఆవేళ పొద్దుట రికార్డింగ్ కాల్షీట్ ఇచ్చేడా కళ్యాణం. హార్మోనియం పెట్టెముందు కూర్చున్న ఇళయరాజాగారు, “చెప్పు ఈ పాట ఎలాక్కావాలీ?” అన్నారు.

ఏ బ్యాక్‌గ్రౌండ్ ఎలాక్కావాలో ఆయన్తో చెప్పడానికి నాకు చొరవ ఏర్పడ్డం వల్ల కమలహాసన్ యాక్ట్ చేసిన విక్రమ్ అనే తమిళ సినిమాలో వనితామణి సాంగ్ వినిపించి ఫస్ట్ బ్యాక్‌గ్రౌండ్ అచ్చం ఈ పాటలో లాగ కావాలన్నాను.

“నేను చేసిన పాటలో బ్యాక్‌గ్రౌండ్ కాపీ కొట్టి నాకే వినిపిస్తున్నావా?” అన్నారు.

“మీది మీకే వినిపిస్తే కాపీ ఎలాగనిపిస్తది? రెండూ మీ పాటలే గదా? అన్న లైపులో మాటాడతా ఆ బ్యాక్‌గ్రౌండ్ కోసం ప్రిపేర్ చేసి తెచ్చుకున్న ఆ వాక్యాలు వినిపించి వాటిలో ఫిమేల్ చెప్పాల్సినవీ, కోరస్‌వాళ్లు చెప్పాల్సినవీ వినిపిస్తే రాసుకున్నాకా తర్వాత బ్యాక్‌గ్రౌండ్ కోసం తీసిన షాట్ గుర్తు చేసుకుని ఏమేం సౌండ్లు ఎలాగెలాక్కావాలో చెపుతుంటే ఎవడూ చెప్పని ఈ పద్ధతికి కాస్త విసుక్కుంటా మధ్యమధ్యలో నన్ను తిడతా వాటి నోట్సు కూడా రాసుకున్నారు. తీస్తున్న నేను అక్కడ్నుంచి, “ఫస్ట్ బ్యాక్‌గ్రౌండ్‌లో కోరస్ తో పాటు లైన్స్ చెప్పడానికి ఎస్పీ శైలజని పిలిపించనా?” అన్నాను.

సరే అన్నట్టు ఆయన తలూపేటప్పటికి తలుపు జేరేసి బయటికొచ్చేను. మధ్యాహ్నానికి ట్రాక్ రికార్డింగ్ అయిపోడంతో వచ్చిన బాలుగారు పాడేసేరు. ముందే చేసుకున్న ప్లాన్ ప్రకారం సౌండ్ డెవలప్ చేయించి, ఏవీఎమ్ బ్లాకండ్వైట్ లేబ్‌లో పాజిటివ్ ప్రింట్ చేయించాక ఎడిటింగ్ రూమ్‌కెళ్లి మార్కింగ్‌కి కూర్చున్నాను.

సాయంత్రానికి పాట రెడీ అయిపోయింది. దాన్ని పట్టుకుని ప్రసాద్ స్టూడియోకెళ్తే ఏదో తమిళ సినిమా రీరికార్డింగ్ చేస్తున్న ఇళయరాజా పక్కనే వున్న ఎమ్మెస్ విశ్వనాధన్‌తో మాట్లాడతా మధ్యలో నన్ను చూసి మళ్లీ ఎందుకొచ్చేవన్నారు.

“పొద్దుట రికార్డింగ్ చేసిన పాట ఎడిటింగ్ అయిపోయింది. మీరోసారి చూస్తారని తెచ్చేను. పైన ప్రొజక్టర్లో ట్రెడింగ్ అయ్యి రెడీగా వుంది,” అన్నాను.

“అరె అవునా!! వెయ్యమను,” అన్నారోలేదో లైట్లారిపోయి పాట మొదలైంది తెరమీద. మొత్తం చూసినా ఇళయరాజాగారు ఆయనిచ్చిన సౌండ్స్‌కి సింక్ అయిన ఆ షాట్స్‌ని చూసి థ్రిల్లవుతా చూసేక పక్కనే ఉన్న ఎమ్మెస్ విశ్వనాథన్‌గారితో, “చూడు అన్నా వీడు!” అంటా జరిగిందంతా చెప్పేటప్పటికి ఆ పెద్దాయన చాలా మెచ్చుకుంటా చూసేరు. హాల్లోకెళ్తే చూసిన ఆర్కెస్ట్రావాళ్లంతా, “ఇలాగ చేయటం ఫస్ట్ టైమ్ అంటా మాట్లాడ్తుంటే మోంటేజ్ సాంగే కదా?” అంటా నవ్వేను.

*

రాత్రి ఇంటొకొచ్చేప్పటికి హాల్లో ఉన్న ఆ లేత నీలంరంగు ఫోను మోగడం మొదలెట్టింది.

అరకు నుంచి తనే.

గబగబా వెళ్లి లిఫ్ట్ చేసిన నేను, “మొన్న ఊళ్లో కొచ్చిన వెంటనే ఫోను మోగితే నువ్వే అనుకున్నాను. కానీ యాక్టర్ ప్రభాకర్‌రెడ్డిగారు... ఎలాగుంది మీ అరకు?”

“దానికేం బాగానే వుంటుంది. మీరిచ్చిన ఆ రాజోలు ఎడ్రస్‌కి నే రాసిన ఉత్తరాలన్నీ చదివారు కదా?”

“ఆఁ ఒకటికి పదిసార్లు.”

“మరైతే ఎప్పుడొస్తారు మా అరకులోయలోకి?”

“నవంబరు 13 రాత్రి.”

ఇపోలేదింకా...


ONE OF A KIND, WORLD-CLASS
VILLA PROJECT AT THE MOST EMERGING
LOCATION, KAPULUPPADA, VISAKHAPATNAM.
JUST 7 KMS FROM IT HUB
₹3.1 cr* onwards
Possession by April 2024
SF 580
62 High-end villas
Villas ranging from 4,002 sq. ft. to 7,435 sq. ft.
11 Acres, 73% Green & open spaces
Tennis, Basket ball, Shuttle courts & Cricket pitch
32,000 sq. ft. clubhouse
Play areas & Outdoor fitness station
*T&C Apply
Scan the code to download our brochure
For more details contact
+91 96903 88888
Kapuluppada, Visakhapatnam
Contact@villaasam.com
Visit www.villaasam.com
VILLAASAM
BY
AUGMENTED REALTY

నివాళి...



# తెలుగు పలుకుకు బంగారు మురుగు

❖ జంపాల చౌదరి

సుప్రసిద్ధ మలయాళ చిత్ర దర్శకుడు ఎం.టి. వాసుదేవన్ నాయర్, తొమ్మిదేళ్ల విరామం తర్వాత, ఒక కథను చదివి ముచ్చటపడి 2000 సంవత్సరంలో ఒరు చెరు పుంజిరి (ఒక చిరునవ్వు) అనే చిత్రాన్ని నిర్మించారు. ఆ చిత్రం 2001 జాతీయ ఫిల్మ్ అవార్డులలో ఉత్తమ పర్యావరణ సంరక్షణ చిత్రంగా బహుమతి సంపాదించింది. కేరళ ప్రభుత్వం ఎం.టి.కి ఆ సంవత్సరం ఉత్తమ దర్శకుడి అవార్డు ఇచ్చింది. అంతకన్నా గొప్ప గౌరవమేమిటంటే ఆ చిత్రం పతాక సన్నివేశాలని 9వ తరగతి విద్యార్థుల మలయాళం టెక్స్ట్ బుక్‌లో పాఠ్యాంశంగా చేర్చారు. ఇంతకూ పర్యావరణ రక్షణకు పెద్దపీట వేసి ఎం.టి.కి అవార్డు తెచ్చిపెట్టిన ఆ చిత్రం మూలకథ, ఒక తెలుగు కథ. అప్పటికే ఇంట గెలిచిన ఆ తెలుగు కథ పరాయిభాషలో సినిమా రచ్చ కూడా గెలిచి చూపించిందన్న మాట.

అదే కథను అంతకుముందు నుంచే తెలుగులో సినిమాగా తీయాలని బహు ప్రయత్నాలు జరిగాయి. గుమ్మడి, బ్రహ్మానందం, ఎల్బీ శ్రీరాం వంటి ప్రముఖ నటులు ఆ చిత్రంలో నాయకపాత్ర ధరించాలని ఉవ్విళ్లూరారు. చివరకు ప్రముఖ నటుడు తనికెళ్ల భరణి దర్శకత్వంలో వచ్చిన ఆ చిత్రం 2012 సంవత్సరం కాంస్య నంది గెలుచుకోవటమే కాక ఆ చిత్రంలో ముఖ్యపాత్రధారులకు ప్రత్యేక జ్యూరీ అవార్డులను కూడా తెచ్చిపెట్టింది.

ఈ కథ సినిమాలుగా రాకముందే అనేక రకాలుగా ప్రసిద్ధమయ్యింది. ఆ కథను మొదట చదివిన ప్రముఖ చిత్రకారుడు బాపు, అంత పెద్ద కథను తన స్వహస్తాలతో తిరగరాసి ప్రత్యేకంగా గౌరవించారు. ఆ కథ అచ్చులో రాకముందే బాపుగారి దస్తూరీలో అసంఖ్యాక అభిమానులను చేరింది. ఆ తరువాత రచన పత్రికలో బాపు చేతిరాతలోనే రెండుసార్లు ప్రచురించబడ్డ ఆ కథ, 1997లో ప్రచురించబడ్డ ఉత్తమ తెలుగు కథగా ఎంపికై, Katha Prize Stories, Volume-8లో ప్రచురించబడింది (కల్లూరి శ్యామల ఆంగ్లానువాదం). రచయిత మిగతా కథలతో పాటు ప్రచురించిన కథాసంకలనం ఎనిమిది ముద్రణలు పొందింది. ఆ కథ ప్రచురించబడ్డ పద్నాలుగేళ్ల తర్వాత ఆ కథనొక్కదాన్నే బాపుగారి రాతలో ప్రచురించగా ఇరవైవేలపైన కాపీలు అమ్ముడుపొయ్యాయి. చాలాసార్లు పెళ్లిళ్లలో, గృహప్రవేశాలలో, షష్టిపూర్తి ఉత్సవాలలో వచ్చిన అతిథులకు ప్రత్యేకంగా ముద్రించి ఆ కథ పుస్తకాలు ఇవ్వటం నాకు తెలుసు. మా మెడికల్ కాలేజీ క్లాసు రీయూనియన్‌లోనూ, మా నాన్నగారి స్మారక సభలోనూ, నేనే స్వయంగా ఆ పుస్తకం ప్రత్యేక ముద్రణలను అతిథులందరికీ అందించాను. ఆకాశవాణిలో ఆ కథ శ్రవ్యనాటకంగా ప్రసారమయింది. కాకినాడవాసి స్నిగ్ధ ఈ కథను రంగస్థల నాటకంగా మలచగా, స్వర్గీయ ప్రసాదమూర్తి

దర్శకత్వంలో అనేక ప్రదర్శనలూ, ప్రశంసలూ పొందింది. సినీనటుడు వేలు కూడా ఈ కథని రంగస్థల నాటకంగా ప్రదర్శించారట. ఇంగ్లీషులోకి రెండుసార్లు, కన్నడంలోకీ, తమిళంలోకీ, మలయాళంలోకీ, ఇతర భాషలలోకీ అనువదించబడింది. ఇందాకే చెప్పినట్లు రెండుసార్లు సినిమాగా కూడా వచ్చింది. మళ్లీ రెండేళ్ల క్రితం రాయన గిరిధర గౌడ్ బహుసుందరంగా అలంకరించిన వర్ణచిత్రాలతో, కొత్త చేర్పులతో, మంచి బైండింగుతో ఆకర్షణీయమైన ప్రత్యేక ఎడిషన్‌గా ఆ కథ మళ్లీ ప్రచురించబడింది. గత యాభయ్యేళ్లలో ఇంతటి ప్రాచుర్యమూ, గౌరవమూ పొందిన మరో కథ నా ఎరుకలో లేదు.


ఆ కథ పేరు మిథునం. కథ వ్రాసినది శ్రీరమణ.


శ్రీరమణ ప్రజ్ఞ, ప్రతిష్టలు మిథునంతో మొదలై అక్కడే ఆగిపోలేదు. మిథునం కథకుడుగా ప్రసిద్ధుడు కాకముందే, *బంగారు మురుగు, ధనలక్ష్మి, షోడా నాయుడు* వంటి కథలతో ఆయన అగ్రశ్రేణి కథా రచయితల జాబితాలో ఉన్నాడు. నవ్వులో శివుడు న్నాడురా అన్న మల్లాదివారి మాటను మనసారా నమ్మిన శ్రీరమణ, మిథునానికి చాలా యేళ్ల ముందే, నూనూగు మీసాల లేతప్రాయంలోనే పేరడీల రచయితగా పేరెన్నిక కన్నవాడు. ఆంధ్రజ్యోతిలో హాస్య జ్యోతిని వెలిగించి పాఠకులను రంగుల రాట్నం, ప్రేమపల్లకీ ఎక్కించినవాడు. టెలివిజన్ రాకముందే పాఠకులకు శ్రీఛానెల్ పరిచయం చేసినవాడు. తెలుగు ఇంటర్నెట్ తొలిరోజుల్లోనే ఆర్టిస్టు మోహన్‌తో కలసి సరసం.కాం వెబ్‌సైటు నడిపి, పాఠకులను చిలకల పందిరి ఎక్కించి, మొగలిరేకుల, సింహాచలం సంపెంగల పరిమళాలలో ముంచెత్తినవాడు. గుత్తొంకాయ కూర, మానవ సంబంధాల గురించి సాధికారికంగా, సావకాశంగా విశ్లేషించగలిగినవాడు. రామాయణాన్ని పాఠకులకు సరళభాషలో తిరిగి చెప్పినవాడు. హ్యూమర్ కాలమిస్టుగా చమత్కారానికీ, వ్యంగ్యానికీ మారుపేరైన వాడు. నవ్య వారపత్రిక ప్రథమ సంపాదకుడు. పత్రిక (మాసపత్రిక) గౌరవ సంపాదకుడు. బాపు మొదటి కార్టూన్ల పుస్తకం (తెలుగులోనే మొదటి కార్టూన్ పుస్తకం అది) కొంటె బొమ్మల బాపు 1978లో వచ్చినప్పుడు, బాపు స్వయంగా పాతికేళ్లు నిండని శ్రీరమణను ముందు మాట రాయమనటం ఒక సంచలనం అయితే, 'నాన్నృషిః కురుతే కార్టూన్' అంటూ శ్రీరమణ వ్రాసిన ముందుమాట కూడా సంచలనమే. శ్రీరమణ సృష్టించిన వెంకట సత్య స్టాలిన్, బంగారు మురుగు బామ్మ, మిథునం అప్పదాసు, బుచ్చిలక్ష్మిలు, తెలుగులో చిరకాలం నిలబడతారని నా నమ్మకం.

ఇంత పేరు సంపాదించుకున్న శ్రీరమణకు, మూడు పేర్లుండటం అంత ఆశ్చర్యం కలిగించదు. 1952 సెప్టెంబరు 22న తెనాలి దగ్గర వరాహపురంలో పుట్టినప్పుడు ఆయన పేరు వంకమామిడి రాధాకృష్ణ. తర్వాత బాపట్లలో ఆయన మాతామహుడు ఆయనను దత్తత చేసుకుంటూ పెట్టిన పేరు కామరాజు రామారావు. సాహితీకారుడుగా ఆయన స్వయంగా పెట్టుకొన్న, అందరికీ తెలిసిన పేరు శ్రీరమణ. ఆ పేరు రమణ మహర్షి స్ఫూర్తితో పెట్టుకున్నానని ఆయన చెప్పారు.

చిన్నతనంలో వరాహపురంలో వాళ్ల తండ్రిగారు నడిపిన ఎయిడెడ్ స్కూల్లో చదువుకున్న శ్రీరమణ, వేమూరు కవిరాజా జిల్లాపరిషత్ హైస్కూలో చదువు కుని, ఆ తర్వాత బాపట్ల కాలేజీ నుంచి బిఎస్సీ డిగ్రీ తీసుకున్నారు. చిన్ననాటి నుంచీ సాహిత్య వాతా వరణంలో పెరిగిన శ్రీరమణ హైస్కూల్ రోజుల్లోనే వివేకానందునిపై జాతీయస్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో మూడుసార్లు వరుసగా బహు మతులు గెల్చుకోవటమేకాక, హిమాలయ ప్రాంతా ల్లోని ఆల్మోరా (వివేకానందుడు జ్ఞానసిద్ధిని పొందిన ప్రాంతం)లో రామకృష్ణ కుటీరాన్ని ప్రత్యేక ఆహ్వానంపై పర్యటించారు.

1976లో ఒక ఆదివారం నాడు ఆంధ్రజ్యోతి దినపత్రిక అనుబంధంలో 'వెడుతున్న రైలు -ఫస్ట్ క్లాస్ కంపార్ట్‌మెంట్‌లో అతడేదో ఆలోచిస్తూ ప్రయాణం






చేయడం,' అనే సన్నివేశంతో విశ్వనాథ సత్యనారాయణ, సంజీవదేవ్, బుచ్చిబాబు, రావిశాస్త్రి, కొకు వంటి రచయితలను అనుకరిస్తూ వచ్చిన పేరడీలు తెలుగు పాఠకలోకాన్ని ఒక్క కుదుపు కుదిపాయి. అది శ్రీరమణకు పేరు తెచ్చిన మొదటి రచన. శ్రీరమణలో ఉన్న 'స్పార్క్' చూసి ముచ్చటపడిన నండూరి రామ్మోహనరావు ఆయన్ని ఆంధ్రజ్యోతిలోకి తీసుకువచ్చి *రంగులరాట్నం* అనే కాలమ్ అప్పచెప్పేటప్పటికి శ్రీరమణకు పాతికేళ్లు దాటలేదు. ఆంధ్రజ్యోతిలో పేరడీలు రాస్తూ, కాలం నిర్వహిస్తూ, వీక్లీ బాధ్యతల్లో పురాణం సుబ్రహ్మణ్యశర్మతో పనిచేస్తూ, *ప్రేమపల్లకీ* అనే నవల కూడా రాసేశారు శ్రీరమణ. శ్రీరమణ రాతలు చూసి ఆకర్షితులైన బాపు-రమణలు ఆయనను మద్రాసు తీసుకుపోయి తమ చిత్ర నిర్మాణాన్ని ఆయన చేతిలో పెట్టేశారు. ఆ రోజుల్లో బాపు రమణల సినిమాలలో మిగతా బాధ్యతలతో పాటు మ్యూజిక్ సిట్టింగూ, వెండితెర నవలల బాధ్యత శ్రీరమణే చూసుకునేవారు. దాదాపు పదేళ్లపాటు బాపు-రమణలతో ఉన్న శ్రీరమణ 1990లలో మద్రాసు నుంచి హైదరాబాదు తిరిగివచ్చి మళ్లీ పత్రికారంగంలోకి వచ్చారు. ఆ తర్వాత కొంతకాలం టీవీ రంగంలో కూడా పనిచేశారు. ఈమధ్య అస్వస్థత పాలయ్యే వరకూ, ఆయన నిరంతరం రాస్తూనే ఉన్నారు.

శ్రీరమణ ముఖ్యంగా చదువరి, మాటకారి, స్నేహశీలి. నిశిత పరిశీలకుడు. గొప్ప జ్ఞాపకశక్తి, సమయస్ఫూర్తి ఉన్నవాడు. ఆయన ఇంటి లైబ్రరీలో చాలా అరుదైన పుస్తకాలు ఉండేవి (ఆ పుస్తకాలను గుంటూరు అన్నమయ్య గ్రంథాలయానికి ఇచ్చేశారు). సాహిత్యంలో మంచిచెడ్డలు ఎరిగినవాడు. అనేక భాషల రచయితల ఆలోచనాశైలి, టెక్నిక్ తెలిసిన రసజ్ఞుడైన పాఠకుడు. పత్రికా సంపాదకుడిగానూ, సినిమాల్లో పనిచేయడం వల్లనూ శ్రీరమణకు తెలుగులో ఉన్న ప్రముఖ రచయితలందరితోనూ మంచి సంబంధాలు ఉన్నాయి. మనుషులన్నా మాటలన్నా ఇష్టపడే శ్రీరమణగారు, పెద్దాచిన్నా అందరితోనూ గంటలకొద్దీ ఆసక్తికరంగా కబుర్లు చెప్పేవారు. ఆయనకు ఫోన్ చెయ్యాలంటే అరగంటో, గంటో ఖాళీ సమయం ఉంచుకునిగానీ ఫోన్ చేసేవాడిని కాదు.

శ్రీరమణ రచనలలో ప్రధాన లక్షణం చమత్కారం. ముళ్లపూడి వెంకటరమణ తర్వాత శ్రీరమణ అంత నేర్పుగా, పొదుపుగా, ఒడుపుగా తెలుగుని వాడిన రచయిత మరొకరు లేరు. పన్నాల సుబ్రహ్మణ్య భట్టుగారైతే వ్యంగ్యరచనలో పానుగంటి తరవాత సీటు శ్రీరమణదే అంటారు. శ్రీరమణ చమత్కారం తన కాలమ్‌లకీ పేరడీలకి మాత్రమే పరిమితం కాదు. *మిథునం*, *బంగారు మురుగు* కథలు అంత పేరు రావడానికి ఆ కథల ఇతివృత్తం మాత్రమే కాదు, ఆయన ఆ కథలు చెప్పిన తీరు, మాటల కూర్పులో చూపిన నేర్పు కూడా. *బంగారు మురుగు* కథలో బామ్మగారు మనవడిని పెళ్లి సంబంధానికి ఒప్పించటానికి ప్రయత్నిస్తూ, 'ఆ పిల్ల గోరింటాకుతో పారాణి పెట్టుకుంటే నీ కాళ్లు పండాలి. నువ్వు ఆకు వక్క వేసు

కుంటే అమ్మడు నోరు పండాలి. అదీ ఇదీ అయి ఆనక మీకు కడుపు పండాలి. నేను మీ ఇంటికి రావద్దూ,' అంటుంది. రొమాన్సూ, సెంటిమెంటూ, చమత్కారమూ ఎలా కలగలిసిపోయాయో చూడండి. మిథునం ఎన్ని సార్లు చదివినా అప్పదాసు-బుచ్చిలక్ష్మిల సంభాషణల సొగసు గిలిగింతలు పెడుతూనే ఉంటుంది. మిథునం గురించి, ముళ్లపూడి వెంకటరమణ, 'ఎంత బాగా రాశాడండీ. ఎక్కడా అక్షరం పొల్లుపోకుండా, ఒక్కమాట కూడా అనవసరంగా లేకుండా శిల్పం చెక్కినట్టు చెక్కాడండీ కథను,' అంటూ మెచ్చుకున్నారు నాతో.

పుట్టి పెరిగిన పల్లెటూరుని పాతికేళ్ల వయసులో వదిలేసినా, ఆ మూలాలని ఆయన ఎప్పుడూ మరచిపోలేదు. వ్యవసాయ వ్యవహారాలనూ, వృత్తి పనులనూ నిశితంగా పరిశీలించిన శ్రీరమణ తన కళ్ల ముందు అంతరించిపోతున్న ఒక జీవన విధానాన్ని అక్షరబద్ధం చేసి తరువాతి తరానికి అందించాలని తాపత్రయ పడేవారు. ఆయన వ్రాసిన ఆఖరు పెద్ద కథ, నాలుగో ఎకరం ఆ ప్రయత్నంలో నుంచి వచ్చిందే. నిజానికి ఆ ఇతివృత్తంతో నవల రాసి ఆ కాలపు గ్రామీణ వ్యవసాయిక జీవన విధానాన్ని పరిచయం చేయాలని ఆయన ఉద్దేశం. సమయాభావం వల్ల దాన్ని కథగా సరిపెట్టారు కానీ సంతృప్తి పడలేకపోయారు.

నా ఉద్దేశంలో శ్రీరమణ కాలమ్‌లు రాయకుండా, సినిమా పరిశ్రమకు వెళ్లకుండా ఉంటే, ఆయన దగ్గర నుంచి ఎన్నో మంచి తెలుగు కథలు వచ్చేవి, నిలచేవి. చాలా మంచి కథా వస్తువులను ఆయన కాలమ్‌లకు బలిపెట్టేశారు. 'ఒక్కసారి సినిమా సిట్టింగులో కూర్చుంటే బోల్డు కథలు ఆ పూటలో ఖర్చైపోతాయి,' అని ఆయనే ఒకసారి అన్నారు.

పాత్రికేయునిగా శ్రీరమణ ఎంతోమంది రచయితలను, ఆర్టిస్టులను ప్రోత్సహించారు. పత్రికా రంగం బయట కూడా, సి.పి.బ్రౌన్ అకాడమీ, బొమ్మిడాల ట్రస్ట్, వి.వి.ఐ.టీ వంటి సంస్థలతో పని చేస్తూ తెలుగు సాహిత్యాన్ని ప్రోత్సాహపరిచే పనులెన్నో చేశారు. పుల్లెల శ్రీరామచంద్రుడి దగ్గర నుండీ, మోదుగుల రవిక్రిష్ణ వరకూ అన్నితరాలవారితోనూ స్నేహంగా ఉండేవారు. బాపుగారితో ప్రాణంగా మెలిగిన శ్రీరమణ అన్వర్, గిరిధర్ గౌడ్ వంటి వివిధ తరాల ఆర్టిస్టులనూ ప్రోత్సహించేవారు.

1995లో తానా సమావేశాల సన్నాహాలలో భాగంగా మద్రాసు వచ్చినప్పుడు శ్రీరమణగారిని మొదటిసారి కలిశాను. అప్పుడు నేను సంపాదకత్వం వహిస్తున్న సావెనీరుకు రాయమని అడిగితే కొద్దిగా వెటకారమాడి సున్నితంగా తప్పించుకున్నారు. ఆ సావెనీరు విడుదల అయిన తర్వాత ఆయనంత ఆయనే స్వయంగా సావెనీరును మెచ్చుకుంటూ ఉత్తరం వ్రాయటం ఆయన సహృదయతకు నిదర్శనం. 1997 ఆగస్టులో బాపుగారి చేతి రాతలో మిథునం కథ నాకు అందిన తర్వాత నేను ఆయనకు ఉత్తరం వ్రాయటంతో మా స్నేహం ప్రారంభం అయిందని చెప్పాలి. మిథునం విజయయాత్రలో నా పాత్రకు అవసరాన్ని మించిన ప్రాచుర్యాన్ని కల్పించటం ఆయన ఔదార్యం, నా అదృష్టం. 2003 విజయవాడ బుక్ ఎక్జిబిషన్‌లో శ్రీరమణగారూ, నేనూ కలిసి బాపు-రమణలతో ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించటం ఎప్పటికీ గుర్తుంచుకొనే అనుభవం. నేను హైదరాబాదులో ఉన్న ప్రతిరోజూ ఆయనను కలవటం తప్పనిసరి. అమెరికాలో ఉన్నా తరచూ ఫోనులో మాట్లాడుకునే వారం. సభలూ, సన్మానాలూ అంటే ఎక్కువ ఆసక్తిని చూపని శ్రీరమణ నా బలవంతం మీద అమెరికా తానా సభలకు రావటం, ఆయనకు అమెరికాని పరిచయం చేస్తూ కొన్నిరోజులు సన్నిహితంగా కలపగలగడం నాకు చాలా సంతోషాన్ని కలిగించింది. ఆయనతో మాట్లాడడం నాకు గొప్ప ఎడ్యుకేషన్. ఆయన మరణం తెలుగు సాహిత్యానికే కాదు, మా కుటుంబానికి కూడా తీరని నష్టం.

తెలుగు పలుకుబడికి *బంగారు మురుగు* తొడిగిన కలం అయిదు దశాబ్దాల తరువాత ఆగిపోయింది. 'బతుకంటే అదేరా బడుద్ధాయ్,' అన్న బుచ్చిలక్ష్మి మాటలు గుర్తు తెచ్చుకుంటూ, శ్రీరమణ మనకు మిగిల్చిన మాటల మూటల సంపెంగల వాసనలను కలకాలం అనుభవిద్దాం. ❀

కథ

* శ్రీరమణ

# బంగారు మురుగు

నాకు ఆరేళ్లప్పుడు మా బామ్మకి అరవై ఏళ్లు. మా అమ్మానాన్న ఎప్పుడూ పూజలు పునస్కారాలూ, మళ్లూ దేవుళ్లూ గొడవల్లో ఉండేవారు. స్వాములార్లు పీఠాధిపతులూ- ఎత్తే పల్లకీ దింపే పల్లకీలతో మా ఇల్లు మఠంలా ఉండేది.



అమ్మ తడిచీర కట్టుకొని పీతాల్ని సేవిస్తూ, నే దగ్గరకు వెళితే, 'దూరం దూరం తాక్కూడదు,' అనేది.

బామ్మకి ఈ గొడవలేం పట్టేవికావు. అమ్మా నాన్నా, చుట్టం పక్కం అన్నీ నాకు బామ్మే. మా బామ్మకి కాశీ, రామేశ్వరం అన్నీ నేనే. ఓ కంచంలో తిని ఓ మంచంలో పడుకొనేవాళ్లం.

పెద్దతనపు నస, అత్తగారి సాధింపులూ, వేధింపులూ బామ్మ దగ్గర లేవు. ఎవరేనా, 'ఈ ముసలమ్మకి భయమూ, భక్తీ రెండూ లేవు...' అంటే, 'దయ కంటే పుణ్యం లేదు, నిర్దయ కంటే పాపం లేదు. చెట్టుకి చెంబెడు నీళ్ల పోయడం, పక్షికి గుప్పెడు గింజలు చల్లడం, పశువుకి నాలుగు పరకలు వెయ్యడం, ఆకొన్న వాడికి పట్టెడు మెతుకులు పెట్టడం- నాకు తెలిసిందివే,' అనేది.

బామ్మకి పుట్టింటివాళ్లిచ్చిన భూమి నాలుగైదెకరాలు ఇంకో ఊళ్లో ఉండేవి. మా ఊరికి పదికోసుల దూరం. ఏటా పంటల కాలంలో కౌలు చెల్లించడానికి రైతులు వచ్చేవాళ్లు. వచ్చీరాగానే వాళ్లని ఆప్యాయంగా పలకరించేది. పుట్టిన ఊరు విశేషాలన్నీ గుక్క తిప్పుకోకుండా అడిగేది. వాళ్లు బదులు చెప్పకుండానే మళ్లీ ప్రశ్న- ప్రశ్న మీద ప్రశ్న వర్షం కురిపించేది. రైతులేమో పంట తెగుళ్ల గురించి, అకాల వర్షాల గురించి సాకులు చెప్పి పావలో బేడో చేతుల్లో పెట్టి వెళ్లాలనే ఆలోచనతో దిగులు మొహాలు తగిలించుకు వచ్చేవాళ్లు. ఆమాట ఎత్తడానికి బామ్మ అవకాశం ఇస్తేనా-?

"ఎండనపడి వచ్చారు కాళ్లు కడుక్కోండర్రా," అనేది. వడ్డన ఏర్పాట్లలో పడిపోయేది. విస్తరి వేసిం దగ్గర్నుంచి పెరుగు అన్నంలోకి వచ్చేదాకా వాళ్లతో ఊరి వాళ్ల కబుర్లన్నీ వాగించేది.

తీరా పెరుగన్నం చివర్లో, "ఏరా అబ్బీ ఈ ఏడాది పంటలెలా ఉన్నాయిరా?" అని అడిగేది.


వాళ్లకి పచ్చి వెలక్కాయ గొంతున పడ్డట్టయేది. కమ్మటి భోజనం కొసరికొసరి వడ్డిస్తే తిని, పైగా తిన్న విస్తరి ముందు కూచుని, 'పంటలు పోయాయ'ని చెప్పడానికి నోరాడక, "ఫర్వాలేదమ్మా దేవుడి దయ వల్ల," అనేవాళ్లు. ఇంకేం చేస్తారు పాపం, అణాపైసలతో శిస్తు అప్పగించి వెళ్లేవాళ్లు. వెళ్లేటప్పుడు, "ఇదిగో బుల్లిపంతులూ! మీ అవ్వ గట్టి పిండమే," అని ఎగతాళి చేసి వెళ్లేవాళ్లు.

బడికి వెళ్లనని మారాం చేసినపుడల్లా బామ్మ నాకు అండగా ఉండేది. "పసి వెధవ, గ్రాహ్యం వస్తే వాడే వెళ్తాడు. అయినా ఒక్కగానొక్కడు బతకలేక పోతాడా..." అంటూ నన్ను చంకనేసుకు బయటకు నడిచేది.

మా ఇంటి పెరడు దాటగానే పెద్ద బాదంచెట్టు ఉండేది. అది మా స్థావరం. రోజులో మూడొంతులు అక్కడే మా కాలక్షేపం. బాదంచెట్టు పచ్చటి గొడుగు పాతేసినట్టు ఉండేది. రాలిన పండు ఆకులు విస్తరి కుట్టుకుని బామ్మ భోజనం చేసేది. దాని చుట్టూ చిన్న మట్టి అరుగు ఉండేది.

"దీన్ని కాపరానికొచ్చేప్పుడు మా పుట్టింటి నుంచి తెచ్చా... అప్పుడు జానా బెత్తెడుండేది. నువ్ నమ్మవ్... పిచ్చిముండకి మూడే ఆకులు బుల్లిబుల్లివి ఉండేవి..." రోజూ ఒకసారైనా ఈ మాట నాకు చెప్పేది. 'నే కాపరానికొచ్చి ఎన్నేళ్లో ఈ పిచ్చిముద్దుకి అన్నేళ్లు,' అంటూ మానుని చేత్తో తట్టేది ఆపేక్షగా.

ఇప్పటికీ బామ్మ చెంబెడు నీళ్లు దానికి పోస్తూనే ఉంటుంది. మానుకి రెండు తొర్రలుండేవి. పై తొర్రలో



***శ్రీరమణ అసలు పేరు వంకమామిడి రాధాకృష్ణ (కామరాజు రామారావు). వీరి మొదటి కథ వెలుగు తగ్గని వజ్రం 1970లో ఆంధ్రపత్రికలో అచ్చయినా, 1993లో ఆంధ్రజ్యోతిలో అచ్చయిన బంగారు మురుగు కథతో కథా రచయితగా గుర్తింపు పొందారు. మిథునం, సింహాచలం సంపెంగలు కథాసంపుటాలు ప్రచురించారు. అనేక హాస్యరచనలు, వందల కొద్దీ పేరడీలు రచించారు. బాపు-రమణలతో కలిసి కొన్ని సినిమాలకు, అనంతరం వివిధ పత్రికలలోనూ పనిచేశారు. వీరి మిథునం కథ సినిమాగా రూపొందింది. జులై 18న హైదరాబాద్‌లో మరణించారు. తానాపత్రిక వీరికి నివాళులు అర్పిస్తోంది.***

రెండు రామచిలకలు కిలకిలలాడుతూ కాపరం చేస్తుం డేవి. ఇంకో తొర్రలో బామ్మ నాకోసం చిరుతిళ్లు దాచేది. కొమ్మకి తాళ్ల ఉయ్యాల ఉండేది. కాకులు పడేసిన బాదంకాయలు వైనంగా కొట్టి నాచేత బాదంపప్పులు తినిపించేది. ఆ బాదంచెట్టు మా ఇద్దరికీ తోడూనీడా.

ఊరు లేచేసరికి వాకిలంతా తీర్చిదిద్ది ముగ్గులు పెట్టేది బామ్మ. రాత్రి నాకు జోల పాడుతూ రేపటి ముగ్గు మనసులో వేసుకొనేది. ముగ్గులు అయ్యేదాకా నేను బామ్మ వీపుమీద బల్లిలా కరుచుకుని పడుకుని కునుకు తీస్తుండేవాణ్ణి.


"అసలే నడుం వంగిపోయె... పైగా ఆ మూట కూడా దేనికి?" అని మా అమ్మ అంటే, "వాడు బరు వేంటే. వాడు వీపున లేకపోతే ముగ్గు పడదే తల్లీ... చూపు ఆనదే అమ్మా," అనేది బామ్మ.

సమస్త దేవుళ్లకీ మేలుకొలుపులు పాడుతూ వాకిలి నాలుగు దిక్కుల్నీ ముగ్గుతో కలిపేది. అప్పుడు మా మండువా లోగిలి నిండుగా పమిట కప్పుకు నిల బడ్డ పెద్ద ముత్తయిదువులా ఉండేది. "పాట పాడి దేవుళ్లని లేపకపోతే వాళ్లు లేవరా," అని అడిగితే, "పిచ్చిసన్నాసీ దేవుళ్లు నిద్దరోతార్రా! దేవుడు నిద్దరోతే ఇంకేమైనా ఉందీ! మేలుకొలుపులు మనకోసమే, చక్ర పొంగలీ మనకోసమే," అనేది బామ్మ.

తెల్లారగానే నూనెరాసి, నలుగుపెట్టి కాకరపందిరి కింద ముక్కాలిపీట మీద కూచోపెట్టి వేడినీళ్లు పోసేది. "చిక్కిపోయాడమ్మా పిల్లాడు... పొడుగు సాగుతున్నాడో ఏమో," అని బామ్మ రోజూ నలుగు పెడుతూ దిగులు పడేది. ఒంటిమీద చిన్న గాటో, దెబ్బో, పొక్కో కనిపిస్తే, "అఘాయిత్యం వెధవ్వి. ఎక్కడ తగిలించుకున్నావ్," అని గారాబంగా కేకలేసి తెగ దిగులుపడిపోయేది. నాకప్పుడు ఎంతో హాయిగా అనిపించేది.

నెలకోసారి భజంత్రీవాడు వచ్చేవాడు. బాదం చెట్టు కింద నేను, మా బామ్మ తలపని చేయించుకొనే వాళ్లం. ముందు నా వంతు-

"ఒరేవ్ జాగ్రత్తగా చెయ్. పిల్లాడి క్రాపు తెల్లదొర క్రాపింగ్‌లా ఉండాలి," అని హెచ్చరికలూ, సలహాలూ ఇస్తూ ఎదురుగా కూర్చునేది బామ్మ. అయినా వాడి పద్ధతిలో వాడు తిరపతి మెట్లతో డిప్పకొట్టుడు కొట్టేసే వాడు. తనవంతు వచ్చినపుడు చేతిన ఉన్న బంగారు



మురుగు తీసి నా చేతికి తొడిగేది. స్నానం చేశాక కుంకుడు రసంతో ఆ బంగారు మురుగుకి మెరుగు తెప్పించి తన చేతికి వేసుకొనేది. మెరుస్తున్న చేతిని తృప్తిగా చూసుకొనేది.

బజారు చిరుతిళ్లు తినకూడదని నామీద గట్టి ఆంక్ష ఉండేది. ఆరోగ్యం కంటే కుటుంబ మర్యాద దెబ్బతింటుందని. నాకవేం తెలిసేవికావు. బెల్లపు జీళ్లు, పీచు మిఠాయి, జంతికలు, తేగలు కొనుక్కు తినాలని నాలిక పీకేది. బామ్మని అడిగితే, 'ఓస్ అంతేకదా! పద,' అని కోరినన్ని కొనిపెట్టేది. మరికొన్ని బాదంచెట్టు భోషాణంలో దాచిపెట్టేది. బామ్మ నా పాలిట వరాలిచ్చే దేవత.

మనవడికి అడ్డమైన గడ్డీ కొనిపెడ్తోందని తెలిసి, బామ్మకి డబ్బు దొరక్కుండా ఇంట్లో కట్టడి చేశారు. దీనిమీద ఇంట్లో చాలాసార్లు గొడవలు జరిగాయి. బామ్మమీద నిఘా వేసినా నా చిరుతిళ్లకి లోటు రాకుండా చూస్తోంది. బియ్యం ఒళ్లో పోసుకొచ్చి జీళ్లు తేగలూ నైవేద్యం పెట్టేది నాకు. అదీ తెలిసిపోయింది. బియ్యం డబ్బాకి తాళం పడింది. దాంతో నా నోటికి కూడా. అత్తగారి ఆట కట్టిందని అమ్మ సంతోషించింది.

"ఇంటి దీపానివి, చక్రవర్తివి నీకీ కరువేంటి నాయనా," అని బామ్మ బాధపడింది.

ఆరోజు పీచుమిఠాయి వాడు ఊళ్లోకి వచ్చాడు. వాడు రోజూ రాడు. సంతరోజు మాత్రమే వస్తాడు. మూడువైపులా రేకు, ఓవైపు సరుకు కనిపించేలా అద్దం ఉన్న డబ్బా- విచ్చిన గులాబీలు కుక్కినట్టు డబ్బా నిండా పీచుమిఠాయి పొత్తులు- వాడు డబ్బా చప్పుడు చేస్తూ, 'పీచ్మిఠా,' అని చిత్రంగా అరుస్తూ వీధిన వెళుతుంటే నా నోరెంత ఊరిందో బళ్లో ఉన్న నాకు తెలుసు, ఇంట్లో ఉన్న మా బామ్మకి తెలుసు. 'పీచ్మిఠా,' అరుపు దూరం అవుతున్నకొద్దీ నాలో బెంగ ఎక్కువవుతోంది. ఆ క్షణంలో బామ్మ బడి గుమ్మంలో ప్రత్యక్షమైంది.

పంతులుగారు ప్రభవ విభవలు చెప్పిస్తున్నారు. బామ్మ రాకతో ప్రమోదూత దగ్గర తక్కున వల్లింపు ఆగి తరగతి నిశ్శబ్దం అయింది. నరసింహం పంతులు గారంటే గండభేరుండం! పిల్లలూ పెద్దలూ హడిలి చచ్చేవారు. ఆయనకి బుర్ర మీసాలు, కళ్లద్దాలు, గుండూ పిలక, చేతిలో బెత్తం, నాలుగువైపులా చూడగల మిడి గుడ్లు ఉండేవి. మా బామ్మ బడి గుమ్మంలోకి వస్తూనే, "ఒరే నరసింహా నా మనవణ్ణి పంపరా," అంది. ఆయన నావైపు చూసి పోరా అనేలోగానే పలకా పుస్తకంతో నిలబడి ఉన్నాను. "ఫో..." అనడమేమిటి తొర్రలో రామచిలకలా తుర్రున దాటుకున్నాను.

అవతల వీధి చివర పీచ్మిఠా వాడు నాకోసమే నిలబడి ఉన్నాడు. అప్పటికే వాడితో బేరసారాలు పూర్తి చేసింది బామ్మ. రెండు మిఠాయి పొత్తులు, నాలుగు పుంజీల జీళ్లు ఇప్పించింది. జీళ్లు జేబులో పోసుకొని, బామ్మ కొంగు చాటు చేసుకొని మిఠాయిలు రెండూ మింగేశాను. ఆ రంగుకి నోరు ఎర్రగా హనుమంతుడి మూతిలా అయిపోయింది.

"ఈ మొహంతో ఇంటికెళ్తే ఏవన్నా ఉందీ..." అంటూ కాసేపు బజారు పెత్తనం చేయించి, బడిగంట కొట్టాక బావి దగ్గర మూతి కడిగి, కొంగుతో తుడిచి ఇంట్లో ప్రవేశపెట్టింది.

తెల్లారి పొద్దున దేవతార్చనలో ఉండే బుల్లి కంచు గంట కనిపించలేదని అమ్మ కంగారుగా వెదికేస్తోంది.

"ఎక్కడికి పోతుందీ... ఎలిక ముండలు లాక్కెళ్లి ఉంటాయి..." అని బామ్మ పట్టీపట్టనట్టు సర్దేస్తూ మాట్లాడుతోంది.

"అయినా ఎలికలు గంటనేం చేసుకుంటాయి బామ్మా," అంటే, "పిల్లికి కడతాయ్... వెధవాయ్," అని అరిచి నా నోరు నొక్కి బయటికి లాక్కెళ్లింది.

తొర్రలో దాచుకున్న నాలుగు పుంజీల జీళ్లు రెండ్రోజుల్లో పూర్తయినాయి.

మళ్లీ సంతరోజు వచ్చింది. ఇంట్లో పెద్ద గాలి దుమారం లేచింది. నాన్న అరుపుల ముందు బామ్మ ముద్దాయిలా నిలబడి ఉంది. వాకిట్లో పీచు మిఠాయిల వాడు నిలబడి ఉన్నాడు. క్రితం వారం వాడికి బామ్మ కంచుగంట ఇచ్చిందట. ఆ లెక్కలో వాడు మనకి నాలుగు మిఠాయిలు, ఆరు పుంజీల

జీళ్లు ఇంకా బాకీ ఉన్నాట్ట! అవి ఇచ్చేసి వెళ్దామని సరాసరి వాడు ఇంటికి వచ్చాడు. అదీ గొడవ. సడీ చప్పుడు చెయ్య కూడదనుకున్న గంట గణగణా బామ్మ గుండెల్లో మోగింది.

“దేవుడి గంటనే పాపభీతి కూడా లేకపోయె....” అంది అమ్మ నిష్ఠూరంగా.

“హంత పాపభీతి పడాల్సిందేముందీ... అయినా ఘంటలో ఉంటాడా దేవుడు... పసివాళ్ల బొజ్జలో ఉంటాడుగాని...” బామ్మ సాయకారం తీసింది.

“ఈ మెట్ట వేదాంతాలకేంలెండి... ఇట్లాగే వదిలేస్తే అవ్వ మనవడు కలిసి ఆ చేతి మురుగు కూడా కరిగించేసుకు తింటారు,” అంది అమ్మ నాన్నకి బోధ పడాలని.

నాన్న కలిగించుకు మాట్లాడేలోగా బామ్మ కోపంగా గొణుక్కుంటూ చరచరా వెళ్లి బాదంచెట్టు కింద కూచుంది. నేను వెనకే భయంభయంగా వెళ్లా... కొంచెం దూరంగా నిలబడ్డా.

“...నువ్వు కాదుగాని... ఛీ... నీతో నా చావు కొచ్చిందిరా. ఇన్నేళ్లొచ్చి ఆహరికి నా బతుకు దొంగ బతుకై పోయింది... ఫో అసలు నా ఛాయలకి రావద్దు... మీ అమ్మానాన్న ఉన్నారుగా... వాళ్లతోనే ఊరేగు... నాది అనుకొంటే దుఃఖం... కాదు అనుకొంటే సుఖం...” అంటూ బామ్మ బావురుమని ఏడ్చింది. కంటిధార ఎండిన బాదం ఆకుల మీద టపటపా రాలింది. పిడుగులు రాల్తున్నంత చప్పుడు నా చెవికి... దేవుడు ఏడుస్తుంటే ఎంత భయం వేస్తుంది... దిక్కు లేనివాళ్లకి? ఒక్కసారి బేర్‌మని పెద్దగా ఏడ్చాను. బామ్మ తటాలున చేతులు జాపి ఒళ్లోకి లాక్కుంది. అక్కడే చెట్టు కింద ఎండాకుల మీద బామ్మ ముడుచుకు పడుకొంది. నేను బామ్మ పక్కనే ఒదిగి దిగాలుగా కూచున్నా. బామ్మ గుర్రుపెట్టి నిద్రపోయింది. బామ్మ మీద గండుచీమలు పాకుతుంటే వాటిని దులిపేస్తూ- వెన్ను మీద చెయ్యి వేసి నా పక్కలో కూచునే బామ్మలా కూచున్నాను. కాకి రాల్చిన రెండు బాదంకాయలు గుండు మీద పడితే బామ్మ ఉలిక్కిపడి లేచింది. నాకు నవ్వొచ్చింది. సంగతి అర్థం కాగానే బామ్మ కూడా ఫక్కున నవ్వింది. ఆ నవ్వు కొండంత ధైర్యమై నన్నావరించింది.

*


దసరా రోజులు వచ్చాయి.

ఒక పెద్ద పీఠం మందీమార్బలంతో మా ఇంట్లో దిగింది. స్వాములారు, శిష్యగణం, సేవకులు, వంట లక్కలు, గున్న ఏనుగు, నాలుగు ఆవులూ, వాటి దూడలూ, జింకపిల్ల, రెండు పల్లకీలు, ఇవిగాక బోలెడు సాధన సామగ్రి నాలుగు గూడు బళ్లనిండా దిగాయి.

ఇల్లంతా ఆక్రమించుకొని సిపాయిల్లాగా వాళ్లే ఎక్కడెక్కడ ఏమేమిటి ఎట్లా అమర్చుకోవాలో చూసు కొంటున్నారు. నేను, బామ్మ పరాయివాళ్లలా చోద్యం చూస్తున్నాం.

“ఇవాళ్టి నుంచి మన కొంప సర్కస్ డేరా అనుకో,” అంది బామ్మ.

వాళ్లు మాట్లాడే భాష కూడా చిత్రంగా ఉంది. మా నాన్నని గృహస్థు అని పిలిచేవాళ్లు. సామాజికులు, పూర్ణ



దీక్షాపరులు, శిష్య పరమాణువులు, పాద రేణువులు... ఏవిటో నాకు అర్థంకాని మాటలు చాలా వినిపించేవి. అంటే ఏవిటని బామ్మని అడిగితే, ''అంతా మనుషులేరా అబ్బీ. ఉత్తినే... అదో ఆడం బరం,'' అన్నది బామ్మ.

గున్న ఏనుగుకి రోజూ బెల్లంబుట్ట, అరటిపళ్ల గెల అందించేవారు. దాని సేవకి ఇద్దరు మావటీలు. శ్రీ మావటీగారిని మంచి చేసుకొని నన్ను ఒక్కసారైనా ఏనుగు ఎక్కించాలని బామ్మ తంటాలు పడ్డది కాని వారు సాధ్యపడదన్నారు. పల్లకీపైన ఉండే శాటిన్ వస్త్రం చుట్టేసి, పల్లకీలని దేవిడీలో జాగ్రత్త చేశారు. పల్లకీ ఎక్కించమని హఠం చేస్తే, "ఆ సన్నాసి పల్లకీ మనకెందుకురా... నీ పెళ్లికి దీని జేజెమ్మలాంటి పూసలపల్లకీ పెట్టించి ఊరూ పేటా ఊరేగిస్తా..." అని బామ్మ సముదాయించింది. అందరూ నిద్దర్లు పోయాక సాములారి జింక చర్మంమీద నన్ను కాసేపు పడుకో బెట్టింది బామ్మ. బలే మెత్తగానూ, తమాషాగానూ ఉంది. జింకపిల్లతో ఆడుకోవాలనిపించేది. కాని బామ్మ దాన్ని శత్రువర్గంగా భావించి దూరంగా ఉంచేది.

మా ఇంట్లో అర్చనలు, దీక్షలూ, హోమాలూ ఘోటకంగా సాగుతున్నాయి. వచ్చేపోయే భక్తులు, బంధువులు అంతా కోలాహలంగా ఉంది.

స్వామివారు వెండిరేకులు తాపడం చేసిన సింహా సనం మీద కూచుని తావళం తిప్పుతూ ఉండేవారు. ఎప్పుడూ గంభీరంగా ఉండేవారు. ఎప్పుడేనా ఒక చిరు నవ్వు ప్రసాదించేవారు భక్తులకి. అలౌకిక విషయా ల్లోనూ, లౌకిక విషయాల్లో కూడా తల దూర్చేవారు. వంటలూ, పిండివంటలూ, కూరలూ, పులుసులూ అన్నీ ఏమేం ఎట్లా చెయ్యాలో ఆయనే చెప్పేవారు. చెప్పడం అనకూడదుట, ఆదేశించారు అనాలిట! చూట్టానికి వచ్చారనకూడదు దర్శనానికి వచ్చా రనాలిట.

"పాదాలివ్వండి స్వామీ," అని ప్రాధేయపడే వాళ్లు. వాళ్లకి ప్రాప్తం ఉంటే పాదాలిచ్చేవారు. లేని వాళ్లు పాంకోళ్లకి మొక్కి వెళ్లిపోతుండేవారు.

సాములారు భోజనం చేశాక (అపచారం భిక్ష స్వీకరించాక) వెండి గొలుసుల ఉయ్యాలబల్ల మీద బాలీసుల మీద వాలి అరమోడ్పు కన్నులతో భుక్తా యాసం తీర్చుకొనేవారు. వింజామరలు విసరడానికి మేవంటే మేవని వంతుల కోసం పోట్లాడుకొనేవాళ్లు భక్తులు.

"జార్జి చక్రవర్తిదే భోగం- మళ్లీ మీ స్వామివారిదే భోగం," అనేది శిష్యుల దగ్గర మా బామ్మ. వాళ్లు దానికెంతో గర్వపడేవాళ్లు.

సాయంత్రం ఆయన వేదాంత విషయాలు బోధించేవారు. అర్థం అయినా కాకపోయినా అంతా శ్రద్ధగా వినేవాళ్లు. అయ్యవారికి శాలువలు, అమ్మ వారికి పట్టువస్త్రాలు, పళ్లు, రొక్కం కానుకలుగా సమర్పించుకొనేవాళ్లు.

ఒకరోజు శిల్కులాల్చీ, నాలుగువేళ్లకీ ఉంగరాలు, మెడలో పతకపు గొలుసుతో ఆర్భాటంగా గుర్రబ్బండి దిగాడొక భక్తుడు. వస్తూనే స్వామివారి పాదాల మీద వాలాడు- స్వామివారు వాత్సల్యంతో వందనం స్వీకరిం చారు. జోడించిన ఉంగరాల చేతుల్ని తమ చేతుల్లోకి తీసుకొని, "ఎట్లా ఉందిరా వ్యాపారం?" అని అడిగాడు.

"అంతా తమ దయ," అన్నాడా భక్తుడు.

"రాహువు ఇల్లు మారుతున్నాడు ఇక నీకు తిరుగులేదురా. పట్టిందంతా బంగారమే," అన్నాడు స్వామి భక్తుడి చేతులు వదిలిపెడుతూ. భక్తుడి నడిమి వేలునున్న ఎర్రరాయి ఉంగరం స్వామి చేతిలోకి వచ్చింది. పక్కనే ఉన్న శిష్యుడి దోసెట్లో వేసి, "అమ్మ వారికి ముక్కెర చేయించండి," అని చిరునవ్వుతో ఆదేశించారు. ఆ భక్తుడికి వేలు ఊడినంత బాధ కలిగింది. పెదాలు తడారిపోయినాయి. బిక్కచచ్చి, "తమ చిత్తం," అన్నాడు, ఎప్పటికో తేరుకొని.

"కాదు తల్లి ఆజ్ఞ," అన్నారు స్వామి గంభీరంగా.

మనోవాక్కాయ కర్మల మీద స్వామివారు ప్రసంగం కొనసాగించారు.

బామ్మ నవ్వాపుకోలేక సభలోంచి జారుకొంది. శిష్యుడు ఎదురైతే, "మీ దేవుడికి పట్టిందంతా బంగా రమే," అని ఎగతాళి చేసింది.

లోగడ విడిది చేసినపుడు ఆయన చూపు బామ్మ

బంగారుమురుగు మీద పడిందిట. "తల్లి చిట్టికాసుల పేరు కావాలని గోల చేస్తోంది. నువ్వు చెయ్యి విదిలిస్తే తల్లి కోరిక తీరుస్తా..." అన్నారట స్వామి బామ్మతో.

"అయ్యో... ఆ తల్లికి నేనిచ్చేపాటిదాన్నా. సాక్షాత్తూ మహాలక్ష్మి. ఆమెకేం తక్కువ స్వామీ," అని బామ్మ భక్తి భావంతో సవినయంగా సమాధానం చెప్పిందిట.

"ఒరేవ్ హనుమంతుడి ముందా కుప్పిగంతులు? ఇచ్చేదాన్నయితే ఆనాడు గాంధీగారు గుమ్మంలో కొచ్చి సొరాజ్జెం కోసం జోలెపట్టిన రోజే ఇద్దును కదా... మహా మహా ఆయనకే ఇవ్వలేదు... ఈ సర్కస్ కంపెనీకి ఇస్తానా..." అంది బామ్మ.

అది తీర్థప్రసాదాల సమయం.

భక్తులంతా కాళ్లకి మొక్కి, తీర్థం పుచ్చుకొని మళ్లీ మొక్కి వెళ్తున్నారు. నేనూ వెళ్లి చెయ్యి జాపా. స్వాములారు ఉగ్రంగా గుడ్లురిమి, "ఫో అవతలికి," అని గసిరాడు. చొక్కా తొడుక్కుని మొక్కడం, తీర్థాలు తీసుకోవడం మహాపచారంట! ఇంకేముంది కొంపలు మునిగిపోయినట్టు అందరూ హాహాకారాలు చేయడం మొదలెట్టారు. ఆ సందట్లో నా లాగూ చొక్కా విప్పేసి ఒంటి మీద నూలుపోగు లేకుండా ఆయన ముందు నిలబెట్టారు. అయినా ఆయన కటాక్షించలేదు. నన్ను బయటికి పంపెయ్యమని తీర్థపుశంఖుతో సైగ చేశారు. తెలియక జరిగిన అపచారానికి మన్నింపు కోరాలని అమ్మ వెళ్లి ఆయన ముందు నిలబడితే, మరీ రెచ్చిపోయి, "ఇవాళ అమృతం ఎవరికీ ప్రాప్తంలేదు... అపచారానికి ప్రాయశ్చిత్తం..." అన్నారు కఠినంగా. శంఖు కింద పెట్టేసి తావళం అందుకొని ధ్యానంలోకి వెళ్లిపోయారు.

భక్తులు, శిష్యులు అంతా నన్ను దోషిని చూసినట్టు చూస్తున్నారు. ఇదంతా చూస్తున్న మా నాన్నలో సహనం చచ్చిపోయింది. నన్ను బయటికి బరబరా లాక్కెళ్లి, పూనకం వచ్చిన మనిషిలా చావగొట్టారు. ఒంటి మీద ఆచ్ఛాదన కూడా లేదేమో ఒళ్లంతా వాతలు తేలాయి. గుక్కపెట్టి పరుగెత్తాను. బామ్మ పరుగు పరుగున ఎదురొచ్చి రెండు చేతులా నన్నెత్తుకొని గుండెలకు పొదువుకుంది. భయం, బాధ, ఉక్రోషం, ఒంటరితనం- ఇవన్నీ ఆవరించిన నాకు మా బామ్మ వెయ్యి చేతులు నాకోసం జాపిన అమ్మవారిలా కన్పించింది. గబగబా బాదంచెట్టు కిందకి తీసుకెళ్లింది. వాతలు చూసింది. వలవలా ఏడ్చింది. ఒళ్లంతా నిమిరింది. పై కొంగు కప్పింది. "ఆ బడుద్ధాయికి నిన్ను కొట్టేందుకు చేతులెలా వచ్చాయిరా దూర్వాసపు పుటకా వాడూనూ," అంటూ నాన్నని తిట్టింది. నా ఏడుపు ఎక్కిళ్ల స్థాయికి తగ్గింది. బామ్మ మాత్రం బుసలు కొడుతోంది.

ఇంతలో స్వాములారి ఆంతరంగిక శిష్యుడు మడి ధోవతులు ఆరెయ్యడానికి పెరడువైపు వచ్చాడు.

"దీక్షితులూ ఇట్రా," అని గద్దింపుగా పిలిచింది. ఆ పిలుపుకి ఆయన ఉలిక్కిపడ్డాడు. ఆ సంబోధన... ఆ ధాటీ- దీక్షితులుగారంటే స్వాములారి తర్వాత స్వాములారంతటివాడు. పెద్దాయన అలవాట్లు, ఇష్టాయిష్టాలు, వేళావేళలు, కళాకళలూ అన్నీ తెలిసినవాడు. స్వామివారికి జలుబు చేస్తే దీక్షితులుగారికి తుమ్ములు వస్తాయి. అలాంటిది వారి సంబంధం. దీక్షితులు సంకోచిస్తూనే నాలుగడుగులు బామ్మవైపు వేశాడు.

"ఏం స్వాములారయ్యా బోడి సాములారు... పసి వెధవకి ఎలా వాతలు తేలాయో చూడు... పైన చొక్కా ఉంటేనే అంట్లవెధవ అయిపోయాడా అభం శుభం తెలీని పసిబిడ్డ... ఆ మాటకొస్తే దేహశుద్ధి లేని పుండాకోర్లు చాలామందున్నారు మీ గుంపులో... చేతనైతే వాళ్ల చర్మాలు ఒలిపించి తీర్థాలు పోయమను... ఊరిఖే బృహదారణ్యాలు భగవద్గీతలు వల్లిస్తే లాభం లేదు... మానికతో జొన్నలు కొలిస్తే బలం వస్తుందా? దంచాలి, వండాలి, తినాలి, హరాయించుకోవాలి. అప్పుడొస్తుంది బలం... ఔనా? మీ పీఠాయ్‌కి చెప్పు... నాకేం భయంలేదు... వీడి బోడి శాపం నన్నేం చేయదు..." బుసలు కొట్టే బామ్మ మాటలకి దీక్షితులు బుర్ర తిరిగిపోయింది. పిలక తడుముకొంటూ పిల్లిలా జారుకొన్నాడు. అయినా బామ్మ ఆగలేదు. "ధిక్కారమునుసైతునా అని వేమూరి గగ్గయ్యలా గుడ్లూ పీడూనూ... పిచిక మీద బ్రహ్మాస్త్రం అనీ... ఒకపక్క నుంచి ఎకరాలు హరించిపోతున్నా తెలీడంలేదు...

అరిశెల్ని, అప్పాల్ని వదల్లేనివాడు అరి షడ్వర్గాల్నేం వదుల్తాడు..." స్వాములారిని, మా నాన్నని కలగలుపుగా దీక్షితులు వెళ్లిన అరగంట దాకా బామ్మ తిడుతూనే ఉంది.

రాత్రి అమ్మ నన్ను గట్టిగా కరుచుకొని కంటి నిండా ఏడ్చింది. నూనె రాసింది. నాన్న రోజంతా అన్నం తినలేదు.

"ముందే ఉండాలి నిగ్రహం... ఉపోషం ఉంటే పిల్లాడి వాతలు పోతాయా. అంత తామసం కూడదు," అని బామ్మ మందలించింది. తలదించుకొన్నారుగాని నాన్న మారు మాట్లాడలేదు.

స్వాములారి మీద కాదు యావత్తు పీఠం మీద బామ్మ కత్తి కట్టింది. పాకశాలలో వంటవాడి మీద ధ్వాష్టీకం చేసి నాలుగు చిట్టిగారెలు కొంగులో వేసుకొచ్చి వేడివేడిగా నాచేత తినిపించింది. దీక్షితుల్ని పనిమాలా పిలిచి, "ఇదిగో మహా నివేదన కాకుండానే చిట్టిగారెలు పిల్లాడికి పెట్టా... చెప్పుకో దిక్కున్న చోట... మొక్కకి చెంబుడు నీళ్లు పొయ్యడం... పక్షికి గుప్పెడు గింజలు చల్లడం, పశువుకి నాలుగు పరకలు వెయ్యడం, ఆకొన్న వాడికి పట్టెడన్నం పెట్టడం ఇదే నాకు తెలిసిన బ్రహ్మ సూత్రం..." సవాలు చేసింది బామ్మ. పాపం దీక్షితులుకి బామ్మంటే సింహస్వప్నమయింది. ఎప్పుడు పిలిపిస్తుందో తెలీదు, ఏం తిడుతుందో తెలీదు.

రెండోరోజు సాయంత్రం వేదాంతసభలో నన్ను పిలిచి ఒళ్లో కూచోబెట్టుకొన్నారు స్వామివారు. జామ పండు ఇచ్చి, "మొత్తం తినాల్రా," అని తినిపించారు. నాకు పులి మీద కూచున్నట్టుంది. రుద్రాక్షలు గుచ్చుకొంటున్నాయి. అయినా ఎటూ కదలడానికి లేదు. తర్వాత మరికాస్త ముద్దుచేసి వారి పాంకోళ్లు తొడిగించి నడవమన్నారు. నేను తకాతకా చప్పుడు చేస్తూ సభలో తప్పటడుగులు వేస్తుంటే, "ఏవమ్మో నీ మనవడు బాలకృష్ణుడు..." అన్నారు స్వాములారు పెద్దగా నవ్వుతూ. శిష్యులంతా ఆమోదిస్తున్నట్టు ముఖాలు వికసింప జేశారు.

"అంతా తమరి వాత్సల్యం... పసివాడి అదృష్టం," అంది బామ్మ. ఈ సంఘటన తర్వాత దీక్షితులు సుఖంగా ఊపిరి పీల్చుకున్నాడు.

ఆ పీఠం మరోచోటికి తరలింది.

బామ్మ మేలుకొలుపులు పాడుతూనే ఉంది.

ముగ్గులు వేస్తూనే ఉంది. కాని నా చిన్నతనం బామ్మ వీపు నుంచి జారిపోయింది. నా కంచం నాదే-నా మంచం నాదే. హైస్కూలు చదువులో పడ్డాను. ఇప్పటికే ఆలస్యం అయిపోయిందనీ, నాకు వడక పోగు వెయ్యాలనీ నిర్ణయించారు.

వారం ముందుగానే సందడి ప్రారంభమైంది. గురు పరంపరతోబాటు బంధుమిత్రులతో ఇల్లు నిండింది. మా అత్తయ్యా, మామయ్యా, వాళ్లమ్మాయి కల్యాణి వచ్చారు. కల్యాణికి పదేళ్లుంటాయి. ప్రతి ఇంట్లోలాగే మేనత్త కూతురు కాబట్టి, 'నీ పెళ్లాం వచ్చిందిరోయ్,' అని పాత సరసం ఆడారంతా.

అత్తయ్య వస్తూనే బామ్మని చూసి, "ఏమిటే అమ్మా అంతగా చిక్కిపోయావ్..." అని బాధ నటించింది.

"నేను చిక్కేదాన్ని కాదులేవే ఎవరికీ. నువ్వు బాధపడకు," అంది వ్యంగ్యంగా బామ్మ.

"చూడు... ఆ చేతులు పుల్లల్లాగా అయిపోయాయ్... బావిలో చేద వేసినపుడు ఆ మురుగు జారి నూతిలో పడ్తుందేమో చూసుకో..." సలహాగా అత్తయ్య అంటే-

"నువ్వు వెయ్యి చెప్పు లక్ష చెప్పు... చచ్చినా నా చేతి మురుగు నీకివ్వను..." తెగేసినట్టు అన్నది బామ్మ.

అత్తయ్య కస్సున లేచింది ఆ మాటకి.

"అంటే నీ ముష్టి మురుగు కోసం పడి ఛస్తున్నానా..."

"ముష్టిది కాదది బంగారపుది- సువ్వీ అంటే రోకలి పోటని తెలుసులేవే..." అంది బామ్మ.

"ఒక్కగానొక్క ఆడపిల్లని... కన్నకూతుర్ని... దయా పేక్షలు లేవు. మీ పెట్టుపోతలకి మేం ఎప్పుడైనా ఏడ్చామా..." అని గద్గదస్వరంతో అత్తయ్య విజృంభించింది.

తల్లీకూతుళ్ల వాదులాట విని అమ్మ లోపల్లోపల ఆనందపడ్డది. మాటామాటా మరీ పెరక్కుండా నాన్న సర్దుబాటు చేశారు.

నా చెవిలో నాన్న బ్రహ్మోపదేశం చేశారు.

మెడలో జందెపుపోగు, చెవులకి బంగారు పోగులు నాకు కొత్త అలంకారాలైనాయి.

*

బాదంచెట్టు పండుటాకులు రాలుస్తూ కొత్త ఆకులు తొడుగుతోంది. తొర్రలో పాత చిలకలు ఎగిరిపోయి కొత్త చిలకలు వచ్చి వాల్తున్నాయి. బామ్మకి అరణంగా ఇచ్చిన ఆవుదూడకి అయిదోకారు దూడ పుట్టింది.

కంటిచూపు తగ్గినా బాగా చెయ్యి తిరిగిన బామ్మ ముగ్గులు గడి తప్పకుండా వేస్తూనే ఉంది.

పీఠాధిపతుల తాకిడీ తగ్గింది. తాతలనాటి క్షేత్రాలు తరిగిపోయాయి. అంటు మామిడితోట గృహస్థు పేరు మీద లేదిప్పుడు. దేవిడీకి గోడలు తప్ప పై పెంకులు లేవు. ఒంట్లో ఓపిక తగ్గినా బామ్మ మాట చురుకు తగ్గలేదు.

"మా ఉయ్యాల వెండిగొలుసుల్ని గున్న ఏనుగు మింగేసింది," అని చాలా సరసంగా చెప్పి నవ్వేది.

అమ్మకి అకాల వార్థక్యం వచ్చింది. తడి చీరెల శిక్ష తప్పింది. నాన్న నిర్లిప్తంగా ఉంటున్నారు. అప్పటి వైభవంలేదు. అట్లాగని దరిద్రమూ లేదు. నాకు తెలిసిన వైభవం బామ్మ- బాదంచెట్టూ. అవి ఇప్పుడూ ఉన్నాయి.


'నాది అనుకొంటే దుఃఖం, కాదు అనుకొంటే సుఖం,' బామ్మ చెప్పిన బ్రహ్మసూత్రం నిజమే అన్పించింది.

*

నా ఎఫ్.ఎ. పూర్తయింది. బందరులో సర్కారు ఉద్యోగం వచ్చింది.

అయినవీ కానివీ పెళ్లి సంబంధాలు రావడం మొదలైంది. మేనత్త కూతురు కల్యాణి ప్రస్తావన వచ్చింది. కానీ బామ్మ ససేమిరా వద్దంది.

"ఆ పిల్ల పేరుకి కల్యాణే కాని ఉత్త నత్తగవ్వ. దాని తల్లి గడుసు దయ్యం. దాంతో నువ్వు సుఖపడలేవ్. పరాయి సంబంధమే చేసుకొందాం," అని బామ్మ స్పష్టంగా చెప్పింది. అత్తయ్యావాళ్లు కూడా నా కాళ్లు కడిగి పిల్లనివ్వడానికీ, పుట్టింటి బంధం నిలిచిపోవాలనీ ఏ మాత్రం ఆరాటపడలేదు. వాళ్లకీ ఒక్కతే పిల్ల. కావలసినంత ఉన్నవాళ్లు. మాకిప్పుడు ఈనాములూ లేవు, నేను బారిస్టర్నీ కాదు.




చూసిన రెండు మూడు సంబంధాల్లో- చిన్నప్పుడు చదువు చెప్పిన నరసింహం పంతులుగారి ద్వారా వచ్చిన సంబంధం నచ్చింది. బామ్మకి మరీ మరీ నచ్చింది. తాంబూలాల దాకా వచ్చాక నాలుగు కాసుల బంగారం దగ్గర తేడా వచ్చింది. అటూ ఇటూ నరసింహం గారు మాటలు నడిపారు గాని చివరికది చిలికి చిలికి గాలివాన అయింది. పెద్దవాళ్ల మధ్య సొమ్ము కంటే పంతాలు అడ్డొచ్చాయి.

"పిల్ల పొందిగ్గా ఉందిరా... పచ్చగా దొరసానిలా ఉంది... కళ్లు కజ్జికాయల్లా ఉన్నాయి... నాలుగు

కాసుల బంగారం ఒక్క ముద్దుకి చెల్లు..." అంటూ బామ్మ తెగ ఊరించడం మొదలుపెట్టింది.

లోపల పంతం పెట్టుకొని పైకి మాత్రం, 'వాడిష్టం,' అని నాలిక చివరిమాట అంటున్నారు అమ్మా నాన్న.

నేను ఎటూ తేల్చుకోలేని స్థితిలో పడ్డాను.

బాదంచెట్టు కింద ఒంటరిగా కూచోబెట్టి బామ్మ హితోపదేశం మొదలుపెట్టింది.

"పిల్ల పేరు గాయిత్రి..."

"అయితే..."

"రోజూ పదిసార్లు పిలిచినా చాలు పుణ్యం పురుషార్థం... పదిమందిలో పుట్టి పెరిగిన పిల్ల..."

"అయితే..."

"కష్టసుఖాలు తెలుస్తాయి... అరటిదూట కూర ఆవపెట్టి కమ్మగా వండుతుందిట... పెద్దపెద్ద ముగ్గులు వేస్తుందిట..."

"అయితే..."

"ఒరే కోర్నాసీ దూటకూరకీ, ముగ్గులకీ బోలెడు ఓర్పూ, ఓపికా కావాల్రా- పనితనమూ ఉండాలి... పిల్లకి రుక్మిణీ కల్యాణం కంఠతా వచ్చుట- టీకా తాత్పర్యంతో సహా."

"అయితే..."

"అయితేనా? ఇష్టమైన వాడికోసం ఏదైనా చేసే జాణతనం ఉందని... నువ్విట్టాగే మీనమేషాలు లెక్కిస్తూ కూచుంటే ఆ పిల్లే నిన్ను లేవదీసుకుపోతుంది. సరేనా..." అంది నాకు రోషం తెప్పించాలని.

అయినా నేనేమీ చలించలేదు. మర్నాడు ప్రయాణం రోజు వెళ్లబోతూ నాన్న ముందు మౌనంగా నిలబడి మాట్లాడ్డానికి తటపటాయిస్తుంటే, ఆయనే అందుకొని, "నీ ఇష్టంరా. నేనేం నిధినిక్షేపాలిచ్చానని నీమీద పెత్తనం చెలాయిస్తాను. నువ్వు అన్నివిధాలా స్వతంత్రుడివి... నీకు ఇష్టమైతే మాదేవుంది... వచ్చి పీటల మీద కూచుంటాం..." అన్నారు.

విషయం తేలిపోయింది.

రకరకాల ఆలోచనలతో రాత్రంతా నిద్ర పట్టలేదు. బామ్మ ఒక రాత్రివేళ చీకట్లో తడుముకొంటూ నా గదిలోకి వచ్చింది. నా మంచం మీద కూచుంది. మెల్లగా లేపాలని తడుముతోంది. "లేచే ఉన్నాలే చెప్పు..." అన్నాను.

"నువ్వు నిద్రపోవని తెలిసే వచ్చాన్రా... చూడబ్బాయ్ మీ నాన్నకి ఆవేశం ఎక్కువ, ఆలోచన తక్కువ... మీ అమ్మకి మొగుడు చెప్పిందే వేదం. ఈ కోపతాపాలు నాల్రోజులుంటాయ్ ఆనక పోతాయ్... మిగిలేది నిక్షేపంలాంటి పిల్ల... అంచేత నిష్కర్షగా గాయిత్రినే చేసుకొంటానని తేల్చి మరీ వెళ్లు..."

నేను ఏమీ చెప్పకుండా అటు తిరిగి పడుకొన్నాను.

"ఒరేవ్ అధిక మాసాలతో ఎనభై దాటేశా... నీ పెళ్లి చూడాలని ప్రాణం ఉగ్గబట్టుక్కూచున్నా... ఆ పిల్ల గోరింటాకుతో పారాణి పెట్టుకొంటే నీ కాళ్లు పండాలి. నువ్వు ఆకువక్క వేసుకొంటే అమ్మడు నోరు పండాలి. అదీ ఇదీ అయి ఆనక మీ కడుపు పండాలి. నేను మళ్లీ నీ ఇంటికి రావద్దూ..." బామ్మ గొంతు జీరబోయింది. కన్నీటిచుక్క నా గుండెమీద పెద్దగా రాలింది.

*

ఉద్యోగం ఊరు చేరగానే గాయిత్రి సంబంధమే ఖాయం చేయమని నాన్నకి మూడుముక్కల ఉత్తరం రాశా. పోస్టు చేయకుండానే, 'ముహూర్తం నిశ్చయమైంది... ఉన్న పళంగా పదిహేను రోజులు సెలవు పెట్టి రమ్మ'ని టెలిగ్రాం వచ్చింది.

ఇంట్లో అడుగు పెడుతుండగానే బామ్మ ఎదురొచ్చి, "దిగివచ్చార్రోయ్... నీలాంటి అల్లుణ్ణి వదులుకుంటారా... ఏదో కాస్త బెట్టు చేశారు... పాపం వాళ్లదీ పెద్ద కుటుంబం- నాలుక్కాసులు ఒక్క ముద్దుకి చెల్లురా అంటే నువ్వా విన్నావు కాదు... చివరికి మన నరసింహం సానుకూలం చేశాడు," అని తెగ సంబరపడిపోతూ చెప్పింది.

నాన్న, అమ్మ దిగిరాకుండా మాట నెగ్గించుకున్నందుకు విజయగర్వంతో ఉన్నారు. ఎవరినీ నొప్పించకుండా కోరిన పిల్ల దొరికినందుకు, 'థాంక్ గాడ్,' అనుకున్నాను. అది మా దొరవారి ఊతపదం.

*

కలతలూ, కలహాలూ లేకుండా పెళ్లి అయిపోయింది. ఒళ్లంతా కళ్లు చేసుకొని బామ్మ మా పెళ్లి చూసి ఆనందించింది. "ఒరేవ్ ఎప్పుడో నీ చిన్నప్పుడు స్వాములారి పల్లకీ ఎక్కించమని హఠం చేశావ్ జ్ఞాపకం ఉందీ? ఇహ ఊరేగు. బతుకంతా సుఖంగా అందరి కళ్లూ మీమీదే ఉండేట్టు ఊరేగండి," అని బామ్మ మా జంటని దీవించింది.

అక్కర తీరింది.

మర్నాడు, "నా మనవడు నచ్చాడా పిల్లా," అని బామ్మ కొంటెగా అడిగితే, ఔను కాదు అనకుండా, "మీ మనవడు నాకిప్పుడు మూడొందల అరవై కాసులు బాకీ- ఎట్లా తీరుస్తారో ఏమో..." అందిట బుంగమూతి పెట్టి పెళ్లికూతురు.

ఆ మాటకి అదిరిపడి, "హాసి పిడుగా," అని బామ్మ గాయిత్రిని ముద్దు పెట్టుకొంది.

*

బందరులో కాపరం పెట్టాం. బామ్మ మాటలో చెప్పాలంటే ముగ్గులోకి దిగాం. ఒంటి గది- కొత్త కాపురం- బామ్మ దీవెనలా పూసలపల్లకీలో ఊరేగుతున్నట్టుంది.

ఆవిడ కాళ్ల గోరింటాకు అతడి కాళ్లకి ఎట్లా పండుతుందో అనుభవమైంది.

నేను తాంబూలం నమిల్తే గాయిత్రి నోరు ఎందుకెరుపెక్కేదో ఎరుకైంది.

బామ్మని బందరు వచ్చి నా దగ్గర ఉండమన్నాను.

"నా ఊరు నా నేల... ఇక్కడే మట్టయిపోవాలిరా... మీ అమ్మ దొడ్డ ఇల్లాలు... నాకేం తక్కువ జరగదులే," అంది దర్జాగా.

బామ్మ చివరిక్షణాల్లో చూడ్డానికి వెళ్లాం. మాట స్పష్టత లేదు. "కొత్త కాపరం బావుందా," అని అడిగింది. ఇద్దరం తల ఊపాం.

"కాపరం, కత్తిపీట కొత్తల్లో కంటే కొంచెం పదును పడ్డాకే బావుంటాయిరా..." అంది మాట పెగుల్చుకొని. మేం నవ్వితే బామ్మ పెదవి కదిలింది. ముఖం వెలిగింది. మా ఇద్దరి చేతులూ చేతిలోకి తీసుకొంది. "ఒక మొక్కకి చెంబెడు నీళ్లు... గింజలు... అన్నం పెట్టా... ఆ ఫలం నాకు దక్కింది. నా బతుకు హాయిగా వెళ్లిపోయింది... నేను ఇపుడో... కాసేపో..." బామ్మ మాటలకి నాకు దుఃఖం పొర్లుకొచ్చింది.

"నిన్ను వదిలి ఎక్కడికి పోతా(న్రా వె(ర్రినాగన్నా... అలా వెళ్లి కాసేపు పెత్తనం చేసి మళ్లీ నీ ఇంటికే వస్తాగా..." అంటూ ధైర్యం చెప్పి బామ్మ వెళ్లిపోయింది.

భరించలేనంత శూన్యం నాలో నిండుకుంది. అమ్మానాన్న చుట్టంపక్కం దయ దేవుడూ అన్నీ, అంతా, అందరూ ఒక్కసారి వదిలి వెళ్లిపోయినట్టయింది.

వెళ్లి పిచ్చిగా బాదంచెట్టు చుట్టూ తిరిగాను. డెబ్భై ఏళ్ల ఆ పిచ్చిమొద్దుకి బామ్మ పోయిందని తెలియదు. రేపట్నించి చెంబెడు నీళ్లెవరు పోస్తారు? పై తొ(ర్రలో కిలకిలలాడే చిలకలకి తెలియదు బామ్మ పోయిందని- రేపట్నించి గుప్పెడు గింజలు ఎవరు జల్లుతారు? చిన్నప్పుడు చిరుతిళ్లు దాచుకొన్న తొ(ర్రలో చెయ్యిపెట్టి వెదికాను. దాన్నిండా బాదంకాయలు దాచి ఉన్నాయి. రేపట్నించి రాలిన బాదంకాయలు ఎవరు ఏరతారు?

బాదంచెట్టుని చుట్టుకున్న బామ్మ జ్ఞాపకాలు ఎన్నేళ్లయినా మర్చిపోలేను. ఆ చెట్టు నీడలో నా చిన్నతనం చెక్కు చెదరకుండా ఉంది.

*

కర్మకాండ ముగిసింది. బామ్మ ఆరో ప్రాణంగా చూసుకొన్న బంగారుమురుగు తూకానికి పెడితే అది గిల్టునగ అని తేలింది. అమ్మానాన్న, అత్తయ్య అంతా మొహామొహాలు చూసుకొన్నారు.

మనవడికి మంచి పెళ్లాం రావాలని బంగారు మురుగు కరిగించిందని వాళ్లకి తెలియదు. పెళ్లిపెద్దగా కథ నడిపించిన నరసింహం పంతులుగారు చెప్పేదాకా నాకూ తెలియదు.


బామ్మ మా ఇంటికి వస్తుంది- అన్నమాట ప్రకారం ఆవిడ బంగారుమురుగు ఆవిడకే... గాయిత్రి సాక్షిగా.

*ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక*
*9 సెప్టెంబర్ 1993*

❖ సాయిబ్రహ్మానందం గొర్తి



# రమ్మీ - పక్కన్నేను



దాదాపు ఏభయ్యేళ్ల పైమాటే! బాపట్ల కాలేజీలో మొట్టమొదటసారి చూసాను రమ్మీని.

ఏటా మా కాలేజీలో వ్యాసరచన పోటీలు, వక్తృత్వ పోటీలు జరిపేవారు. దాదాపు మూడేళ్లుగా ఈ పోటీల్లో నేనే తోపుని. ఆ ఏడు వ్యాసరచన పోటీలో ఖంగుతిన్నాను. నేనే ఎప్పుడూ ఫస్టని కాలర్ ఎగరేసే కున్న నాకు చొక్కా చింపేసినట్లయ్యింది. ఎవరో ఇంటర్ ఫస్టియర్ కుర్రాడట, ఆబగా నాకు దక్కాల్సిన ప్రైజులు  కొట్టేసాడు. వక్తృత్వ పోటీల్లో కూడా లాగు తడిపించినా, ఫస్ట్ ప్రైజ్ మేనేజ్ చేసి పరువు దక్కించు కున్నాను.

"ఏవూరు మనది..?" గొంతులో కోపాన్ని దిగ మింగుకుంటూ అడగ్గానే ఈ బడుద్ధాయి బాపట్లకి కొత్తని అర్థమయ్యింది. బక్కగా పీలగా ఉన్నా, కళ్లల్లో స్పార్క్ కనిపించింది.

పేరేమిటని అడిగితే, 'రమణ,' అన్నాడు.

నాకు తెల్సి తెలుగువారికి ఒకేఒక రమణ- ముళ్లపూడి వెంకటరమణ. ఆయనకి డ్యూప్లా వీడెవడ్రా అనుకున్నాను.

కథలూ, కాలామ్స్ గట్రా రాస్తానని అన్నాడు.

ఏదీ ఒకటిచ్చుకొట్టు అనగానే చూపించాడు.

పిట్ట కొంచెం, రాత ఘనం అని అర్థమయ్యింది.

బానే రాసావని భుజం తట్టాను.

మాటల్లో మాయజాలం గుర్తించాను. రాతల్లో రాకెట్లు రా గుండెల్లో దూసుకెళ్లినట్లయ్యింది.

ఆల్రెడీ ఒక రమణ సినిమాల్లో రుమాలేసు కున్నాడు అంటే- ఏం ఇద్దరుండకూడదా? ఎందుకుండ కూడదూ? అన్నాడు. నిక్షేపంగా ఉండచ్చు అన్నాను.

లోలోపల నా సీటుకి బొక్క పడుతోందని గుబులు పుట్టినా, స్నేహం రంగు పెదాలకి పూసుకొని స్నేహ హస్తం చాచాను.

రమ్మీకి పేకాట నేర్పాను. వ్యసనాల దగ్గర స్నేహాలు బాగా కలుస్తాయంటారు.

నిక్కరు నుండి ప్యాంటుకి ప్రమోషన్ కొట్టిన రమణ కాస్తా నాకు రమ్మీ అయ్యాడు. రమ్మీ తక్కువేం తినలేదు- నన్ను స్టాలిన్ అన్నాడు.

ఎవడా స్టాలిన్ అని బుర్ర చించుకుంటే రమ్మీనే చివరకి చెప్పాడు- సోవియట్ రాజ్యాన్ని నలభయ్యేళ్లు ఎడాపెడా వాయించిన మహామనిషని. జీకే ఓ రేంజిలో వుందని అర్థమయ్యింది.

స్టాలిన్ పేరు నచ్చేసింది. అంతే నా పేరు చివర్న స్టాలిన్ తగిలించుకున్నాను. అలా రమ్మీ నాకు స్టాలిన్ నామకరణం చేసాడు. రమ్మీ కంటే అన్ని విధాల పెద్దైన నేను బి.ఏ పూర్తిచేసి ఉద్యోగంలో చేరాను. మా స్నేహం ఉత్తరాలతో దద్దరిల్లిపోయింది.

రమ్మీ వాళ్ల పోస్ట్‌మ్యాన్ నేను రాసిన ఉత్తరాలు మోయలేక చస్తున్నాడనీ, చందాలేసుకుని లారీ కొనివ్వ మని గోల పెడుతున్నాడనీ అన్నాడు. అలాగేనని అప్పుడు ప్రామిస్ చేసాను. నేను రమ్మీకి తీర్చని ప్రామిస్సులలో ఇదొకటి.

*


రమ్మీ చేవాటుతనం- అదే రచనలు చూసి ఖంగుతున్నాను. ఇంతై వటుడింతై అన్నట్లు రోజు రోజుకీ రాతలు బాకుల్లా గుచ్చుకుంటున్నాయి.

అడపాదడపా కథలూ రాయడం చూసి, నీ మాటల్లో వెటకారం, వ్యంగ్యం సూపరున్నాయి; అవి నీ రాతల్లో చూపించమని రమ్మీకి 'అక్షరోపదేశం' చేసాను.

అలా తెలుగు సాహిత్యంలో అడ్డూ ఆపూ లేకుండా 'పెన్నుసాచి'లా పాఠకుల్ని కుమ్మేసాడు. హాస్యం, వ్యంగ్యం ఒకటేమిటి ఎడాపెడా రాసి పడేసాడు.

చదువులు పూర్తైనా తరచు ఉత్తరాలు రాసుకునేవాళ్లం. వారనికి కనీసం అయిదు ఉత్తరాలైనా రాయాలని నా నుండి ప్రామిస్ తీసుకున్నాడు. నా ఉత్తరాలే తన రచనల్కి ప్రేరణంటూ ప్రాధేయపడ్డాడు.

ఓసారి ఇద్దరం హైద్రాబాదులో కలిసినప్పుడు మాటల్లో మా అమ్మ నా దగ్గర, నాన్నేమో మా తమ్ముడి దగ్గర ఉంటున్నారని చెప్పాను. రమ్మీ చలించి పోయాడు. రెండు ప్రేమపక్షుల్ని విడదీసారని విలవిల లాడాడు. ఆలుమగలు అన్యోన్యంగా ఒకరికొకరు తోడుండాలని పడి పడి మరీ ఏడ్చాడు. అతని వేదన చూసి అదే సబ్జెక్ట్ మీద కథ రాయమన్నాను.



అలా మిథునం పుట్టింది.

మామూలు రమణ కాస్తా 'మిథునం' రమణ అయిపోయాడు. యావత్తు ఆంధ్రదేశం రమ్మీకి నీరాజనం పట్టింది.

'గురువుగారూ ఇదంతా మీ చలవే!'నని రమ్మీ నా పాదాలు పట్టుకొని పొర్లేవాడు. పొగడ్తలంటే నాకు ఎలర్జీ. అయినా అభిమానానికి కట్టు బానిసని నేను. కాదనలేకపోయేవాణ్ణి.

*

తను పత్రికల్లో బిజీ, నేనూ రాజకీయల్లో బిజీ. పీవీకి, వాజ్‌పేయికి సలహాలివ్వడంలో క్షణం తీరిక లేక పోవడం వలన రమ్మీకి, నాకు మధ్య గ్యాప్ వచ్చింది.

పీవీ, వాజ్‌పేయివంటి నాయకులు నాకు ఊపిరి సలపనిచ్చేవారు కాదు. వారికి దిశానిర్దేశకత్వం చెయ్యడంలో క్షణం తీరిక లేకపోవడం వలన రమ్మీకి, నాకు మధ్య గ్యాప్ వచ్చింది. ఎక్కే ఫ్లైటూ, దిగే ఫ్లైటూ. దేశం కోసం ఇవి తప్పవని భరించేవాణ్ణి.

తన కథల పుస్తకానికి ముందుమాట రాయమని కాళ్లా వేళ్లా ప్రాధేయపడేవాడు.

రమ్మీ - నీ రచనే నీకు కిరీటం. మాలాంటి వారి ముందుమాటలు, చాలా బరువు రమ్మీ అనేవాణ్ణి.

గురువుగారూ మీరే నా రచనలకి బలం; మీరు ఉత్తరాలు రాయండి, అవే నాకు ప్రేరణా, ప్రాణమూ అనేవాడు. అతని పిచ్చిప్రేమకి నేను దాసుణ్ణైపోయాను.

రమ్మీలో నేనొక మహా రచయితని చూస్తే, నాలో ఓ పెద్ద మహా నాయకుణ్ణి చూసాడతను.

ఓసారి కరుణానిధి పిలిస్తే అనుకోకుండా మద్రాసు వెళ్లాను. అక్కడే ఒక సినిమా ఫంక్షన్లో

దర్శకులు బాపు కనిపించారు. ఈమధ్య సినిమాలు తగ్గాయేమిటంటే, 'ఏం లేదండీ... తెలుగులో మంచి కథలు రాసేవాళ్లు కరువయ్యారు; సబ్జెక్టున్నా, ఫీల్ ఉండడం లేదని వాపోయారు. మంచి కథలు రావడం లేదు,' అన్నారు.

రమణని అడగమంటారా అన్నాను. అయోమయంగా నా మొహంలోకి చూసారు బాపూ. అప్పుడర్థమయ్యింది, ఆయనకీ ఓ రమణ వున్నాడు కదాని.

నాలిక్కరుచుకుని మా రమ్మీ్మ గురించి చెప్పాను. క్షణం ఆలస్యం చెయ్యకుండా హుటాహుటిన రమ్మీ్మ 'మిథునం' కథాపుస్తకం ఇచ్చాను.

కథ చదివి బాపూ కరిగిపోయాడు. మీ కన్నీటిని సిరాగా మార్చి రాయమని చెప్పగానే, మొత్తం మిథునం కథని 'కస్తూరీ తిలకం' అనే శీర్షిక పెట్టి రాసాడు.

"మీ గీతే కాదు, రాత కూడా సూపరు మాస్టారూ. ఒక చిన్న సలహా! కస్తూరీ పదం బదులు దస్తూరీ తిలకం, అంటే మరింత గొప్పగా ఉంటుంది కదా," అంటే, బాపు ఎగిరి గంతేసారు.

"ఇంత గొప్ప ఆలోచన్లు చటుక్కున ఎలా తడతాయండీ? యూ ఆర్ సింప్లీ గ్రేట్!" అంటూ నన్ను కౌగలించుకున్నారు బాపూ.

ఆ తరువాత ఎక్కడ కనిపించినా, దస్తూరీ తిలకం, ఆలోచన గొప్పదని బాపూ నన్ను మెచ్చుకోని క్షణం ఉండదు. వద్దని అన్నా వినిపించుకోరు. 'అంత మోడెస్టీ పనికి రాదండీ', అంటూ ఇబ్బంది పెట్టేస్తారు.

అలా 'దస్తూరీ తిలకం' రమ్మీ్మకి చేరింది.

"నీ రుణం ఎలా తీరుచుకోగలను?" అంటూ రమ్మీ్మ ఏడుస్తూ నా కాళ్ల మీద పడ్డాడు. ఇలాంటివి మొహమాటంగా అనిపించినా, రమ్మీ్మ ఆనందంకోసం సరేననేవాణ్ణి.

*

కాలక్రమేణా రమ్మీ్మ రచనలకి పాచుర్యం వచ్చినా పెద్ద అవార్డులేమీ రాలేదని గ్రహించాను.

హుటాహుటిన 'నారిగాణ్ణి' కలుద్దామని ఢిల్లీ వెళ్లాను. అందరికీ ప్రధాని పి.వి అయితే నాకు మాత్రం నారిగాడు.

మా అత్తా వాళ్లది కరీంనగర్. మా బావా నారిగాడు క్లాస్‌మేట్లు. నారిగాడికి గోటింబిళ్ల ఆడడం నేనే నేర్పాను. అప్పట్నుండి వాడికి నేనటే ఎనలేని ప్రేమా, భక్తీ... అదే ఇప్పటికీ వుంది.

నువ్వు ఎప్పటికైనా ప్రధాని అవుతావని చెప్పాను నారిగాడికి. అదే జరిగింది. అప్పట్నుంచీ నారిగాడు నా మాట జవదాటడు. అస్తమానూ ఢిల్లీ రమ్మనమని ఫోన్ చేసి చంపేసేవాడు.

నా సలహా తీసుకుంటేకానీ తను ఒక్కడుగు ముందుకు వెయ్యలేనని అంటాడు. ఏం మోడెస్టీ...? ఎంత వినమ్రత? ఎంత అభిమానం, ఆప్యాయతా...?

వయసులో చిన్న వాళ్లక్కూడా గౌరవం ఇవ్వడం ఆ పెద్దమనిషి దగ్గరే ప్రత్యక్షంగా చూసాను.

పి.వి చేబట్టిన ఆర్థిక సంస్కరణలు నా ఆలోచనే. సంక్షోభం నుండి దేశాన్ని కాపాడాలంటే సంస్కరణలు తప్ప మరో దారి లేదని చెప్పాను. తెలివైనవాడు కనుక చెప్పినట్లు విన్నాడు. మీరూ, మీ సలహాలూ లేకపోతే దేశం ఏమై పోతుందని కళ్లనీళ్ల పర్యంతం అయ్యేవాడు.

ఇవన్నీ నాకు మామూలే! ఏం చేస్తాం?

దేశ ప్రగతికి ఉడతాభక్తిగా నేను చెయ్యి కలిపానన్న తృప్తి మాత్రం ఇప్పటికీ వుంది.

దేవుడు కొంతమందికి దేశాన్ని పాలించే కర్రా, నాలాంటి వారికి బుర్రా ఇచ్చాడు- అని మనసులో నవ్వుకునేవాణ్ణి.

రమ్మీ్మకి పద్మశ్రీ కానీ, కనీసం జ్ఞానపీఠ్ అయినా ఇవ్వాలని చెప్పాను. నారిగాడు నా మాట జవదాటడు. కానీ తరువాత నారిగాడి పదవి పోయింది; వెరశి రమ్మీ్మకి జ్ఞానపీఠ్ జారిపోయింది. పద్మశ్రీ పారిపోయింది.

ఆ తరువాత కనీసం సాహిత్య అకాడమీ అయినా ప్రయత్నిద్దామనుకున్నాను. ఇప్పటికే రుమాలేసుకున్న జనాభా కొల్లేటి చాంతాడంత వుందనీ, రమ్మీ్మ

కేవలం హాస్య రచయితనీ, ఇస్తే గిస్తే సీరియస్ వాటికి ఇస్తారనీ, ప్రతీ రచయితా వీర లాబీయింగనీ బుర్ర తినేసారు.

ఇలా రకరకాల సోది విని విని విసుగొచ్చింది. ఇది కూడా ఒహ పట్టుపరిశ్రమని అర్థమయ్యింది, కాస్త లేటుగా.

ఎందుకండీ తెలుగువారికి ఇంత అవార్డుల పిచ్చి? అని నోరు జారి ఒకాయన్ని అడిగితే, మేం రాసింది చదివినా చదవకపోయినా, అవార్డు రాగానే ప్రతీ వాళ్లు పిలుస్తారు; సన్మానాలూ గట్రా చేస్తారు. రచయితలకి సాహిత్య అకాడమీ అవార్డు ఒక రిటైర్మెంట్ అనుకోండి- అన్నాడొక చిరకాల అవార్డుల ఆశాజీవి.

వెంటనే తల క్రిందికి దించాను. ఆయన అరిగిపోయిన చెప్పులు చూడగానే అర్థమయ్యింది పరిస్థితి.

పాఠకుల మెచ్చుకోళ్లని మించిన అవార్డులేముంటాయని నవ్వుతూ సర్దుకుపోయాడు రమ్మీ్మ ఫక్తు మధ్యతరగతి తెలుగు రచయితలా!

తెలుగువారు పీతల్లాంటివారని, పైకెగరకుండానే పాతేస్తారని నాకు తెలుసు. రమ్మీ్మకివేమీ పట్టవు. లౌల్యాలూ, లౌక్యాలూ అస్సల్లేవు. పట్టు పరిశ్రమా, పాదాభివందనాలూ లేవు. కనీసం తాను రాసినవైనా చెప్పుకోడు- ఒట్టి సత్తెకాలపు మనిషి.

*

ఓసారి ఢిల్లీ నుండి తిరువనంతపురం వెళ్లాల్సి వచ్చింది. ఆ ప్రయాణంలో నా పక్క సీట్లో జుత్తు బాగా నెరిసినాయన- పేరు వాసుదేవ నాయర్ అని ఓ పెద్దమనిషి తగిలాడు. మాటల్లో తెలిసింది ఆయన మళయాళ సినిమా డైరక్టరని.

కేవలం మానవ సంబంధాల మీదే సినిమాలు తీస్తానని అంటే- వేంటనే నాకు రమ్మీ్మ గుర్తుకొచ్చాడు. మదిలో తళుక్కున మిథునం మెరిసింది.

అంతే ఆయనకి కథ చెప్పాను. బ్రిలియంట్ అంటూ ఆయన గట్టిగా అరుస్తూ తప్పట్లు కొట్టాడు.

ఎయిర్ హోస్టెస్ కంగారుపడింది; తోటి ప్రయాణీకులు అదిరిపడ్డారు.

వెంటనే తేరుకున్నాడా పెద్దాయన.

మిథునం కథ ఆయనకి పిచ్చపిచ్చగా నచ్చేసింది.

రెండ్రోజుల్లో ఆ కథని ఇంగ్లీషులోకి అనువాదం చేసి పంపాను. అది చదివి ఈ కథ ఇంగ్లీషులో రాసారా అంటే- కాదని, నేనే అనువాదం చేసానని చెబితే నా అనువాదాన్ని మెచ్చుకున్నాడు.

తెలుగు సాహిత్యాన్ని తవ్వి ఇంగ్లీషులోకి అనువాదం చెయ్యమని కాళ్లు పట్టుకున్నంత పనిజేసాడు. ఇలాంటివి నా వరకూ ఎబ్బెట్టుగా ఉంటాయి.

అలా మొట్టమొదటిసారి అర్థమయ్యింది, పొగడ్తల్లో వుండే నిషా! ఇలా మొహమ్మీద ఎవరైనా పొగిడేస్తే కాస్త ఇబ్బందిగా వున్నా ఆ కిక్కే వేరబ్బా అనిపించింది ఆ క్షణంలో.

అలా మిథునం మళయాళంలో మెరిసింది తళుక్కుమని.

"స్టాలీ! నువ్వు లేకపోతే నా మిథునం గ్రహణంలా అయిపోయేది. నీ రుణం ఎలా తీర్చుకోగలను?" అన్నాడు. ఇలాంటివి నాకు మామూలేనంటూ రమ్మీ్మ భుజం తట్టాను.

"రమ్మీ్మ, మన తెలుగువాళ్లకి టేస్ట్ లేదురా! రిచర్డ్ అటెన్ బరోకి నీ కథ పంపాను. గాంధీ తీసిన తరువాత తీస్తానన్నాడు. ఎందువలన ఆ ప్రాజక్ట్ వెనకబడిపోయింది..." అన్నాను.

ఆరోజు అతని కళ్లల్లో కారిన రెండు కన్నీటి బొట్లూ ఇప్పటికీ మరవలేను.

*

ఇంకోసారి ఫ్లైట్లో అమెరికా వెళుతూండగా నా పక్క సీట్లో బాలు. బాలు అంటే అదే... తెలుగు వారి ఆరాధ్య గాయకుడు- ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం.

మాటల్లో నీ 'మిథునం' కథ గురించి చెప్పాను. పులకించిపోయాడు బాలూ. ఫ్లైట్ దిగ్గానే వాళ్ల వాళ్లకి ఫోన్ చేసి మిథునం కథ తెప్పించుకున్నాడు.

నా భుజాలు కుదిపేస్తూ, మంచి కథ అందించి నందుకు పాదాభివందనం చెయ్యాలనిపిస్తోందని అన్నాడు. పెద్దాయన్ని కష్టపెట్టడం ఎందుకని వద్దంటూ నివారించాను.

ఇది ఎవరైనా సినిమా తీస్తే నేనే నటిస్తాను, తప్ప మరొకరికి దక్కనివ్వనని బాలూ విమానం సాక్షిగా ప్రమాణం చేసాడు.

ముందు ఆ కథకి ఏఎన్నార్ అనుకున్నారట.

అది బాలుకు తెలిసి, తనకి పారితోషికం అక్కర్లే దనీ, తానే నటిస్తాననీ నన్ను బ్రతిమాలాడు. ఆయన బాధ చూళ్లేక నేనే నిర్మాతనీ, దర్శకుణ్ణీ ప్రాధేయపడ్డాను.

అలా మిథునం సినిమాకి చేతనైనంత సాయం చేయగలిగానన్న తృప్తి ఇప్పటికీ వుంది నాకు.

ఇదంతా చేసింది నా రమ్మీ కోసం.

మిథునం సినిమాగా తెలుగులో వచ్చింది; సినిమా చూసిన పుంజీడు ప్రాణులూ పట్టాభిషేకం చేసారు. దానికే మా రమ్మీ చంద్రుడికి గజం దూరంలో తేలాడు.

అదే అంటే - పొగడ్తంటే ఎవరికిష్టం వుండదట?

దేవుణ్ణి కూడా నువ్వు వాణ్ణి చంపావు, నువ్వింత గొప్పవాడివి అంటేనే కదా వరాలిస్తాడు? అని లాజిక్కు లాగేవాడు.

ప్రేమా, స్నేహం లాజిక్కుని డామినేట్ చేస్తాయి.

రమ్మీ అల్ప సంతోషి - వాడి సంతోషమే నాకు ముఖ్యం.

*

రమ్మీకి పద్మశ్రీ ఇప్పించమని చంద్రబాబునీ అడిగాను. అలాగే అన్నారు కానీ ఈలోగా తెలంగాణా, ఆంధ్రా విడిపోయాయి.

బాలమురళికి పద్మభూషణ్, నారాయణ రెడ్డికి జ్ఞానపీఠ్ వంటివి సిఫార్సు చెసి తెప్పించాను కానీ, నా ప్రియ నేస్తం రమ్మీకి ఏ బిరుదూ పదవి దక్కలేదన్న బాధ నన్ను వెంటాడుతూనే వుంటుంది.

నేను ఢిల్లీలో బిజీగా వుండడం వలన, అయిదేళ్లుగా రమ్మీని కలవాలని ఎంత ప్రయత్నించినా కుదరలేదు. ఈలోగా కోవిడ్, ఈ మధ్యన రష్యా యుక్రెయిన్ యుద్ధం.

ప్రపంచ సమస్యలు సర్దడంలోనే నా జీవితం తెల్లారిపోయింది. అమెరికాలో ట్రంపయితే చెప్పనే అవసరం లేదు. అతని నంబరు బ్లాక్ చేసేసాను.

అంతెందుకూ, ఈ మధ్య ఇంగ్లాండ్ రమ్మనమని రిషీ సునాక్ ఎన్ని మెసేజీలో.

ఈలోగా- ఈ దుర్వార్త!

వెంటనే వాళ్ల కుటుంబీకులతో మాట్లాడితే, స్టాలిన్ అంటూ పలవరించేవారని, నన్ను చూడాలనుందని చెప్పారు. కడుపు తరుక్కుపోయింది.

రమ్మీ- నీలాంటి స్థితప్రజ్ఞుడు తెలుగు సాహిత్యానికి దక్కిన వరం- అనుకుంటూ తృప్తి పడ్డాను.

మాటల్లో వ్యంగ్యం, చమక్కులతో సింగారించిన పదాలూ, సున్నిత హాస్యం ఇవన్నీ చాలురా నీకు; కోట్ల అవార్డులతో సమానం.

శ్రీ రమణా! నా ప్రియమైనా నేస్తమా, రమ్మీ...

తెలుగు సాహిత్యానికి నీవొక- 'బంగారు మురుగు'.

సాహిత్య కొలనులో నీవొక - నిష్కల్మష కమలం!

నిరాడంబరంగా జీవించావు; నిగర్విగా రచనలు చేసావు.

నువ్వెళ్లినా నీ కథలు ప్రతీ ఇంటా సాహిత్య తోరణాల్లా మెరుస్తూనే ఉంటాయి.

తెలుగునాట నాలాంటి స్టాలిన్లు నీలాంటి వారికోసమే పుడతారు.

నా జన్మ ధన్యమయ్యింది.


శెలవ్!

ఇట్లు

స్టాలీ అని నీ చేత ప్రేమగా పిలిపించుకునే

- నీ వెంకట సత్యస్టాలిన్

*A Pen photograph of Sri Ramana, using his impeccable style of narration of the book Venkata Satya Stalin: - By Sai Brahmanandam Gorti*






# చట్టాల అవగాహనకు చదవాల్సిన పుస్తకం

జీవితంలో ఎవరైనా కొంత ఆస్తి సంపాదించుకోవాలని అనుకుంటారు. సంపాదించుకున్న ఆస్తిని మరియు ఆ ఆస్తి నుండి వచ్చే వనరులను ఏ చిక్కులు, చికాకులు లేకుండా ప్రశాంతంగా అనుభవించాలనే కోరుకుంటారు. అలా ప్రశాంతంగా అనుభవించాలంటే ఆస్తిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఆస్తి యజమానుల పైనే ఉంటుంది. అలాగే మనిషి జీవితంలో ఒక కుటుంబం ఉంటుంది. ఆ కుటుంబంలో భార్యా భర్తలు, పిల్లలు మరియు ఇతర కుటుంబ సభ్యులు ఎందరో ఉంటారు. ఆస్తి లాగే కుటుంబ సంబంధాలు కూడా పదిలంగా కాపాడుకోవాల్సిన బాధ్యత ఆ కుటుంబ పెద్దతో సహా అందరి మీద ఉంటుంది. ఒక కుటుంబంలో ఉమ్మడి ఆస్తి, స్వార్జితమైన ఆస్తి ఉండవచ్చు. ఆస్తులు ఉన్నప్పుడు ఆస్తుల పట్లగాని కుటుంబ సభ్యుల మధ్య గాని కొన్ని కొన్ని సందర్భాల్లో సమస్యలు ఉత్పన్నం కావడం సహజమే. సమస్యలు ఎదురైనప్పుడు ఎవరైనాగాని కొంత ఘర్షణకు, సంఘర్షణకు మరికొంత ఆందోళనకు గురికాక తప్పదు. అప్పుడు వారికి చట్టపరమైన పరిజ్ఞానం లేకుంటే మరింత మానసికంగా కుంగిపోవాల్సి వస్తుంది, ఆరోగ్యం కూడా క్షీణిస్తుంది. చట్ట పరిజ్ఞానం లేదని చట్టం ఎవరినీ క్షమించదు కదా! ఎందుకంటే న్యాయ సూత్రాల ప్రకారం, తెలిసి చేసినా తెలియక చేసినా నేరం నేరమే అవుతుంది. అందుకే ప్రతి ఒక్కరూ చట్టం, న్యాయ సంబంధమైన అంశాలపై ఎంతో కొంత పట్టు సాధిస్తే వారిలో కొండంత ధైర్యం, నమ్మకం ఉంటుంది. సొంత అవసరాల కోసమైనా ప్రతి ఒక్కరూ మన చట్టాలను, శాసనాలను తెలుసుకోవాలి. అప్పుడే సమాజంలో మనుషులు అనవసరంగా, అకారణంగా గొడవలు పడరు, వివాదాలు సృష్టించుకోరు. చట్టం పరిధిలో ఆస్తులను కాపాడుకుంటూ, కుటుంబాలను రక్షించుకుంటూ, ప్రశాంతంగా జీవిస్తారు. ఇది ప్రత్యక్షంగా ప్రజలకు, పరోక్షంగా సమాజానికి ఎంతో లాభం చేకూర్చుతుంది. ఈ క్రమంలోనే సమాజ శ్రేయస్సు కోరి చట్టాలను పరిచయం చేయడానికి పూనుకొన్న రచయిత, అడ్వకేట్ జి. గంగాధర్. ఆయన కృషి ఫలితంగా 'మనం - మన చట్టాలు' అనే పుస్తకం వెలువడింది. దీని రాకతో చట్టాలపై సరైన అవగాహన కల్పించే ఒక చక్కటి దారి ఏర్పడింది.

ఈ పుస్తకంలో రచయిత ఎన్నో చట్టపర సమస్యలకు పరిష్కారాలు చూపారు. ఒక యన్.ఆర్.ఐ.కి వ్యవసాయ భూమి ఉండి ఆధార్ కార్డ్ లేకుంటే పట్టేదార్ పాస్ పుస్తకం (digital pattadar passbook) తీసుకోవచ్చా? కరోనా కాలంలో ఒక కొడుకు అమెరికాలో ఉన్నప్పుడు ఇండియాలో ఉన్న అతని తండ్రి మరణిస్తే, అక్కడే ఉన్న మరో కొడుకు తండ్రి కర్మకాండలు చేసినంత మాత్రాన సోదరుడి వాటా కూడా అతనికే చెందుతోందా? బ్యాంకులో లోన్ తీసుకున్న





సందర్భంగా డిపాజిట్ చేసిన కస్టమర్ ఒరిజినల్ డాక్యుమెంట్స్ బ్యాంక్ తిరిగి ఇవ్వకుంటే ఏం చేయాలి? ఎవరైనా ఒక వ్యక్తి కొనుగోలు చేసిన ప్రాపర్టీకి సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్స్ పోయినప్పుడు ఆ ప్రాపర్టీ అమ్మాల్సి వస్తే ఏం చేయాలి? కొనుగోలు చేసిన ప్రాపర్టీ డబల్ రిజిస్ట్రేషన్ జరిగితే ఆ ప్రాపర్టీ నష్టపోవడమేనా? ఒక ఫ్లాటు కొనే సమయంలో బిల్డర్ ఇచ్చే 60 పేజీల అగ్రిమెంట్‌లో అన్ని పేజీలపై సంతకాలు చేయాలా? విదేశాల్లో నివసిస్తున్న జంట వారి మేరేజ్ సర్టిఫికేట్ తీసుకోవడం ఎలా? సేల్ అగ్రిమెంటులో Time is essence of contract అని రాసుకున్నంత మాత్రాన అనివార్య కారణాలతో అగ్రిమెంట్ కాన్సిల్ అయితే అడ్వాన్స్ మనీ నష్టపోవాల్సిందేనా? అంతే కాకుండా సంచలనం సృష్టించిన ఆడబిడ్డల ఆస్తిహక్కు (daughter's right) పై సుప్రీంకోర్టు వెలువరిం చిన సమగ్రమైన తీర్పు పరిచయం, వీలునామా రిజిస్ట్రేషన్ గురించి, పవర్ ఆఫ్ అటార్నీల అవసరం, అప్పులకు సంబంధించిన అంశాలు, వైవాహిక సంబంధిత విషయాలు మరియు వ్యవసాయ భూములకు సంబంధించిన ధరణి పోర్టల్ పరిచయం మరెన్నో విభిన్నమైన అంశాల పైన ఫోకస్ చేసి రాసిన వ్యాసాలు, ప్రశ్నలు-జవాబులు ఈ పుస్తకంలో చోటు చేసుకున్నాయి.

కుటుంబం వెల కట్టలేనిది. ఆస్తులు మాత్రం విలువైనవి. సమయం అంతకన్నా విలువైంది. అలాంటప్పుడు హక్కులను, చట్టాలను తెలుసుకోకుండా సమస్యల సుడిగుండంలో చిక్కుకొని పోలీస్ స్టేషన్ల చుట్టూ, ప్రభుత్వ కార్యాలయ చుట్టూ మరియు కోర్టుల చుట్టూ తిరుగుతూ అమూల్యమైన సమయాన్ని, డబ్బుని వృధా చేసుకొని భవిష్యత్తును నష్టపోవాల్సిందేనా అనే ధర్మసంకటహరణకు అద్భుతమైన మార్గం 'మనం-మన చట్టాలు' పుస్తకం.

ఈ పుస్తకం విడుదలైన నెల రోజుల్లోనే ఒక వాణిజ్య సంస్థ తన కార్యాలయ సిబ్బంది శిక్షణ (training)లో భాగంగా వారికి చట్టపరమైన పరిజ్ఞానం అందించడానికి 100 కాపీలను ఒకేసారి కొనుగోలు చేసిందంటే ఈ పుస్తకం ప్రతి ఒక్కరికీ ఎంత అవసరమో అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి పుస్తకం మన చెంత ఉంటే ఎన్నో న్యాయపరమైన సమస్యలకు తక్షణమే సమాధానం దొరుకుతుంది. ఈ పుస్తకం చదివితే చాలా విషయాలపై ఒక అవగాహన కలుగుతుంది, అవసరమైనప్పుడు మరొకరికి సలహాలు కూడా ఇవ్వవచ్చు. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ పుస్తకం చట్టం, న్యాయం అనే అంశాలను ఏరి కూర్చిన ఒక ఫస్ట్ ఎయిడ్ బాక్స్.

తెలుగులో ఇలాంటి పుస్తకాలు అరుదు. ఈ పుస్తకం ముందు మాటలో తెలిపినట్లు లీగల్ అంశాలను చక్కగా పరిచయం చేస్తూ, చట్టపరమైన చిక్కులను సులువుగా విప్పి చెప్పిన మొట్టమొదటి పుస్తకం బహుశా ఇదే అవుతుంది.

సామాన్యుల నుండి మేధావుల దాకా చట్టాలు, హక్కులపై ఒక చక్కటి అవగాహన కల్పించే ఈ పుస్తకం కస్తూరి విజయం పబ్లికేషన్స్ వారి ప్రచురణ. 'ప్రింట్ ఆన్ డిమాండ్' పద్ధతిలో అమెజాన్‌లో (https://a.co/d/6X3ndU7) అందుబాటులో ఉంది. ❀



శ్రీ అట్లూరి & జలపతి

# తెలుగు అందానికి క్రేజ్... హీరోయిన్ల జాతకాలు తారుమారు

ఆకాశమంత అందం ఉన్నా ఆవగింజ అంత అదృష్టం దానికి తోడవ్వాలి. ఈ మాట నిజం అని చెప్పడానికి ఉదాహరణలుగా నిలుస్తున్నారు కొంత మంది హీరోయిన్లు. ముఖ్యంగా తెలుగు అమ్మాయి శ్రీలీల రాకతో అనేకమంది హీరోయిన్ల జాతకాలు మారి పోయాయి. ఒక్క తెలుగు అమ్మాయి పుంజుకుంటే తమిళ, కేరళ, ముంబై ముద్దుగుమ్మల హవాకి గండి పడింది.

రాఘవేంద్రరావు తీసిన పెళ్లి సందడి చిత్రంతో పరిచయమైన అచ్చ తెలుగు సుందరి శ్రీలీల. బెంగుళూరులో పుట్టి పెరిగిన శ్రీలీల ప్రస్తుతం ఎంబీబీఎస్ చదువుతోంది. చదువుతూనే నటిస్తోంది. ఆమె అందం కన్నా ఆమె అభినయం కన్నా ఆమె డ్యాన్స్ జనాలకు తెగ నచ్చింది. అంతే, చిత్రసీమ ఆమెకి పట్టం కట్టింది.



ఇప్పుడు ఆమె చేతిలో 10 చిత్రాలు ఉన్నాయి. అందులో బాలకృష్ణ, పవన్‌కళ్యాణ్, మహేష్‌బాబు, రామ్ పోతినేని, నితిన్, విజయ్ దేవరకొండ వంటి పేరొందిన కథానాయకుల సినిమాలే. అంటే ఇప్పుడు సగం సినిమా ఇండస్ట్రీ ఆమె గుప్పిట్లో ఉంది.

శ్రీలీల రాకతో పూజాహెగ్డే, కృతిషెట్టి లాంటి హీరోయిన్లకు అవకాశాలు తగ్గిపోయాయి. ముఖ్యంగా పూజ పరిస్థితి ఘోరం. ఏడాది క్రితం వరకు ఆమె తెలుగులో నంబర్ వన్ హీరోయిన్. ఇప్పుడు చేతిలో చెప్పుకోవడానికి ఒక్క చిత్రమూ లేదు. ఆమె చెయ్యాల్సిన అనేక చిత్రాలు శ్రీలీలకి దక్కాయి. పూజ ఇప్పుడు ఇంకో తెలుగు సినిమా ఒప్పుకోలేదు.

రాశిఖన్నా వంటి భామల కెరీర్ కూడా వేగంగా చివరిదశకు చేరు కుంది. దాదాపు పదేళ్ల నుంచి నటిస్తోంది రాశి. విజయాలు సరిగా లేకపోవడం, శ్రీలీల చిన్న సినిమాల నుంచి పెద్ద సినిమాల వరకు అన్నీ లాగేసుకోవడంతో రాశిఖన్నా తెలుగులో అవకాశాలు లేక చతికిలపడింది.

నభా నటేష్, మెహ్రీన్ వంటి కన్నడ, ముంబై భామల పరిస్థితి అయితే మరీ ఘోరం. ఇస్మార్ట్ శంకర్ తర్వాత సక్సెస్

అందుకోలేకపోయింది నభా. ఆ మొదటి హిట్ తర్వాత 4 సినిమాలు చేస్తే, అన్నీ పరాజయం పాలయ్యాయి.

నివేత పెతురాజ్, మెహ్రీన్‌ది కూడా దాదాపు ఇదే పరిస్థితి. దాస్ కా ధమ్కీ లాంటి సక్సెస్‌ఫుల్ మూవీ కూడా నివేత పెతురాజ్‌కు కలిసిరాలేదు. అందం ఉన్నప్పటికీ, కథల ఎంపికలో తప్పుడు నిర్ణయాలతో నివేత ఇబ్బంది పడుతోంది.

అటు మెహ్రీన్ అయితే తన అవకాశాల్ని తానే చెడగొట్టుకుంది. బొద్దుగా కనిపిస్తూ, టాలీవుడ్ జనాల్ని ఆకర్షించిన ఈ హీరోయిన్, ఆ తర్వాత స్లిమ్‌గా మారింది. తను మరింత గ్లామరస్‌గా మారానని మెహ్రీన్ అనుకుంది, కానీ టాలీవుడ్ మాత్రం మరోలా ఫీలైంది. ప్రస్తుతం ఈమె చేతిలో ఒకే ఒక్క సినిమా ఉంది. అది కూడా చిన్న చిత్రం. ఎఫ్ 2 వంటి భారీ విజయాలు చూసిన మెహ్రీన్ ఇప్పుడు చిన్న చిన్న సినిమాలకే పరిమితమైపోయింది.

అను ఎమ్మాన్యుయేల్, మేఘా ఆకాష్‌ల కెరీర్స్ కూడా ఇబ్బందికరంగానే ఉన్నాయి. *ఊర్వశివో రాక్షసివో* సినిమాతో హిట్ కొట్టిన అను, ఆ వెంటనే *రావణాసుర* సినిమాతో ఫ్లాప్ అందుకుంది. దీంతో పాటు మరో 4 ఫ్లాపులిచ్చింది. అలా అను, మేఘా ఆకాష్ వరుస ఫ్లాపులతో ఇబ్బంది పడుతున్నారు. లావణ్య త్రిపాఠి కూడా ఈ లిస్ట్‌లో ఉంది. *చావు కబురు చల్లగా, హ్యాపీ బర్త్ డే* సినిమాల తర్వాత ఈమె కెరీర్ దాదాపు ముగింపుకు వచ్చింది అనుకోవాలి. త్వరలోనే హీరో వరుణ్‌తేజ్‌తో ఆమెకి పెళ్లి. మరి పెళ్లి తర్వాత ఆమె సినిమాల్లో కొనసాగుతుందా, గ్యాప్ ఇస్తుందా అనేది చూడాలి. ప్రస్తుతానికైతే ఆమె చేతిలో ఓ వెబ్ సిరీస్ మాత్రమే ఉంది.

కొంతకాలం క్రితం వరకు తెలుగు దర్శక, నిర్మాతలు తమిళ, కేరళ, కన్నడ హీరోయిన్లను దిగుమతి చేసుకునేవారు. తెలుగు అమ్మాయిలకు చిన్న చిన్న చిత్రాలు మాత్రమే దక్కేవి. పెద్ద హీరోల సినిమాలలో తెలుగు అమ్మాయిలను తీసుకునేవారు కాదు. కానీ శ్రీలీల ఈ పద్ధతికి ముగింపు పలికేలా చేసింది. ఇప్పుడు ఇతర భాషలకు చెందిన హీరోయిన్లను చిన్న చిత్రాలకు పరిమితం చేస్తున్నారు



పాన్ ఇండియా చిత్రాలు వరకు మాత్రం బాలీవుడ్ హీరోయిన్లను తీసుకుంటున్నారు. కియరా అద్వానీ, జాన్వికపూర్ లాంటి బాలీవుడ్ భామలు ప్రస్తుతం *దేవర, గేమ్ ఛేంజర్* వంటి పాన్ ఇండియా చిత్రాల్లో నటిస్తున్నారు. శ్రీలీల ఇంకా విజయం సాధిస్తే ఆ భామ అవి కూడా లాగేస్తుంది.

అయితే, ప్రస్తుతం శ్రీలీల తప్ప ఇతర తెలుగు అమ్మాయిలు అంత పాపులర్ కాలేదు. బేబీ అనే సినిమాతో వైష్ణవి అనే అమ్మాయి తాజాగా పేరు తెచ్చుకొంది. హైదరాబాద్‌కి చెందిన ఈ తెలుగు అమ్మాయికి ప్రస్తుతం చిన్న చిత్రాలు దక్కుతున్నాయి. రీతూ వర్మ వంటి తెలుగు అమ్మాయిలు మాత్రం ఇంకా అవకాశాల కోసం ఇబ్బంది పడుతున్నారు. మరో, నలుగురైదుగురు తెలుగు శ్రీలీలలు వస్తేనే మొత్తం పరిస్థితి మారుతుంది. జయప్రద, జయసుధ, శ్రీదేవి వంటి తెలుగు భామలు ఒకప్పుడు సినిమా ఇండస్ట్రీని ఏలిన పరిస్థితి మళ్లీ వచ్చేఅవకాశం ఉంది.

కాకపోతే, ఒక్క శ్రీలీల సక్సెస్ అయితే సరిపోదు. ఒక్క తెలుగు అమ్మాయి విజయం సాధిస్తేనే ఇంత మార్పు వస్తే... మరో నలుగురైదుగురు తెలుగు అమ్మాయిలు పాపులర్ అయితే ఇక వేరే భాషల భామలను మన నిర్మాతలు, దర్శకులు తీసుకోరు అని మాత్రం కచ్చితంగా చెప్పగలం. ❀

# WE ARE LOOKING for FRANCHISEE PARTNERS

CURIE LEARNING

*learning with the leader ...*





Curie Learning is a leading provider of customized after school learning programs for students Pre-K through high school.

**Our Programs:**

- K to Grade 7 Advanced Math & English program
- Specialized coaching for Magnet / Gifted and Talented School Entrance
- SAT / PSAT / ACT Specialized Coaching
- Creative English Writing
- Competitive Math Coaching
- S T E M Programs and other Academic Camps

## OTHER LOCATIONS

| | |
|---|---|
| Gainesville - VA | gainesville.va@curielearning.com |
| Ellicott City - MD | ellicottcity.md@curielearning.com |
| German Town - MD | germantown.md@curielearning.com |
| Edison - NJ | edison.nj@curielearning.com |
| Exton - PA | exton.pa@curielearning.com |
| Cumming - GA | curie.atlanta@gmail.com |
| Frisco - TX | frisco.tx@curielearning.com |
| Troy - MI | troy.mi@curielearning.com |
| Plymouth - MN | plymouth.mn@curielearning.com |
| Richmond - VA | richmond.va@curielearning.com |
| Apex - NC | apexcurie@gmail.com |
| Sunnyvale - CA | sunnyvale.ca@curielearning.com |

To know more about franchisee opportunity write to :

**rao@curielearing.com**

**or call on**

**703 582 0436 or 703 762 6120**

**Corporate Centers**

HERNDON.VA : herndon.va@curielearning.com

SOUTHRIDING.VA : southriding.va@curielearning.com

ASHBURN.VA : ashburn.va@curielearning.com

www.curielearning.com

**One stop solution for your child's academic needs...**